thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 98 కరీంనగర్ మంగళవారం, 17 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా రాత్రి నుంచి ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు.

# స్థానిక పోరుకు సై...

## జులైలోనే లోకల్ బాడీ ఎలక్షన్లు!




## మంత్రుల సమావేశంలో కీలక నిర్ణయం!

హైదరాబాద్: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు ఒక అడుగు ముందుకు పడింది. ఇవాళ నిర్వహించిన మంత్రుల సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. జులైలో లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలా..? లేదా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్ పెట్టి తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలా..? అన్నదానిపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇవాళ కీలక అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా రైతుభరోసా, స్థానిక సంస్థల ఎన్నికలపైనే డిస్కషన్ జరిగింది. ఇవాళ్టి సమావేశంలో స్థానిక ఎన్నికలపై కీలక నిర్ణయం వెలువడనుందని అంతా భావించారు. అనుకున్నట్టుగానే నిర్ణయం వెలువడినా ఏ ఎన్నికలు ముందుగా నిర్వహిస్తారనేది కేబినెట్ సమావేశంలోనే తేల్చే అవకాశం ఉంది.

## జెడ్పీటీసీలు ముందా..? సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడనేది త్వరలో క్లారిటీ

### ఏ ఎన్నికలు ముందు నిర్వహించాలన్నదానిపై కేబినెట్లో చర్చించి డెసిషన్‌ఎం

ఎన్నికల సన్నద్ధతను సీఈవో కు తెలియజేస్తే రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేస్తుంది. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి. ఎంపీటీసీలను, జెడ్పీటీసీలను ఓటర్లు ఎన్నుకుంటారు. ఎన్నికైన ఎంపీటీసీలు మండల పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అలాగే జెడ్పీటీసీలు జిల్లా పరిషత్ ఛైర్మన్ ను ఎన్నుకుంటారు. పంచాయతీ ఎన్నికల విషయానికి వస్తే.. ఓటర్లు వార్డు సభ్యులకు, సర్పంచ్ కు నేరుగా ఓటు వేస్తారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. ఇండిపెండెంట్ గుర్తులపైనే ఎన్నికలు జరుగుతాయి. వార్డు సభ్యులు ఉపసర్పంచ్ ను ఎన్నుకుంటారు. దీంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కనుంది.

## వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు ఉండాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: వైద్య శాఖ అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ (సోమవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణ, ఇతర అంశాలపై సీఎం చర్చించారు. ఈ సమీక్షకు మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యశాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అన్ని కళాశాలల్లో మూడేళ్లలోగా వసతుల నిర్మాణం పూర్తి అవ్వాలని నిర్దేశించారు. ప్రతి కళాశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు అధికారుల కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. వైద్య కళాశాలల అవసరాలు, నిధుల వివరాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీల భర్తీ, సిబ్బంది ప్రమోషన్లపై చర్చించారు. అనుబంధ ఆస్పత్రుల్లో పరికరాలు, సరిపడా పడకలను పెంచాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ అనుమతులకు తాను చొరవ తీసుకుంటానని తెలిపారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ భాషను ఆప్షనల్‌గా బోధించాలని కోరారు. జపాన్‌లో తెలంగాణ నర్సులకు డిమాండ్ ఉందని అన్నారు. ఆస్పత్రుల్లో రోగులు, వైద్యుల మానిటరింగ్ కోసం యాప్‌పై అధ్యయనం చేయాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలపై ప్రతి నెల మూడో వారం సమీక్ష నిర్వహించాలని వైద్యశాఖ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.




## హరీష్ రావుకు అస్వస్థత.. ఆస్పత్రిలో చేరిక..


హైదరాబాద్: మాజీ మంత్రి హరీష్ రావు అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యం కారణంగా బేగంపేట సన్ షైన్ కిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైరల్ ఫీవర్ వలన ఆయన ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. కేటీఆర్ ఏసీబీ విచారణ నేపథ్యంలో హరీష్ ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలంగాణ భవన్‌లోనే ఉన్నారు. అక్కడే అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

**కేటీఆర్ వ్యక్తి కాదు శక్తి : హరీష్...** కేటీఆర్ సోమవారం ఉదయం ఏసీబీ విచారణలో పాల్గొన్నారు. సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. ఏసీబీ అధికారులు దాదాపు 7 గంటల పాటు విచారణ చేశారు. కేటీఆర్ విచారణ నేపథ్యంలో హరీష్ ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలంగాణ భవన్‌లోనే ఉన్నారు. కేటీఆర్ విచారణ ముగిసిన తర్వాత హరీష్ రావు మాట్లాడుతూ.. 'కేటీఆర్ వ్యక్తి కాదు శక్తి. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు. కేటీఆర్, బీఆర్ఎస్ కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తల మీద కేసులు పెడుతున్నాడు. తుమ్మినా, దగ్గినా కేసులు పెడుతున్నాడు. రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నాడు'అంటూ మండిపడ్డారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే.. రేవంత్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు పోవాలి



సిద్దిపేట: తప్పుచేసిన వారు ఎవరైనా ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేసులు ఎదుర్కోవాల్సిందే.. శిక్ష అనుభవించాల్సిందేనని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఇవాళ(సోమవారం) సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీహెచ్‌ఆర్ నగర్‌లో హాస్టల్ ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. విచారణ నిజాయితీగా జరగాలని కోరారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందనేది అందరూ చెబుతున్న మాట అని చెప్పారు ఎంపీ రఘునందన్‌రావు. కాళేశ్వరం అవినీతికి గత ముఖ్యమంత్రి కేసీఆర్, గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులు, అధికారులు బాధ్యత వహించాలని, విచారణ త్వరగా పూర్తి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. 18 నెలలుగా కాళేశ్వరం విచారణ కమిషన్ సమయాన్ని రేవంత్ ప్రభుత్వం రెండేసి నెలలుగా పెంచుకుంటూ పోవడంతో ప్రజల్లో కక్ష సాధింపు చర్యలనే అనుమానం కలుగుతోందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తెలంగాణలో ఎదుగుతున్న బీజేపీని కనపడనీయకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నా రని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంపీ రఘునందన్‌రావు. కేసీఆర్, కేటీఆర్, కవితలది ఇంటి సమస్య, పైసల పంచాయితీ, రాజకీయ వారసత్వ పంచాయితీ అని ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. కవిత ఏం మాట్లాడుతుందో ఆమెకే తెల్వదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు తాము అధిక ప్రాధాన్యం ఇస్తామని.. పోటీ చేసే వారిని తప్పకుండా గెలిపించుకుంటామని ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి వర్గంలో నూటికి 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు పోవాలని కోరారు. బీసీల పక్షాన బరాబర్ బీజేపీ ప్రశ్నిస్తోందని అన్నారు. బీసీ రిజర్వేషన్లు కోసం కొట్లాడుతామని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు.




# రైతన్నలూ... డబ్బులు పడ్డాయ్..

## బ్యాంక్ ఖాతాలు చెక్ చేసుకోండి..

హైదరాబాద్: రైతు భరోసా నిధులను రేవంత్ ప్రభుత్వం ఇవాళ(సోమవారం) విడుదల చేసింది. రైతు నేస్తం వేదిక నుంచి ఆన్‌లైన్ మీట నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రైతును రాజుగా చేయడమే కాదు.. వ్యవసాయాన్ని పండుగ చేస్తామని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి. రైతు భరోసా వేయగానే విస్తృత ప్రచారం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. 18 నెలల్లో రైతాంగం కోసం రూ.లక్ష కోట్లు కేటాయించామని చెప్పుకొచ్చారు. రుణమాఫీ చేయకుండా రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం దిగజారిన ఆర్థిక వ్యవస్థను తమకు అందించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తమ ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. రుణమాఫీపై ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రైతుల పేరుతో నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. వరి సాగు వేస్తే ఉరి వేసుకోవాల్సిందేనని మాజీ సీఎం కేసీఆర్ గతంలో చెప్పారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు రైతు పండించిన చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు గెలవాలంటే రైతన్నల ఆశీర్వాదం తప్పనిసరిగా ఉండాల్సిందేనని.. ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**పంట పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా: మల్లు భట్టి విక్రమార్క...** అన్నదాతల అందరి ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రైతు భరోసా డబ్బు మొత్తం జమ చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు పంట పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా వేస్తామని అన్నారు. రైతుల కోసం ప్రతి సంవత్సరం రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్, వ్యవసాయానికి విడదీయరాని అనుబంధం ఉందని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్ల పంట పరిహారం గురించి ఎందుకు పట్టించుకోలేదని మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు.

**నేటి నుంచే రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు....** నేటి నుంచే రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా వేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ఎంత కష్టమైనా వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని అన్నారు. దేశంలో నంబర్‌వన్‌గా తెలంగాణ రైతులను నిలిపే బాధ్యతను రేవంత్ సర్కార్ తీసుకుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

**అందుకే.. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నాం: సీఎం రేవంత్...** "వరి వేస్తే ఉరి వేసుకున్నట్లు అని ఆనాడు పెద్ద మనిషి చెప్పారు. రైతులను వరి వేయొద్దని చెప్పి తన ఫామ్హౌస్లోని 150 ఎకరాల్లో వరి వేశారు. క్వింటాల్కు రూ. 4వేల చొప్పున అమ్ముకున్నారు"అని సీఎం రేవంత్రెడ్డి చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా కొత్త రైతువేదికల్లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రజలు దొడ్డు బియ్యం తినట్లేదని, సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందుకే క్వింటాల్కు రూ.500 బోనస్ ఇస్తూ సన్నవడ్ల సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్: "వరి వేస్తే ఉరి వేసుకున్నట్లు అని ఆనాడు పెద్ద మనిషి చెప్పారు. రైతులను వరి వేయొద్దని చెప్పి తన ఫామ్హౌస్లోని 150 ఎకరాల్లో వరి వేశారు. క్వింటాల్కు రూ. 4వేల చొప్పున అమ్ముకున్నారు"అని సీఎం రేవంత్రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రైతువేదికల్లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రజలు దొడ్డు బియ్యం తినట్లేదని, సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందుకే క్వింటాల్కు రూ.500 బోనస్ ఇస్తూ సన్నవడ్ల సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.



## పొంగులేటిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం

హైదరాబాద్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలపై పొంగులేటి ప్రకటన చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. క్యాబినెట్‌లో చర్చించాల్సిన అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అని సీరియస్ అయ్యారు. పార్టీలో చర్చించకుండా అలాంటి ప్రకటనలు చేయొద్దన్నారు. ఒకరి మంత్రిత్వశాఖ అంశంపై వేరొకరు మాట్లాడటం ఏంటని మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై మంత్రులు మాట్లాడేటప్పుడు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మంత్రులు వారి శాఖల పరిధిలోని అంశాలపైనే మాట్లాడాలని.. సున్నిత, కోర్టు పరిధిలోని అంశాలపై మాట్లాడేప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు.



## ఖాజాగూడలో భూఆక్రమణలపై నలుగురు ఎమ్మెల్యేల పిల్

హైదరాబాద్: శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటూ నలుగురు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మురళీనాయక్ పిల్ దాఖలు చేశారు. దీనిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఖాజాగూడలోని సర్వే నెంబర్ 119, 122లో ఉన్న 27.18 ఎకరాల భూమిని ఆక్రమించారన్నారు. సర్వే నెంబర్ మార్చి పోరంబోకు భూమిని ఆక్రమించారని చెప్పారు. భూమి విలువ రూ.10 వేల కోట్లు ఉంటుందని తెలిపారు. రంగారెడ్డి కలెక్టర్ 2023లో నిరభ్యంతర పత్రం జారీ చేయడంతో జీహెచ్‌ఎంసీ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని న్యాయవాది పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో 8 టవర్లు నిర్మిస్తున్నారని.. ఒక్కో దాంట్లో 47 అంతస్తులు ఉన్నాయని వివరించారు. ఇవన్నీ ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. మరోవైపు ఓ ప్రేవేటు పాఠశాలకు 150 మీటర్ల పరిధిలోనే రెడీమిక్స్ ప్లాంటు ఏర్పాటు చేశారని చెప్పారు.

దీంతో పర్యావరణం కాలుష్యమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని న్యాయవాది వివరించారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని చిక్కుడు ప్రభాకర్ కోర్టును కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం.. ప్రభుత్వం, రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, రంగారెడ్డి కలెక్టర్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, హైడ్రాకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.



## కొత్త రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభం

రంగారెడ్డి: రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రైతువేదికల్లో 'రైతునేస్తం' కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రగనర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది రైతులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఆడిటోరియం నుంచి మరో 1034 రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రైతులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతువేదికల్లో సీఎం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ప్రత్యక్షప్రసారం చేసింది.

**9 రోజుల్లో రైతు భరోసా పంపిణీ పూర్తి: భట్టి విక్రమార్క...** ఇవాళే రైతు భరోసా నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎకరాల వారీగా కాకుండా అర్హులైన వారందరికీ ఒకేసారి రైతుభరోసా ఇస్తామన్నారు. " 1 కోటి 49 లక్షల 35 వేల ఎకరాలకు రైతు భరోసా నిధులు వేస్తాం. పరిమితి లేకుండా అర్హులైన ప్రతిరైతుకు రైతుభరోసా ఇస్తున్నాం. ఎన్నికరాలు ఉన్నా అన్ని భూములకు సాయం అందజేస్తాం. 9 రోజుల్లోనే అందరికీ రైతుభరోసా పూర్తి చేస్తాం" అని భట్టి తెలిపారు.

## రేవంత్ ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసింది: హరీష్‌రావు

హైదరాబాద్: రేవంత్ ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేసిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శలు చేశారు. వైద్య కళాశాలల్లో కనీస వసతులు లేవని ఎన్‌ఎంసీ లేఖ రాసిందని గుర్తుచేశారు. తెలంగాణలో కనీసం కోవిడ్ కిట్లు లేవని మండిపడ్డారు. దేశంలో 90వేల కరోనా కేసులు ఉంటే.. రాష్ట్రంలో కనీసం కోవిడ్ టెస్ట్‌లు కూడా చేయడం లేదని ధ్వజమెత్తారు. ఇవాళ (సోమవారం) తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ ప్రభుత్వానికి ఏ విషయంలోనూ స్పష్టత లేదని మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పారు. రుణమాఫీ, రైతుభరోసా, యువవికాసం... ఇలా అన్ని అంశాల్లోనూ ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిందేమీ లేదు... కానీ, ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో సీఎం క్యాంపు కార్యాలయం మాత్రం సిద్ధమైందని చెప్పుకొచ్చారు. సీఎం క్యాంపు కార్యాలయం కోసం రోడ్డును కూడా విస్తరణ చేస్తున్నారని అన్నారు. నలుగురు ఎమ్మెల్యేలు హైకోర్టుకి వెళ్లడం అంటే సొంత ప్రభుత్వంపై తిరుగుబాటు అన్నట్లేనని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లేకపోతే... 30టీఎంల నీళు హైదరాబాద్‌కి ఎక్కడ నుంచి తీసుకువస్తారని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నించారు. గోదావరి – బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన డాక్యుమెంట్, లేఖల ఆధారంగానే తాను మాట్లాడానని స్పష్టం చేశారు. 90శాతం విషయాలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. రేవంత్ ప్రభుత్వంలో పనిచేసే వారికి ఈ విషయాలు తెలియవు, నేర్చుకోరని ఎద్దేవా చేశారు. గోదావరి – బనకచర్ల గురించి ఇప్పటికే చాలాసార్లు తాను మాట్లాడానని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కూడా లేఖ రాశానని గుర్తుచేశారు. తాను ఉన్న వాస్తవాలు మాట్లాడితే కాంగ్రెస్ నేతలు లీకులు అంటూ ఏవేవో మాట్లాడుతున్నారని హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.





## ఇజ్రాయెల్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ క్షిపణి దాడి

ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి టెల్‌అవీవ్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాన్ని తాకింది. ఈ ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకొంది. ఈ దాడిలో కార్యాలయం స్వల్పంగా దెబ్బ తింది. ఈ విషయాన్ని అమెరికా దౌత్యవేత్త మైక్ హకేబీ ధ్రువీకరించారు. అయితే ఈ ఘటనలో సిబ్బంది ఎవరూ గాయపడలేదని వెల్లడించారు. టెల్ అవీవ్, జెరూసలెంలోని కార్యాలయాలు మూసే ఉంటాయని ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొన్నారు.

**టెహ్రాన్ వాసులు మూల్యం చెల్లిస్తారు..** తమ పౌరులపై ఇరాన్ చేస్తున్న దాడులకు టెహ్రాన్ నగర ప్రజలు మూల్యం చెల్లించుకొంటారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఖట్జ్ ప్రకటించారు. గత రాత్రి ఆ దేశం చేసిన దాడిలో ఐదుగురు మరణించగా.. డజన్ల కొద్దీ పౌరులు గాయపడ్డారన్నారు. ఈసందర్భంగా ఇరాన్ సుప్రీంనేత ఖమేనీని ఉద్దేశించి ఖట్జ్ తన టెలిగ్రామ్ ఛానెల్‌లో ఓ పోస్టు పెట్టారు. " గర్వం నిండిన ఆ నియంత ఇప్పుడు హంతకుడిలా మారాడు. ఉద్దేశపూర్వకంగానే మా సైన్యాన్ని భయపెట్టి ఆపరేషన్‌ను నిలిపివేయించాలనే ఉద్దేశంతో మా పౌరుల గృహాలను లక్ష్యంగా చేసుకొంటున్నాడు. టెహ్రాన్‌వాసులు దీనికి అతిత్వరలోనే మూల్యం చెల్లిస్తారు" అని హెచ్చరించారు. ఇరాన్ ఆయుధ తయారీ కర్మాగారాల సమీపంలో నివసించే పౌరులు వెంటనే ఆ ప్రదేశాలను ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ 'ఎక్స్'లో పేర్కొంది.

**కొనసాగుతున్న దాడులు..** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య దాడులు కొనసాగుతున్నాయి. టెల్‌అవీవ్ ఫైటర్ జెట్లు ఇరాన్ ఐఆర్‌జీసీకి చెందిన ఖుద్స్ ఫోర్స్ హెడ్‌క్వార్టర్‌ను లక్ష్యంగా చేసుకొన్నాయి. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఈ దళం ఎన్నో కోవర్ట్ ఆపరేషన్లు నిర్వహించిందని ఐడీఎఫ్ ప్రతినిధి వెల్లడించారు. ఇక ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని పవర్ గ్రిడ్ తీవ్రంగా దెబ్బతింది. ఈవిషయాన్ని ఆ దేశ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ ధ్రువీకరించింది. దీంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు చేపడుతోంది. త్వరలోనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ఇక కీలక ఓడరేవు నగరమైన హైఫా లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులు చేస్తోంది. తాజాగా అక్కడ చమురు నిల్వలు, ఇతర భవనాలను లక్ష్యంగా చేసుకొంటోంది. నేటి తెల్లవారుజామున అక్కడి రిఫైనరీపై ఇరాన్ క్షిపణులు విరుచుకుపడ్డాయి.



## మాపై అణుదాడికి దిగితే.. పాక్ ప్రతిదాడి చేస్తుంది

ఇజ్రాయెల్ తమపై అణుబాంబును ప్రయోగిస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగి దానిపై న్యూక్లియర్ అటాక్ చేస్తుందని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ జనరల్ మొహసిన్ రెజాయి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ప్రభుత్వం అధీనంలోని టెలివిజన్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. "ఇజ్రాయెల్ మాపై అణు దాడి చేస్తే.. ఇస్లామాబాద్ కూడా టెల్‌అవీవ్‌పై అణుబాంబును ప్రయోగిస్తుందని పాక్ నుంచి హామీ లభించింది" అని మొహసిన్ వెల్లడించారు. ఆయన ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో సభ్యుడు కూడా. అంతేకాదు.. తుర్కియే, సౌదీ, పాకిస్థాన్ ఇతర దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటుచేయాలని మొహసిన్ అన్నారు. కానీ, ఆయా దేశాలు ఇరాన్ యూనిఫామ్ వేసుకోవడానికి సిద్ధంగా లేవన్నారు. వీటిల్లో ఒక్క దేశమైనా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే రాత్రికి రాత్రే ప్రాంతీయ బలాబలాలు మారిపోతాయన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అణ్వాయుధాలున్న దేశాల్లో ఇజ్రాయెల్, పాకిస్థాన్ స్థానం దక్కించుకొన్నాయి. ఈ జాబితాలో అమెరికా, రష్యా, ఫ్రాన్స్, భారత్, ఉత్తర కొరియా కూడా ఉన్నాయి.

## ఈ నెల 17 నుంచి రైతు భరోసా: తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: ఈ నెల 17 నుంచి రైతు భరోసా నిధులు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులతో సమావేశం తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా సీఎం చర్చించారు. జిల్లా ప్రజాప్రతినిధులతో ఇంఛార్జి మంత్రులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. పాతబస్తీ మెట్రో కనెక్టివిటీ ప్రాజెక్టుకు రూ.125 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025–26 బడ్జెట్‌లోనే రూ.500 కోట్లు కేటాయించింది. అందులోనుంచి రూ.125 కోట్లు విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు ఇచ్చింది. వేములవాడ అభివృద్ధికి రూ. 25కోట్లు మంజూరు చేసింది.



## కేటీఆర్‌కి జైలుకు వెళ్లాలని ఉన్నట్లుంది!

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు వారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని తాను చెప్పలేదని, వారంలోగా స్పష్టత వస్తుందని మాత్రమే చెప్పానని మంత్రి సీతక్క తెలిపారు. కేబినెట్‌లో నిర్ణయం తీసుకోకుండా ఎలా చెబుతానని అన్నారు.

సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. " స్థానిక సంస్థల ఎన్నికలపై ఇవాళ స్పష్టత వస్తుందని భావిస్తున్నాను. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నాయి. బీసీలకు రిజర్వేషన్ల అంశంపై ఎలా ముందుకు వెళ్లాలో ఇవాళ స్పష్టత వస్తుందని భావిస్తున్నా. జైలుకు వెళ్లాలని కేటీఆర్‌కు కుతూహలంగా ఉన్నట్లుంది. కవిత జైలుకు వెళ్లి రాగానే లిక్కర్ కేసుపై దృష్టి మళ్లించేందుకు బీసీలు, మహిళలు, దళితులపై ప్రేమ ఒలకబోస్తున్నారు. సానుభూతి కోసమో, లేదంటే ప్రజలను రెచ్చ గొట్టేందుకో జైలుకు వెళ్లాలని ఆయన భావిస్తున్నట్లున్నారు. ప్రభుత్వం చట్టప్రకారమే నడుస్తుంది.

ఎలాంటి కక్షలు లేవు. ప్రభుత్వం కక్ష సాధింపులకే పాల్పడితే.. ప్రభుత్వం రాగానే వాళ్లను జైల్లో వేసే వాళ్లం కదా. కక్షలు, కార్పణ్యాలు భారాస వాళ్లకే ఉంటాయి. సీఎం రేవంత్‌రెడ్డి పౌరుషంతో మాట్లాడితే.. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నారు" అని సీతక్క విమర్శించారు.


హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట కలిగింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2021 నవంబర్ 15న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా భారీ వాహనాలతో కాన్వాయ్ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా.. తాజాగా హైకోర్టు కొట్టివేసింది.



## బండి సంజయ్‌కి హైకోర్టులో ఊరట

# గారడీ మానసిక విద్య కాదు... శ్రమతో కూడిన ప్రదర్శన కళ

## జూన్ 17...ప్రపంచ గారడీ దినోత్సవం




ప్రపంచ గారడీ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 17న జరుపు కుంటారు. ఇది అంతర్జాతీయ గారడీ సంఘం స్థాపించబడిన రోజును పురస్కరించుకుని నిర్వహిస్తారు. ప్రపంచం అనేది కేవలం భౌతికంగా కనిపించే పదార్థాల సమాహారం మాత్రమే కాదు. మానవ భావాలు, ఊహలు, కల్పనలు, ఆశ్చర్యం, సృజనాత్మకత అన్నీ ఈ ప్రపంచానికే చెందినవే. ఈ భావాలన్నింటిని ఒకే వేదికపై చైతన్యవంతంగా ఆవిష్కరించగలిగే కళగానే గారడీ (మాజిక్)ని పేర్కొనవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 17 న జరుపుకునే ప్రపంచ గారడీ దినోత్సవం, మాయాజాలపు కళను, దానిలోని మానవ నైపుణ్యాన్ని, సృజనాత్మకతను స్మరించుకునే ప్రత్యేక సందర్భం. గారడీ అనేది కేవలం మోసం చేయడానికి ఉపయోగించే మానసిక విద్య కాదు. ఇది శ్రమతో కూడిన ఒక ప్రదర్శనా కళ. గారడీ ప్రదర్శనల వెనుక అత్యున్నత స్థాయి అభ్యాసం, ఖచ్చితమైన సమన్వయం, శాస్త్రీయమైన, మానసిక గమనాన్ని అంచనా వేసే సామర్థ్యం పనిచేస్తాయి. ఈ కళ ప్రధానంగా మూడు విభాగాలుగా విభజించవచ్చు ం చేతివాటం ఆధారిత ట్రిక్కులు, మానసిక మాయ, భ్రమ పూరిత ప్రదర్శనలు. ఈ ప్రతి విభాగం వేర్వేరు నైపుణ్యాలను, శ్రమను, ప్రేక్షకుల మనసును ఆకట్టుకునే సృజనను కలగలిపి ఉ ంటాయి. గారడీకి చారిత్రకంగా గొప్ప వారసత్వం ఉంది. ప్రాచీన ఈజిప్ట్‌లోని పిరమిడ్ల ముందు మాయగాళ్లు ప్రదర్శనలు ఇస్తుండటం, రోమన్ల రాజసభలలో మాయాజాల కళాకారుల ఆకట్టుకోవడం, భారతదేశంలో తంత్ర, మంత్ర విద్యలతో మాయ కలసి ఆధ్యాత్మిక అనుభూతులుగా ఎదగడం గారడీ స్థాయిని, వ్యాప్తిని సూచిస్తుంది. చైనాలోనూ గారడీ ఓ ప్రజాప్రియ కళగా రాజసభల నుంచి వీధుల వరకూ ఆహ్లాదంగా వ్యాపించింది. ఆధునిక యుగంలో, ఈ కళ మరింత శాస్త్రీయంగా, వినోదాత్మకంగా వికసించింది. ప్రపంచంలో గారడీని ప్రాచుర్యం పొందేలా చేసిన మహానుభావులెన్నో ఉన్నారు. హౌదినీతో పాటు హెూవార్డ్ థర్స్టన్, డేవిడ్ కాపర్‌ఫీల్డ్, క్రిస్ ఏంజెల్, డైనమో వంటి పేర్లు ప్రపంచ మాయా రంగాన్ని మారుస్తూ వచ్చాయి. వీరంతా మాయను వినోదంగా మాత్రమే కాకుండా, ఆశ్చర్యంగా మార్చిన కళాకారులు. వీరందరి ప్రదర్శనల వల్ల మానవ మేధస్సు ఎంతటి సృజనాత్మకతను, విశ్లేషణాత్మకతను ప్రదర్శించగలదో మనం తెలుసుకున్నాం. ప్రపంచ గారడీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలల నుండి కళాకేంద్రాల వరకూ మాయా ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, గారడీ పరికరాల ప్రదర్శనలు, చరిత్రపై అవగాహన కార్యక్రమాలు, బాలల కోసం శిక్షణ శిబిరాలు నిర్వహించ బడతాయి. సామాజిక మాధ్యమాల్లో గారడీ ప్రదర్శనలకు సంబంధించిన వీడియోలు, అనుభవాలు, శిక్షణలు, హ్యాష్‌టాగ్‌తో పంచుకుంటారు. కళాకారుల ప్రతిభను గౌరవిస్తూ ప్రత్యేక అవార్డులు ప్రదానం చేస్తారు. ఇదే సమయంలో గారడీ కళను ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేయడానికి నిధుల సేకరణ కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయి. ఈ సందర్భంగా మనం గుర్తుంచుకోవలసిన ప్రధాన విషయం ఏమిటంటే ం గారడీ అనేది మోసం కాదు, మేధస్సుతో కూడిన కళ. చిన్నారుల్లో విజ్ఞాన దృష్టిని, ఊహాశక్తిని పెంపొందించడానికి ఇది ఉపయోగ పడుతుంది. ఒకప్పుడు అపోహలతో చుట్టు పెట్టబడిన ఈ కళను, నేడు ఒక శాస్త్రీయ ఆర్ట్ ఫార్మ్‌గా అంగీకరించడం అభినందనీయం. ఇప్పటికీ కొన్ని గ్రామీణ ప్రాంతాలలో మాయవాదులపై అపార్థాలున్నప్పటికీ, గారడీ అనేది శ్రమతో కూడిన, శాస్త్రీయంగా అలరించే కళ అని స్పష్టత అవసరం. ప్రపంచ గారడీ దినోత్సవం కేవలం ఒక వేడుకే కాదు ం ఇది కళను గౌరవించే సందర్భం. అది మానవ ఊహా వైభవాన్ని, అద్భుతాలను సృష్టించే సామర్థ్యాన్ని చాటే ఒక మేల్కొలుపు. ఈ రోజున మనం గారడీ కళాకారులకు మన గౌరవాన్ని తెలియ జేయాలి. భావనా ప్రపంచాన్ని పరవశింపజేసే ఈ మాయాజాల కళను భవిష్యత్ తరాలకూ చేరవేస్తూ ం ఆశ్చర్యానికి, ఆనందానికి, ఊహా ప్రయాణాలకు నూతన ద్వారాలు తెరవాలి. గారడీ మన జీవితాల్లో చిన్నచిన్న అద్భుతాలనైనా నింపగలదన్న నమ్మకాన్ని నూరిపోసే ఈ దినోత్సవాన్ని అర్థవంతంగా జరుపుకోవాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ముచ్చటగా మూడోసారి ఆర్‌బీఐ సవరించింది. ఈసారి రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. తాజా తగ్గింపుతో రెపో రేటు 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో కలుపుకుంటే.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు ఒక శాతం వరకు తగ్గింది. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణగ్రహీతలపై వడ్డీ భారం ఇంకాస్త తగ్గనుంది. అంతేగాక, మార్కెట్‌లో ద్రవ్య లభ్యత పెరగనుంది. ఇక, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటను 5.25శాతంగా, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటును 5.75శాతం ఉంచినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ద్రవ్య పరపతి విధాన కమిటీ సర్దుబాటు వైఖరి నుంచి స్థిర విధానానికి మారాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**గవర్నర్ ప్రసంగంలోని కీలకాంశాలు..** ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు నెలకొన్నా భారత ఆర్థికవ్యవస్థ బలంగా, స్థిరంగా కొనసాగుతోంది. వేగంగా వృద్ధి చెందుతోంది. పెట్టుబడిదారులకు అపార అవకాశాలు కల్పిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధి రేటు వరుసగా 6.6శాతం, 6.4శాతం ఉండొచ్చు. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 4 శాతం నుంచి 3.7శాతానికి తగ్గిస్తున్నాం. బ్యాంకుల వద్ద నగదు నిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నాం. రూ. 2.5లక్షల కోట్ల బ్యాంకు నిధులను విడుదల చేయనున్నాం. దీంతో బ్యాంకు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలు కల్పించినట్లవుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి రూ. 9.5లక్షల కోట్లు ద్రవ్యాన్ని వ్యవస్థలోకి తీసుకొచ్చాం. విదేశీ మారక నిల్వలు 691.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో మరో 11 నెలల వరకు దిగుమతులకు ఇబ్బంది ఉండదు. ఈక్విటీల్లో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టబడులు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ఇవి 1.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

# మోదీజీ.. నాకు ప్రమోషన్ ఎప్పుడు?: ప్రధానిని అడిగిన సీఎం



ప్రధాని మోదీ తనను త్వరలో ప్రమోట్ చేస్తారని ఆశిస్తున్నట్లు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. జమ్మూకశ్మీర్ పర్యటనకు వెళ్లిన మోదీ వద్ద ఆయన రాష్ట్ర హోదా అంశాన్ని ప్రస్తావించారు. ఆ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సీఎంగా ఉన్నాను. నేను ఇప్పుడు ఒక కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి.. లెఫ్టినెంట్ గవర్నర్ (%ూ+%)గా ప్రమోషన్ వచ్చింది. త్వరలో నాకు ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నా. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నాను" అని ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ ఎల్‌జీగా మనోజ్ సిన్హా ఉన్నారు. జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి 2014 వరకు ఒమర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో పాటు జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మారుస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్‌కు గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)-కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు తొలి సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచి రాష్ట్ర హోదాకోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను డిమాండ్ చేయబోనని ఆయన వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. "పహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రహోదాను డిమాండ్ చేయాలి. నావి అంత చౌకబారు రాజకీయాలు కావు. గతంలో రాష్ట్ర హోదా అడిగాం.. భవిష్యత్తులో కూడా అడుగుతాం. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు" అని గతంలో వ్యాఖ్యానించారు. తాజాగా చినాబ్ వంతెన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ఎదుట మళ్లీ తన డిమాండ్ వినిపించారు.


# ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం.. ప్రపంచానికి కొత్త భారం



ఇప్పుడున్న సమస్యలు సరిపోవన్నట్లుగా తాజాగా ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధం ప్రపంచానికి సరికొత్త భారంగా మారనుంది. ఇప్పటికే మాంద్యం.. రష్యా - ఉక్రెయిన్, ఇజ్రాయెల్ - గాజా మధ్య నెలకొన్న యుద్ధంతో పాటు ట్రంప్ విధానాలతో ఆర్థిక పరిస్థితి ఆగమాగంగా మారింది. ఇలాంటి వేళ.. తాజాగా మొదలైన యుద్ధం కొత్త సమస్యలకు తెర తీయటమే కాదు.. జీవన వ్యయాన్ని మరింత పెంచనుంది. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం ముడిచమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. అదే సమయంలో విమానయానం మరింత ఖరీదైన వ్యవహారంగా మారనుంది. ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ లయన్.. దానికి ప్రతిగా ఇరాన్ ప్రతీకార దాడులు పూర్తిస్థాయి యుద్ధానికి తెర తీస్తున్న పరిస్థితి. ఇరాన్ నుంచి ముడిచమురు సరఫరాలో జరిగే అంతరాయం ముడి చమురుకు రెక్కలు రావటమే కాదు.. భారీ ఎత్తున ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఇరాన్ నిత్యం 3.3 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురును ఉత్పత్తి చేస్తోంది. ఇందులో 1.5 మిలియన్ బ్యారెళ్లను ఎగుమతి చేస్తుంది. ఇదొక అంశమైతే.. ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం హోర్ముజ్ జలసంధి ద్వారా సాగుతుంది. తమపై దాడులకు దిగితే తాము ఈ రవాణా మార్గాన్ని అడ్డుకుంటామని ఇరాన్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఒకవేళ ఇరాన్ తాను చెప్పినట్లుగా ఇరాన్ జలసంధిని మూసేస్తే.. ముడిచమురు ధరలు బ్యారెల్ కు 120 డాలర్ల నుంచి 130 డాలర్లకు పెరిగే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అదే జరిగితే సామాన్యుడి జీవితం మొదలు అన్ని వర్గాల వారికి తలనొప్పుల్ని తెచ్చి పెడుతుంది. జలరవాణాను అడ్డుకోవటమే కాదు గగతలాన్ని మూసివేసిన పక్షంలో విమానయాన ఖర్చులు భారీగా పెరగనున్నాయి. విమాన సర్వీసులు ఆలస్యమవుతాయి. తిరిగి రావాల్సి ఉంటుంది కాబట్టి.. విమానాల్లో ప్రయాణించే వారికి తలనొప్పులు తప్పవు. ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం కారణంగా ముంబయి -లండన్ మార్గం సహా సౌదీ అరేబియా.. తుర్కియే మార్గాల్లో రద్దీ పెరుగుతుంది. ఫలితంగా విమాన రద్దీ నియంత్రణపై ఒత్తిడి పెరుగుతుంది. నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. దీంతో.. టికెట్ ధరలు పెరగటం ఖాయం. మరోవైపు ఈ తాజా ఘర్షణలతో బంగారం ధరలు కూడా భారీగా పెరిగే వీలుంది. యుద్ధ సమయాల్లో పెట్టుబడిదారులు నష్టభయం లేని బంగారం లాంటి వాటిల్లో పెట్టుబడులుపెడతారు. దీంతో సహజంగానే పసిడి ధర పెరుగుతుంది. సూయిజ్ కెనాల్ , ఎర్ర సముద్ర మార్గాల్ని మూసివేత కారణంగా భారత్ ఎగుమతులకు ఇబ్బందులు ఏర్పడతాయి. ఇజ్రాయెల్ - ఇరాన్ ఘర్షణల నేపథ్యంలో భారత ఎగుమతులు వేరే మార్గాలకు మళ్లించాల్సి వస్తుంది. దీంతో కచ్చితంగా రవాణా ఖర్చులు పెరుగుతాయి. అంతేకాదు.. సరుకు రవాణా వ్యవస్థ మీదా ప్రభావం పడుతుంది. ఇప్పటి డెలివరీలతో పోలిస్తే 15 -20 రోజులు ఆలస్యంగా వస్తువులు గమ్యస్థానానికి చేరుకోవటానికి సమయం పడుతుంది. ఇది కూడా ఆర్థిక భారంగా మారనుంది. ఇది భారత్ వరకు వచ్చే లెక్కలు. ఇదే విధంగా ప్రపంచంలోని పలు దేశాలు కూడా ప్రభావితం కానున్నాయి. మరి.. వీటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఏదన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

## ఇజ్రాయెల్ దాడులపై భారత్ రియాక్షన్ ఇదే... చైనా బ్యాచ్ కు షాక్!?

పశ్చిమాసియా అట్టుడికిపోతోంది. ఆ ప్రాంతం మరింత సంక్షోభంలోకి నెట్టివేసేలా ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రతరమైంది. ఇరు దేశాలు గురువారం రాత్రి నుంచి అవిరామంగా విధ్వంసక దాడులకు పాల్పడ్డాయి. ఘర్షణలకు ఆజ్యంపోసేలా భీకర హెచ్చరికలూ చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో షాంఘై సహకార సంస్థ (ఎస్.సీ.వో) ప్రకటించిన విధానానికి భిన్నమైన ప్రకటన భారత్ చేసింది. అవును... ఇరాన్ పై ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం గురువారం రాత్రి మొదలై గంట గంటకూ తీవ్రమవుతోంది. ఇరాన్ అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ తీవ్రమవుతూ కొనసాగుతోంది. దీంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. దీంతో ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రతరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ యుద్ధంపై షాంఘై సహకార సంస్థ (ఎస్.సీ.వో) ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే.. ఎస్.సీల్.ఓలో మరో సభ్యదేశమైన భారత్ ఈ ప్రకటనకు పూర్తి భిన్నమైన వాణిని వినిపించింది. ఇరాన్ పై



ఇజ్రాయెల్ దాడిని ఎస్.సీ.వో ఖండించగా.. భారత్ మాత్రం తాను గతంలో చెప్పిన విధానాన్నే అనుసరిస్తున్నట్టు ప్రకటించింది.

ఇందులో భాగంగా... ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య ఉన్న సమస్యను దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించేందుకు అంతర్జాతీయ సమాజం కృషి చేయాలని భారత్ కోరింది. దీనిపై మరింత స్పందిస్తూ.. ఎస్.సీ.వో.కు తమ వైఖరిని ముందుగానే తెలియజేశామని, సంస్థ విడుదల చేసిన ప్రకటనకు సంబంధించిన చర్చల్లో తాము పాల్గొనలేదని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. మరోవైపు... పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని, ఇజ్రాయెల్ దాడిని ఖండిస్తున్నామని ఎస్.సీ.వో ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా... ఎస్.సీ.వో.లో భారత్ తో పాటు చైనా, రష్యా, పాకిస్థాన్, ఇరాన్, కజకిస్తాన్, కిర్గిస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, బెలారస్ వంటి దేశాలు సభ్యత్వం కలిగివున్నాయి. ఆర్థిక, భద్రతాపరమైన అంశాలపై సహకారం అందించుకోడానికి ఏర్పడిన ఈ సంస్థకు ప్రస్తుతం చైనా అధ్యక్షత వహిస్తోంది.

## 1200 కి.మీ. రేంజ్... ఇజ్రాయెల్ పై ఇరాన్ స్పెషల్ క్షిపణి స్పెషాలిటీస్ ఇవే!

ఇజ్రాయెల్ - ఇరాన్ ల మధ్య భీకర యుద్ధం జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇది పశ్చిమాసియాను మరింత సంక్షోభంలోకి నెట్టేస్తుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. వీటికి అనుగుణంగా అన్నట్లుగా ఇరు వైపులా దాడులు పెరుగుతున్నాయి. ఈ సమయంలో ఇజ్రాయెల్ పై ఇరాన్ అయిదు విడతల్లో క్షిపణుల వర్షం కురిపించింది. ఇవి ఐరన్ డోమ్ ను ఛేధించుకుని వెళ్లడం గమనార్హం. అవును... టెల్ అవీవ్ పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. ఇవి.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇజ్రాయెల్ గగన తల రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్ ను ఛేధించుకుని వెళ్లాయి. ఈ క్రమంలో నేరుగా ఇజ్రాయెల్ రక్షణ శాఖ విభాగాల ప్రధాన కార్యాలయాల ప్రాంగణాలను తాకాయి. దీంతో... టెల్ అవీవ్ వణికిపోతోందని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన ఇరాన్... ఇజ్రాయెల్ పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించామని ప్రకటించింది. ఈ క్రమంలో ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్ జాదా ప్రస్తుతం ఇజ్రాయెల్ వీటిని కూడా వినియోగిస్తోందని అన్నారు. ఈ సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లు అని ఇరాన్ పేర్కొంది. ఇది మధ్యలో తన గమనాన్ని మార్చుకోగలదని.. అందుకే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదిస్తుందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో... దీనికి ఐ.ఆర్.జీ.సీ. ఖుద్స్ ఫోర్స్ జనరల్ ఖాసిం సులేమానీ పేరు పెట్టినట్లు ఇరాన్ రక్షణ శాఖ



వెల్లడించింది. కాగా... మే 4న ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్ జాదా... తమ వద్ద సరికొత్త బాలిస్టిక్ మిసైల్ సిద్ధమైందని ప్రకటించిన సంగతి తెలిసిందే. అది అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా ఛేదించుకొని వెళ్లగలదని పేర్కొన్నారు. ఈ విధంగా ఇరాన్ వందల సంఖ్యలో ప్రయోగించిన క్షిపణులను ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్ పూర్తి స్థాయిలో నివారించలేకపోయింది. దీంతో పలు క్షిపణులు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ తో పాటు పరిసర ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాయని తెలుస్తోంది. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ దేశ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం హకిర్యా తీవ్రంగా దెబ్బతిందనే వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో... పౌర నివాస ప్రాంతాల్లోనూ పలు భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో... ఈ దాడుల్లో కనీసంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా వంద మందికిపైగా స్థానికులు గాయపడ్డారని స్థానిక మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. వీరిలో ఏడుగురు ఐడీఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారని తెలిపాయి.


చురకలు

## సంపాదకీయం

### మోడీకి అరుదైన ఛాన్సు లభించనుందా?

ప్రపంచంలో ఇన్ని ఖండాలు ఉన్నప్పటికీ.. మరెక్కడా లేని దరిద్రాలు.. యుద్ధాలు.. ఉగ్రమూకలు.. అశాంతి.. తరచూ ఏదో ఒక యుద్దానికి నెలవుగా మారుతోంది ఆసియా ఖండం. తాజాగా ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య నడుస్తున్న పంచాయితీ తీవ్ర రూపం దాల్చటం.. ఒకరిపై ఒకరు సీరియస్ గా బాంబులు వేసుకోవటం.. అంతకంతకూ పరిస్థితి ఇబ్బందికరంగా మారుతున్న వేళలో.. ఇజ్రాయెల్ రాయబారి నోటి నుంచి వచ్చిన వ్యాఖ్య ఒకటి ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య నడుస్తున్న యుద్ధాన్ని ఆపేలా చేసే శక్తి భారత్ కు ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ పేర్కొనటం గమనార్హం. ఢిల్లీలో ఉన్న ఆయన చేసిన వ్యాఖ్యలు చూసినప్పుడు భారతదేశానికి ఇప్పుడు ఇరాన్.. ఇజ్రాయెల్ రెండు మిత్రదేశాలే కావటం తెలిసిందే. ఇదే ఈ రెండు దేశాల మధ్య కమ్ముకున్న యుద్ధ మేఘాల్ని పల్చన చేసే అవకాశం ఉంది. రెండు దేశాలతో భారత్ సంప్రదించగలదు కాబట్టి.. ప్రస్తుత సంక్షోభంలో భారత్ చురుకైన పాత్ర పోషిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత ప్రధాని మోడీకి ఫోన్ చేసి మాట్లాడటం తెలిసిందే. భారత్ తమకు గొప్ప మిత్రదేశంగా ఆయన అభివర్ణించారు. ఇరాన్ మత నాయకుడు ఖమేనీ ప్లాన్ ప్రకారం ఇజ్రాయెల్ ను నాశనం చేసేందుకు కొందరు ఇరానియన్లు రహస్యంగా ప్రయత్నిస్తున్నట్లుగా అజార్ ఆరోపించారు. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో 10వేల బాలిస్టిక్ క్షిపణులు.. వచ్చే ఆరేళ్లలో 20 వేల క్షిపణుల్ని తయారు చేసి ఇజ్రాయెల్ మీద ప్రయోగించాలన్నది ఇరాన్ ఆలోచనగా ఆరోపిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన ఆరోపణలు.. పోటాపోటీగా చేసుకుంటున్న దాడుల నేపథ్యంలో ఈ రెండు దేశాలకు కావాల్సిన పెద్ద దేశం భారత్ ఒక్కటే. ఒకవేళ ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబారి పేర్కొన్నట్లుగా.. ఈ రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించే అవకాశం భారత్ కు ఉంది. ఇందుకు ప్రధాని మోడీ ఓకే చేసి.. రంగంలోకి దిగితే పరిణామాలు వేరుగా ఉంటాయని చెప్పాలి. కాకుంటే.. ఈ రెండు దేశాలు మొండిగా వ్యవహరించటం ఒక ఇబ్బంది. అయినప్పటికీ భారత్ ఈ అంశాన్ని సమర్థంగా డీల్ చేసి.. యుద్ధాన్ని ఆపేసి.. శాంతిని పెంచేలా అవగాహన పత్రం మీద సంతకాలు పెట్టేందుకు రెండు దేశాల్ని ఒప్పిస్తే.. ప్రపంచ పటంలో భారత్ మరింత పవర్ ఫుల్ గా మారుతుందని మాత్రం చెప్పక తప్పదు. మరేం జరుగుతుందో చూడాలి.


## మానవతావాది చిలకమర్తి లక్ష్మనరసింహం - జూన్ 17... సంఘ సంస్కర్త చిలకమర్తి వర్ధంతి



సాధారణంగా పుస్తకాలలో చదవడం కన్నా, దృశ్య శ్రవణ రూపంలో చూపిస్తే, వినిపిస్తే, అవలీలగా అందరికీ చేరి, ఎప్పటికీ గుర్తుండి పోతుంది. ఈ విషయాన్ని ఎప్పుడో గ్రహించిన పూర్వీకులు ప్రయోగాత్మకంగా చేసి సఫలీకృతులైనారు. నాటి నాటకాలు, వీధి భాగోతాలు, హరికథలు, బుర్రకథలు, ముఖ్యంగా మన పౌరాణికాలు, ప్రబంధాలు సామాన్య ప్రజలకు అతి సులువుగా అర్థమయ్యేటట్లు చేశారు. అలాంటి ప్రజానాడి తెలిసి తదనుగుణంగా సామెతలు, నుడికారాలు, లోకోక్తులను, జాతీ యాలను తన నాటక రచనలలో చొప్పించి, ఆయా పాత్రల ద్వారా సగటు ప్రేక్షకునికి ఎంతో అనుభూతిని అందచేసిన మహా రచయిత, మానవతా వాది, దాదాపు పాతిక వరకు నాటకాలను సృష్టించిన సంఘ సంస్కర్త, జాతీయ, అంతర్జాతీయ సాహితీ పండితుల మన్ననలను పొందిన మహనీయుడు చిలకమర్తి. చిలకమర్తి లక్ష్మీనరసింహం ( సెప్టెంబరు 26, 1867 – జూన్ 17, 1946) కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణ వాది, విద్యావేత్త. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుకొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరు. మహాకవి, కళాప్రపూర్ణ ఆయన బిరుదులు. ఇరవై రెండేళ్ళ వయస్సప్పుడు ఆయన రచించిన "గయోపాఖ్యానం" అనే నాటకం "ప్రతులు లక్ష"కి పైబడి అమ్ముడు పోవట మనేది తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయం. లక్ష్మీ నరసింహం 1867 సెప్టెంబర్ 26 న పశ్చిమ గోదావరి జిల్లా, పెరవలి మండలము లోని ఖండవల్లి గ్రామములో ఒక బ్రాహ్మణ కుటుంబములో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య వీరవాసరం, నరసాపురం పట్టణాలలో సాగింది. 1889లో రాజమండ్రి హైస్కూలులో పట్టం చేత పట్టుకొన్నారు. 1889 లో రాజమండ్రి ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. తరువాత ఇన్నీసు పేట స్కూలు లోనూ, మునిసిపల్ హైస్కూలు లోనూ విద్యాబోధన సాగించారు. తరువాత ఒక సంవత్సరం "సరస్వతి పత్రిక" సంపాదకునిగా పని చేశారు. ఆపై ఉద్యోగం విరమించి 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించి 9 సంవత్సరాలు నడిపారు. తరువాత ఆ పాఠశాల వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మార్చ బడింది. పాఠశాలలో ఉన్నపుడే పద్యాలు వ్రాయడం ప్రారంభించిన లక్ష్మీ నరసింహం ఎన్నో రచనలు చేశారు. "కీచక వధ" ఆయన మొదటి నాటకం. తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కళ్యాణం, పారిజాతాపహరణం వంటి నాటికలు రచించారు. గయోపాఖ్యానం నాటకంలో "టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం" వేసేవారు. ఆయన వ్రాసిన నవలలలో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, సుధా శరచ్చంద్రము ముఖ్యమైనవి. సరస్వతి పత్రిక సంపాదకునిగా ఉన్నపుడు సౌందర్య తిలక, పార్వతీ పరిణయం వ్రాశారు. ఇంకా అనేక రచనలు చేశాడు.అటు తెనుగు సాహిత్య, నాటక రంగాలకు, ఇటు సంఘ సంస్కరణోద్యమానికి మహోన్నత సేవలను అందించిన అపూర్వ వ్యక్తి కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీ నరసింహం. వీరు రచించిన "గయోపాఖ్యానం" నాటక పద్యాలు, "వందేళ్ళ" నుండి తెలుగు వారి నోట వినిపిస్తూ ఉన్నాయి. నాటక సమాజం ఉన్న ప్రతీ ఊరులోనూ ఈ నాటకాన్ని ప్రదర్శించారు. 1943 నాటికి లక్ష ప్రతులు (కాపీలు) అమ్ముడు పోయినాయి అంటే అది ఎంత గొప్ప రచనో చెప్పకనే తెలుస్తోంది. 1908లో ఒక ప్రెస్ స్థాపించారు. 1916 లో మనోరమ, పత్రిక అనే పత్రిక స్థాపించారు. దీని ద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర (కాళిదాసు రచన రఘు వంశానికి అనువాదం), సిద్ధార్థ చరిత్ర వంటివి ప్రచురించారు. 21 అధ్యాయాల్లో రాసిన స్వీయ చరిత్రములో, ఆయన జీవిత కృషి మొత్తం వివరించ బడింది. బాల్యం, నర్సాపురంలో చదువు, రాజమండ్రిలో విద్యాభ్యాసం, ఉద్యోగం. గ్రంథరచన, నాటక సమాజం, వివాహం, మండల సభల్లో పాల్గొనడం, రామమోహన పాఠశాల ఏర్పాటు, నిర్వహణ, ఉన్నత పాఠశాల ప్రారంభం, కుటుంబ సమస్యలు, కష్టాలు, టంగుటూరి ప్రకాశం ఇంగ్లండ్ యాత్ర, హితకారిణి సమాజ స్థాపన, అచ్చు యంత్రాన్ని నెలకొల్పడం, భారత జాతీయ కాంగ్రెస్ సభకు హాజరవడం, పత్రికా సంపాదకత్వం, నిర్వహణ %-% యివన్నీ సవివరంగా రాశారు. చిలకమర్తి ఏకసంధాగ్రాహి మాత్రమే కాదు, అద్భుతమైన జ్ఞాపక శక్తి కలిగి, స్వీయ చరిత్రలో, తన జీవిత కాలంలో జరిగిన ఘటనలను, సూక్ష్మాంశాలతో సహా చిత్రించారు. చారిత్రక ఘటనలను సమతూకం తోనూ, వ్యక్తుల గూర్చి రాస్తున్నపుడు రాగద్వేషాల కతీతంగా, స్పష్టంగా, క్లుప్తంగా రాశాడు. నిత్యనైమిత్తకాల గూర్చి రాస్తున్నా, వాటినొక అంతర్ దృష్టితో పరికించారు. లక్ష్మీ నరసింహం మొదటి తరం సంఘ సంస్కర్త. 1909 లో సామాజికంగా వెనుక బడిన వర్గాలకోసం ఒక పాఠశాల (రామమోహన పాఠశాల) స్థాపించారు. నిమ్న జాతుల వారి గురించి ప్రత్యేకంగా ఒక పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్ర దేశంలో చిలకమర్తి వారికి దక్కుతుంది. ఎందుకంటే అంతకు మునుపు ప్రభుత్వంచే నడుప బడుతున్న ఒకటి రెండు పాఠశాలలు తప్ప దళితుల కోసం ప్రత్యేకమైన పాఠశాలలను ఎవరూ స్థాపించ లేదు. కేవలం తన పుస్తకాల నుండి వచ్చిన రాబడితోనే, తన స్వంత ధనంతో ఆ రామమోహన పాఠశాలను 13 సంవత్సరాలు నడిపి హైయ్యర్ ఎలిమెంటరీ స్కూల్ గా చేసారు. బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్య కలాపాలలో పాలు పంచుకొన్నారు. దేశమాత అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు. గాంధీజీ భారత రాజకీయ పటంలోకి రాక మునుపే హరిజన బాలులకు చదువు చెప్పేందుకు " రాజారామోహన రాయి పాఠశాలను " నడిపించి తనలో నిక్షిప్తమై ఉన్న సంస్కరణా భిమానాన్ని చాటి చెప్పారు. ఇన్ని సుగుణాల సమాహారం మన చిలకమర్తి లక్ష్మీనరసింహం. తనకు మార్గదర్శకుడైన వీరేశలింగం పంతులు గారితో కలసి, రాజమహేంద్ర వరంలో హితకారిణీ సంస్థ నడిపించారు. కనుచూపు కోల్పోయినా, పరిస్థితులకు ఎదురొడ్డి నిలచి, పోరాడి, జీవితాంతం తెలుగు సాహిత్య నాటక రంగాలకు, సాంఘిక సంస్కరణలకు తన జీవిత కాలం ధారపోశారు. ఓ సుప్రసిద్ధ నాటక కర్తగా, హాస్య రచయితగా, పద్య, గద్య రత్నాకరుడిగా, నవలా రచయితగా తన రచనలతో సామాజిక ప్రయోజనాన్ని ఆశించి సాధించారు. "గురజాడ వారి కన్యాశుల్కం, వేదం వారి ప్రతాప రుద్రీయం, శ్రీపాద గారి బొబ్బిలి యుద్ధం, చిలకమర్తి వారి గయోపాఖ్యానం" తెలుగు నాటక మణి రత్నాలు. అనేక తెలుగు పద్య, గద్య రచనలు కావించారు చిలకమర్తి. వీటిలో అత్యధికాధరణలు పొందినవి 'గయోపాఖ్యానం', 'గణపతి'. 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ పురస్కారంతో సత్కరించింది. 1946, జూన్ 17న లక్ష్మీనరసింహం మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## ఇట్లు భాషా సేవకుడు... తిరుమల రామచంద్ర - జూన్ 17... తిరుమల రామచంద్ర జయంతి




పండితుల సొత్తుగా భావించబడే సాహిత్యాన్ని ప్రజాపరం చేయాలనే లక్ష్యంతో, లక్ష్య సిద్ధి కోసం యావజ్జీవం పాటుపడ్డారు తిరుమల రామచంద్ర. తెలుగు సాహిత్యంలో పత్రికా రంగాలలో ఆయన ప్రాతః స్మరణీయులు. ప్రాకృత, సంస్కృతాంధ్ర సారస్వతాల్లో నిష్ణాతునిగా, ద్రావిడ భాషల పరిశోధకునిగా విశిష్ట సేవలందించారు. స్వాతంత్ర్య సమర యోధునిగా, మద్రాసు కుట్రకేసులో ముద్దాయిగా స్వాతంత్ర్య పోరాట కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. సరళమైన, సలక్షణమైన, సహజ సుందరమైన తెలుగు భాషకు పట్టంకట్టి, భావి తరాలకు ముఖ్యంగా పత్రికా రచయితలకు మార్గదర్శకు లయ్యారు. తిరుమల రామచంద్ర స్వయాన వరిష్ఠ పత్రికా రచయిత మాత్రమే కాదు, జగమెరిగిన పండితులు, పరిశోధకులు, విమర్శకులు, బహు భాషావేత్త, బహు గ్రంథకర్త, పత్రికా రచయితగా ఆయన చేసిన భాషాసేవ అనన్య సామాన్యం. మాతృభాష తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృతం, ప్రాకృతాది భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహు భాషావేత్త. రకరకాల వృత్తులు చేసి, వివిధ అనుభవాలు సంపాదించి విస్తృత లోకానుభవ శాలి ఐన రామచంద్ర తనను తాను వినమ్రంగా భాషా సేవకుడు అని అభివర్ణించు కునేవారు. బిరుదులు, అవార్డులు, గౌరవ డాక్టరేట్లు ఎన్ని వరించినా కలకత్తా సర్వభాషా పత్రకార్ సమ్మేళనంలో స్వీకరించిన "పత్రకార్ శిరోమణి" అనే బిరుదొక్కటే తమ పేరు ముందు రాసుకోడానికి ఇష్టపడేవారు. లాహోర్ విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో ఏడాదిపాటు పనిచేసి తెలుగు, కన్నడ, తమిళ, మళయాల తాళపత్ర గ్రంథాలు వెయ్యింటికి వివరణ సూచీ తయారు చేశారు. అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా రేగటిపల్లె లో 1913, జూన్ 17న జన్మించిన రామచంద్ర హంపీ శిథిలాలలోని గ్రామమైన కమలాపురంలో తన బాల్యం గడిపారు. ఆయన విజయనగర సామ్రాజ్యంలో నివసించిన తాతాచార్యుల వంశీయులు. సంస్కృత భాష, శాస్త్రాలను గురు శుశ్రూష చేసి నేర్చుకోవడం ప్రారంభించాక కారణాంతరాల వల్ల తిరుపతిలోని కళాశాలలో చేరారు. తెలుగు, సంస్కృతాలలో విద్వాన్ గా, హిందీలో ప్రభాకరగా పట్టాలు పొందారు. స్వాతంత్ర్య సమర యోధునిగా మద్రాసు కుట్ర కేసులో ముద్దాయిగా స్వాతంత్ర్య సమరంలో పాలుపంచు కున్నారు. తిరుపతిలో చదువు తున్నపుడు సత్యాగ్రహంలో పాల్గొని ఏడాది జైలు శిక్ష అనుభవించారు. సహాయ నిరాకరణ సభల కోసం మార్చింగ్ సాంగ్స్ రాశారు. ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో సైన్యంలో హవల్దార్ గుమాస్తాగా అఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్, సరిహద్దుల్లో పని చేశారు. ఆ ఉద్యోగాన్ని ఆత్మ గౌరవానికి భంగం కలిగిన కారణంగా విడిచి పెట్టిన రామచంద్ర ఆ సమయంలోనే ఉత్తర భారత దేశంలో విస్తృతమైన పర్యటన చేశారు. ఉమ్మడి పంజాబులో భాగమైన లాహోర్ పట్టణంలో కొందరు మహా పండితులను, పంజాబు పల్లెల్లో భారతీయ గ్రామీణ జీవితం, మొహెంజదారో, హరప్పా ప్రాంతాల్లో ప్రాచీన నాగరికతా చిహ్నాలను దర్శించారు. వేటూరి ప్రభాకర శాస్త్రికి ఏకలవ్య శిష్యునిగా చెప్పుకున్న తిరుమల రామచంద్ర, విద్వాన్ విశ్వం వంటి సహాధ్యాయులతో పనిచేశారు. అనంతరం ఢిల్లీ వచ్చి డెయిలీ టెలిగ్రాఫ్ ఆంగ్ల పత్రికలో చేరి పాత్రికేయ వృత్తిలో స్థిరపడ్డారు. 1944 లో పత్రికా రంగంలో పనిచేశారు. తొలుత తెలంగాణ పత్రికలో పనిచేసి తర్వాత మీజాన్ లో చేరి ఆ పత్రిక సంపాదకుడు అడవి బాపిరాజు శిష్యరికంలో రాటుదేలారు. సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల దంపతులతో ఏర్పడిన సాన్నిహిత్యంతో సోషలిష్టు భావజాలానికి దగ్గరయ్యారు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి, హిందుస్తాన్ సమాచార్ లలో వివిధ హోదాలలో పనిచేశారు. భారతి మాసపత్రిక ఇన్ చార్జ్ ఎడిటర్ గా పనిచేసిన కాలంలో దేవరకొండ బాలగంగాధర తిలక్ వ్యాసం ప్రచురించిన కారణంగా తలెత్తిన భేదాభి ప్రాయాలతో రాజీనామా చేశారు. నార్ల వెంకటేశ్వరరావు తో విభేధించి ఆంధ్రప్రభలో ఉద్యోగం వదులు కున్నారు. పరిశోధన అనే ద్వైమాస పత్రికకు సంపాదకత్వం వహించి 1953–1956 మధ్య కాలంలో ప్రచురించారు. రామచంద్ర కొన్ని వందల వ్యాసాలు సమీక్షలు రాశారు. "హైదరాబాద్ నోట్ బుక్" వంటి 15 శీర్షికలు నిర్వహించారు. సత్యాగ్రహ విజయం నాటకం, రణన్నినాదం గీతాన్ని సంస్కృతంలో రాశారు. తిరుమల రామచంద్ర తన 84 ఏళ్ళ జీవితంలో అర్ధ శతాబ్ది పత్రికా రచనకే అంకితమైనారు. తెలుగు నాట, భారతావనిలో ప్రసిద్ధులైన కవిపండితులు, కళాకారులు, భాషావేత్తలు, తత్త్వ చింతకులు అయిన ప్రతిభా శాలురు అనేక మందిని ఆయన ఇంటర్వ్యూ చేశారు. సుమారు 50 పుస్తకాల దాకా ఆయన రచనలు అచ్చైనాయి. 'మన లిపి – పుట్టు పూర్వోత్తరాలు' భాషా చరిత్రకే తలమానికం. ఇతర భాషలలో కూడా ఇలాంటి రచన లేదని" ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు కితాబు ఇచ్చారు. ఆయన ప్రకటించిన 'లలిత విస్తరం' బౌద్ధ వాఙ్మయం నుంచి ఆధునిక భారతీయ భాషలలో తొలి అనువాదం. మహాయాన బౌద్ధ సంప్రదాయానుసారం రాసిన బుద్ధుని జీవిత చరిత్ర ఇది. భారత దేశంలో మొట్టమొదటి లౌకిక వచనంగా దీన్ని పేర్కొన్నారు. క్షేమేంద్రుడి 'అవధాన కల్పలత'ను కూడా ఆయన అనువదించారు. తెలుగులో వీరిదే తొలి అనువాదం. చిన్నతనం లోనే భారత దేశపు సాంస్కృతిక వైశాల్యాన్ని దర్శించిన రామచంద్ర ఆ కారణంగా తన దృక్పథంలో ఏర్పడ్డ సమ్యక్ దృష్టి, సంస్కృతి పట్ల ప్రేమను జీవితాంతం నిలబెట్టు కున్నారు. నార్ల వెంకటేశ్వరరావుతో విభేదాలు, "భారతి" పత్రికలో ఒక వ్యాసం గురించిన వివాదాలు వంటి సందర్భాల్లో రాజీనామాలు చేసి తన ఆత్మగౌరవాన్ని ప్రదర్శించారు. గాంధీని దర్శించారు. వారితో హరిజనోద్యమంలో పాల్గొన్నారు. ఖద్దరు దుస్తులు కట్టేవారు. నాస్తికునిగా, హేతువాదిగా ప్రకటించుకున్న ఆయనే దేవాలయంలో పూజ చేయడం, ఉన్నవ లక్ష్మీనారాయణ వద్ద సహాయకునిగా పౌరోహిత్యం వంటివి చేశారు. ప్రతి ఉత్తరంలోనూ "ఇట్లు భాషాసేవకుడు తిరుమల రామచంద్ర" అంటూ సంతకం చేసే రామచంద్ర భాషాసేవ లోనే జీవితాన్ని గడిపారు. పత్రకార శిరోమణి, కళా సరస్వతి, మహా మహోపాధ్యాయ తదితర బిరుదులు ఆయనను వరించాయి. 1991లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లాశాఖ వారిచే అమరజీవి పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం, 1993లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం పొందారు. తెలుగు నుడికి బడికట్టి, తెలుగు అక్షర రమ్యతను జగతికి చాటిన పరిశోధన 'రాముడు', సారస్వత 'చంద్రుడు' తిరుమల రామచంద్ర 1997 అక్టోబరు 12న తమ 84వ ఏట హైదరాబాద్ లో చివరి శ్వాస వదిలారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## ప్రథమ స్వాతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి - జూన్ 17... ఝాన్సీ రాణి వర్ధంతి



ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది. 1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది. ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహ ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బంధువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామోదర్ రావు రాజా కు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ – ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మీబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది. గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# కేజీబీవీలో కొత్త మెనూ

సారంగాపూర్: నిరుపేద బాలికలకు అందుబాటులో నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం కొత్త మెనూను అమల్లోకి తెచ్చింది. కస్తూర్బాల్లో చదివే బాలికలు పూర్తిగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనతతో బాధపడుతుంటారు. గురుకులాల్లో అమలయ్యే ఆహార మెనూ కేజీబీవీలలో లేకపోవడంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకేరకమైన మెనూ అందించేందుకు నిర్ణయించి అమలు చేస్తోంది. విద్యాలయాలు ప్రారంభం నుంచే మెనూ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలోని 14 మండలాల్లో ఆరు నుంచి పదోతరగతి వరకు కొనసాగుతుండగా, ఒక్కో విద్యాలయంలో పదోతరగతి వరకే 200 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. నూతనంగా బీర్పూర్, బుగ్గారం మండలాల్లో కేజీబీవీలు ఏర్పాటు చేశారు. అక్కడ ప్రస్తుతం ఆరు నుంచి ఎనిమిది వరకు మాత్రమే విద్యనందిస్తున్నారు. రెండేళ్ల కిందట జిల్లాలోని సారంగాపూర్, రాయికల్, పెగడపల్లి, జగిత్యాల, కోరుట్ల ఇబ్రహీంపట్నం, వెల్గటూర్ మండలాల్లో, ఈ ఏడాది మేడిపల్లి, మల్యాల, మల్లాపూర్, ధర్మపురి, కథలాపూర్ మండలాల్లో ఇంటర్ వరకు పెంచారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలలో 3700 మంది బాలికలు చేరడంతో వసతులు కల్పించడం కష్టంగా మారుతోంది. ప్రస్తుతం వసతులతోపాటు కొత్త మెనూ అమలు చేయాలని ఆదేశించింది.



ప్రస్తుతం పదోతరగతి వరకు కొనసాగుతున్న విద్యాలయాల్లోనే ఇంటర్ వరకు ఉన్నతీకరించడంతో బాలికల సంఖ్య పెరిగి మౌలిక వసతులు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. తరగతి గదులు, భోజనం, పడుకోవడం ఇబ్బందిగా మారుతోంది. కొత్తగా బీర్పూర్, బుగ్గారం మండలాల్లో కస్తూర్బా విద్యాలయాలను ఏర్పాటు చేయగా, బీర్పూర్ మండలంలోని తుంగూర్లో ఓ అద్దె భవనంలో కొనసాగిస్తుండగా, బుగ్గారం కేజీబీవీని ధర్మపురి విద్యాలయంలోనే ఉంచారు.

ఉదయం: టమాట కిచిడి, రాగి జావ, సాంబారు, బూస్టు, ఉప్మా, పూరి, పులిహోర, బోండా, వడ, చపాతి, జీరా రైస్, అరటి పండు

మధ్యాహ్నం: టమాట పప్పుతో అన్నం, నెయ్యి రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్

సాయంత్రం: ఉడకబెట్టిన శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లం-పల్లీలు, అల్లం ఛాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడీ

రాత్రి: వివిధ రకాల కూరలతో అన్నం, సాంబారు, మజ్జిగ అందించాల్సి ఉంటుంది. నెలలో రెండు సార్లు మాంసాహారం, అయిదు సార్లు గుడ్డు, ప్రతి రోజు నెయ్యి

వసతుల కల్పనకు చర్యలు- అనుపమ, జిల్లా కోఆర్డినేటర్, కేజీబీవీ

ప్రభుత్వం నూతన మెనూ అమలు చేయాలని ఆదేశించడంతో విద్యాలయాల ప్రారంభం నుంచే అమలు చేస్తున్నాం. విద్యాలయాల మరమ్మతు, పెయింటింగ్ ప్రారంభించాం. పెగడపల్లి, సారంగాపూర్ మండలాల్లోని కేజీబీవీలకు అదనంగా భవనాలు అవసరముందని ప్రతిపాదనలు పంపడంతో ఈ ఏడాది నిధులు మంజూరు కానున్నాయి. పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.


# అంగన్‌వాడీలు.. ఇక మరింత మెరుగు

ధర్మపురి: అంగన్‌వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రణాళికలు రూపొందించడంతోపాటు తాజాగా టీచర్లు, ఆయాల ఉద్యోగ విరమణ వయస్సు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జిల్లాలోని 1638 మంది సిబ్బందికి ప్రయోజనం కలగనుంది.

**ప్రోత్సాహకాలు రెండింతలు**

ఈ నిర్ణయంతో ఉద్యోగ విరమణ సమయంలో వారికి అందించే ప్రోత్సాహకాలు సైతం రెట్టింపు చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయురాలికి రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష అందించనున్నారు. ప్రస్తుతం టీచరుకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేల చొప్పున అందిస్తున్నారు.

**పోస్టుల భర్తీకి సన్నాహాలు** జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న టీచరు, ఆయా పోస్టుల భర్తీకి సన్నాహాలు మొదలుపెట్టింది. ఇదివరకే ఉద్యోగ విరమణ చేసినవారికి ప్రోత్సాహకాలు అందించగా.. ఇక ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్ణయించినట్లు



ప్రాథమికంగా తెలుస్తోంది. నూతన విధానంతో బోధనలు, నిత్యం కేంద్రాల నిర్వహణను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తూ ఐసీడీఎస్‌లో సంస్కరణలు చేపడుతున్నారు. పోస్టుల భర్తీతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడనుంది.

**బలోపేతానికి కృషి చేస్తాం**

– నరేశ్, జిల్లా సంక్షేమశాఖాధికారి, జగిత్యాల

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం కృషి చేస్తాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తాం. ఉద్యోగ విరమణ ప్రోత్సాహకాలు రెట్టింపు చేయడంతో వారికి మరింత ప్రయోజనం చేకూరనుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ మహిళా, శిశు సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం.

జిల్లాలోని కేంద్రాల వివరాలు

ప్రాజెక్టుల సంఖ్య: 4

అంగన్‌వాడీ కేంద్రాలు: 1065

విధులు నిర్వహించే టీచర్లు: 988

టీచర్ల పోస్టుల ఖాళీలు: 63

ఆయాలు: 650

ఖాళీగా ఉన్న ఆయా పోస్టులు: 318

# నకిలీ.. నమ్మితే ఖాతా ఖాళీ!




హైదరాబాద్ : "ఆధార్ దుర్వినియోగమంటూ భయపెట్టి విశ్రాంత శాస్త్రవేత్త నుంచి రూ.1.34 కోట్లు కాజేశారు. విదేశాలకు మానవ అక్రమ రవాణా కేసులో డిజిటల్ అరెస్ట్ పేరిట ఇల్లు కదలకుండా చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి విచారణ చేస్తున్నట్లు వాట్సప్ కాల్‌తో చుక్కలు చూపారు. మూడు రోజుల పాటు వృద్ధ దంపతులు తీవ్ర మనోవేదన అనుభవించేలా చేశారు."

" మిత్రుడు కస్టమ్స్ అధికారులకు చిక్కాడని కానిస్టేబుల్‌కు ఫోన్ చేశారు. మిత్రుడి వాయిస్‌తో మాట్లాడించారు. లండన్ నుంచి హైదరాబాద్ వస్తుండగా దిల్లీ ఎయిర్ పోర్టులో ఆదాయపన్ను శాఖ అధికారులకు క్లియరెన్స్, ట్యాక్స్ చెల్లించాలంటూ రూ.2.05 లక్షలు తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు."

ఉన్నత విద్యావంతులు సైబర్ మోసాల బారిన పడి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రాజస్థాన్‌లోని భరత్‌పూర్, డీగ్, నూహ్, మెహత్ జిల్లాల్లో పలు గ్రామాలు సైబర్ మాయగాళ్లకు అడ్డాగా మారాయి. పాఠశాల స్థాయిలోనే చదువు ఆపేసిన, పదో తరగతి తప్పిన వారంతా మోసాలను ఉపాధిగా ఎంచుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ యాప్‌లు వినియోగం, ఇంటర్నెట్ కాల్స్, కృత్రిమ మేధ సహాయంతో మార్ఫింగ్ వీడియోలు, వాయిస్ కాల్స్‌తో ఏ విధంగా మోసం చేయాలనే అంశాల పై తర్ఫీదు పొంది.. నేరాలకు పాల్పడుతున్నారు. వివిధ వెబ్‌సైట్లల నుంచి, ఏజెంట్ల సాయంతో వివిధ వర్గాలకు చెందిన వారి డేటా కొనుగోలు చేస్తున్నారు. తమ వద్ద ఉన్న జాబితా ఆధారంగా రోజుకు 20 నుంచి 30 మందికి వాట్సప్ వీడియో కాల్స్ చేస్తారు. అటు నుంచి వచ్చిన స్పందనకు తగినట్టుగా ఆయా శాఖలు, అధికారుల పేర్లు ప్రయోగించి భయ పెడతారు. తమ ఖాతాల్లో జమ చేసిన నగదు లావాదేవీలను పరిశీలించి తిరిగి ఇస్తామంటూ చెబుతుండటంతో వారి వలలో చిక్కి మోసపోతున్నారు. ఇలా రూ.కోట్లు నష్టపోయిన వారిలో న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, వైద్యనిపుణులు, ఉన్నత విద్యావంతులు, పోలీసులు ఉన్నారు.

**స్పందించకపోవడమే పరిష్కార మార్గం**

ప్రసాదరావు, ఇన్‌స్పెక్టర్, నగర సైబర్‌క్రైమ్

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు. అట్నుంచి రికార్డ్ చేసిన వీడియో కాల్‌ను మార్ఫింగ్ చేసి బెదిరించి డబ్బులు గుంజుతారని గ్రహించాలి. ప్లస్(౦)తో మొదలయ్యే కాల్ వస్తే పట్టించుకోవద్దు. అనుమానాస్పదంగా అనిపించినా, మోసపోయినట్టు గ్రహించినా 1930కు ఫిర్యాదు చేయండి.

# నిలిచిన ప్రోత్సాహకాలు.. తగ్గుతున్న ప్రసవాలు



వికారాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవమైన గర్భిణులకు అందించే ప్రోత్సాహకాలు నిలిచిపోయాయి. గతేడాదితో పోల్చితే సర్కారు దవాఖానాల్లో కొంతమేర ప్రసవాలు తగ్గాయి. గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే.. ఏదో ఒక కారణంతో వారిని ఆందోళనకు గురిచేసి.. శస్త్ర చికిత్సలతో కాన్పులు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరముంది.

**గతంలో ప్రత్యేక దృష్టి**

మూడేళ్ల కిందటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేసింది. ముఖ్యంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలోనూ సాధారణ ప్రసవాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టింది. దీంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటులో ప్రసవాలపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఏయే దవాఖానాల్లో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయో గుర్తించింది. నిఘాపెట్టి కోతల కాన్పులకు చెక్ పెట్టింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం సాధారణ ప్రసవాల్లో గతంలో రాష్ట్రంలో తృతీయ స్థానం సాధించింది.

**ప్రధాన కారణాలివి..**సర్కారు దవాఖానాల్లో ప్రసవమైన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం.ప్రజలకు అందుబాటులో ఉండే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గడం. క్షేత్రస్థాయిలో యంత్రాంగం పర్యవేక్షణ లోపం.ప్రాంతీయ, బోధనాసుపత్రులతో పాటు మాతా శిశుసంరక్షణ కేంద్రాల్లోనే ప్రసవాలు జరుగుతున్నాయి. దీంతో వీటిలో విధులు నిర్వహించే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది.వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గతంలో మాదిరిగానే ఉన్నాయని వివరిస్తున్నారు. **క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డి జిల్లాలో గతేడాది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 20,729, ప్రైవేటులో 5743 ప్రసవాలు జరిగాయి. మెదక్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 8697 ప్రసవాలు జరగగా.. ప్రైవేటులో 2535 ప్రసవాలయ్యాయి. ఈ ఏడాది సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల్లో పెద్దగా మార్పులేనప్పటికీ.. సిద్దిపేట, మెదక్‌లో కొంతమేర తగ్గాయి. సిద్దిపేట జిల్లాలో ప్రైవేటు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వైద్యారోగ్యశాఖ గణాంకాల ప్రకారం గడిచిన నాలుగేళ్లలో సర్కారు దవాఖానాల్లో 70 శాతం కాన్పులు కాగా.. ప్రైవేటులో 30 శాతం మాత్రమే జరిగాయి. ఈ ఏడాది ప్రభుత్వ దవాఖానాల్లో 55 శాతం ప్రసవాలైతే.. ప్రైవేటులో 45 శాతానికి పెరిగాయని వైద్యారోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

# ఎరువు కరవు రావొద్దు!




కరీంనగర్ : జగిత్యాల జిల్లా మేడిపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అందుబాటులో ఉన్న ఎరువులు ఇవి. సీజన్ ప్రారంభ దశలో ఉండటంతో రైతులు ఎరువుల కోసం వెంపర్లాడటం లేదు. మున్ముందు డిమాండ్ అధికంగా ఉండనుంది. గతంలో ఎదురైన అనుభవాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఈ సారి వ్యవసాయ, సహకార శాఖలను అప్రమత్తం చేశారు. వచ్చే నెల 15వ తేదీ వరకు 7 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని గుర్తించి ఆ మేరకు సిద్ధంగా ఉంచారు. ఈ నెలలో మరింత తెప్పించి సమృద్ధిగా బస్తాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కోసం రైతులు రోడ్లపై నిలబడొద్దు. ఆయా జిల్లాల వారీగా అవసరమైనన్ని నిల్వలు ముందుగానే తెప్పించండి. నల్ల బజారుకు తరలడం, కృత్రిమ కొరత సృష్టించడం లాంటి చర్యలను ఉపేక్షించొద్దు. గత నెలలో కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షలో కలెక్టర్లకు అప్పటి ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశంగతేడాది పలుచోట్ల ఎరువుల బస్తాల కోసం అన్నదాతలు అగచాట్లు పడ్డారు. జులై మాసంలో ఒక్కసారిగా రైతులంతా దుకాణాల వద్దకు ఎగబడ్డారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో కొన్నిచోట్ల అగచాట్లు తప్పలేదు. కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో తీసుకున్నవారే అధికంగా తీసుకుని నిల్వలు పెట్టుకోవడం కూడా పంపిణీ విషయంలో ప్రతిబంధకంగా మారింది. ఈ సీజన్‌లోనూ పాతకథ పునరావృతం కావొద్దంటే..యంత్రాంగం మరింత పకడ్బందీగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఇప్పటి నుంచే అంచనా వేయాలి. సజావుగా సరఫరా అయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలి.

**వచ్చే నెల నుంచే!**జులై నుంచి ఎరువుల అవసరాలు మొదలవుతాయి. ముఖ్యంగా యూరియా కోసం అన్నిచోట్లా డిమాండ్ ఉండనుంది. డీఏపీ ఇతర కాంప్లెక్స్ ఎరువుల వాడకం తక్కువగానే ఉంటుంది. ఓ వైపు కేంద్ర ప్రభుత్వం ఈ సారి తక్కువ మొత్తంలో వీటిని వినియోగించాలని విస్తృత ప్రచారం చేస్తోంది. సరఫరా కూడా తక్కువగా ఉంటుందనే సంకేతాల్నిస్తోంది. అయినా ఉమ్మడి జిల్లాలో మాత్రం మోతాదును మించి వినియోగం అలవాటుగా మారింది. పంట దిగుబడికి పోషకాలన్నీ వీటితోనే అందుతాయనే భావనలో అన్నదాతలు వీటివైపే మొగ్గుచూపుతున్నారు. అందుకనే వీటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.**కృత్రిమ కొరత..**జిల్లాల్లో ఎరువుల విషయంలో గతంలో కొందరు కృత్రిమ కొరతను సృష్టించారు. ఈ-పాస్ విధానంలో ఆన్‌లైన్‌లోనే ప్రతి రైతు ఆధార్‌కార్డు ద్వారా విక్రయాలు చేపట్టాలని నిర్ణయించినా చాలామంది డీలర్లు ఇందుకు ఆసక్తిని చూపించలేదు. దీంతో అసలు వీటి విక్రయాల్లో గందరగోళమనే పరిస్థితి ప్రతి సీజన్‌లో నెలకొంటు ంది. పారదర్శకమైన విధానం లేకపోవడంతో బడా భూస్వాములు ముందుగానే పెద్దఎత్తున వీటిని కొంటూ నిల్వ ఉంచుకుంటున్నారు. దీంతో సన్న చిన్నకారు రైతులు తన పంటకవసరమైన ఎరువుల కోసం తంటాలు పడాల్సి వస్తోంది. మరోవైపు వ్యాపారులు కూడా నిర్ణీత ధరకన్నా అధికంగా అమ్ముకునేందుకు వీలుగా కృత్రిమ కొరత సృష్టిస్తూ అందినకాడికి దండుకునే యత్నాలు చేస్తారు.

# కాలువలు శిథిలం.. చివరికి గగనం

జగిత్యాల : జగిత్యాల మండలం నర్సింగాపూర్ వద్ద దెబ్బతిన్న కాకతీయ కాలువ లైనింగ్. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీటిని పలు జిల్లాలకు తరలించే ప్రధాన కాకతీయ కాలువకు చాలాచోట్ల లైనింగ్ చెడిపోయింది. కాకతీయ కాలువ లైనింగ్, కట్టలు దెబ్బతిని జగిత్యాల, మల్యాల, గొల్లపల్లి, పెగడపల్లి తదితర మండలాల్లో గండ్లుపడి తీవ్రనష్టం వాటిల్లింది. 9 వేల క్యూసెక్కుల నీటితరలింపు సామర్థ్యం కలిగిన ఈ కాలువలో ప్రస్తుతం 6,500 క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తుండటం కాలువ మరమ్మతు ఆవశ్యకతను కళ్లకు కడుతోంది.సారంగాపూర్ మండలం అర్పపల్లి వద్ద కోతకు గురైన డి-53 కాలువ. ప్రధాన డిస్ట్రిబ్యూటరీ కాలువ అర్పపల్లి డ్రాపువద్ద కోతకుగురై గండిపడి ఊరిలోకి నీరువచ్చే ప్రమాదం నెలకొంది. చాలా డిస్ట్రిబ్యూటరీలు, ఉపకాలువలకు లైనింగ్ చెడిపోవటంతో ఇలాంటి పరిస్థితే తలెత్తి నీటిని తరలించకపోగా ప్రమాదకరంగా మారాయి.

జగిత్యాల జిల్లా మీదుగా పారే కాకతీయ ప్రధాన కాలువతో పాటు, డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితరాలతో కాలువల్లో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. అన్ని కాలువల ప్రాంత యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతినటంతో గరిష్ఠస్థాయిలో నీటిని తరలించలేని పరిస్థితి తలెత్తింది. కాలువల్లో నిండుగా నీటిని వదలకపోగా పారే కొద్దిపాటి నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోయటంతో 35 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది.

బీర్‌పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, బుగ్గారం, సారంగాపూర్,



కోరుట్ల, మల్యాల, గొల్లపల్లి, ఎండపల్లి, పెగడపల్లి తదితర మండలాల్లో చివరి ఆయకట్టు గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరందటంలేదు. ఏప్రిల్ వరకు ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయటం, మరమ్మతులకు ఆశించినట్లుగా నిధులు విడుదల చేయకపోవటం, టెండర్ల దశనుదాటి పనులను ఆలస్యంగా ప్రారంభించటంతో చాలా పనులు పూర్తికాలేదు. భారీ వర్షాలు వచ్చేలోపు కాలువల్లో ఉపాధిహామీ కూలీల ద్వారా పూడికతీత, చెట్ల తొలగింపు చేపట్టాలి. కాకతీయ, ఇతర కాలువల లైనింగ్‌కు నిధులు కేటాయించాలి. కాకతీయ కాలువ, వరదకాలువ నుంచి చెరువుల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జలమట్టం పెరిగి పంపుసెట్లద్వారానూ నీటిని పారించవచ్చు. దెబ్బతిన్న నిర్మాణాలకు మరమ్మతుల ద్వారా చివరిభూముల వరకు నీటిని తరలించేలా చర్యలు చేపట్టాలి.

జిల్లాలో మొత్తం ఆయకట్టు : 1.65 లక్షల ఎకరాలు

ప్రస్తుతం సాగునీరందుతున్నది: 1.30 లక్షల ఎకరాలు

చివరికి నీరందని ఆయకట్టు: 35 వేల ఎకరాలు

డిస్ట్రిబ్యూటరీ కాలువల పొడవు: 136 కి.మీలు

పంట కాలువల పొడవు: 401 కి.మీలు

మరమ్మతు పూర్తయినవి: 75 శాతం

ఇంకా అవసరమున్న పనులు: 32 పనులు

శ్రీరామసాగర్ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం: 112 టీఎంసీలు

పూడిక పేరుకొని ప్రస్తుతం నిల్వచేస్తున్న నీరు: 80.501 టీఎంసీలు

మొత్తం మరమ్మతులకు అవసరమున్న నిధులు: రూ.190.09 కోట్లు

ఇటీవల మరమ్మతులకు వెచ్చింపు: రూ.105 కోట్లు

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా!

నర్సాపూర్: నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ దామెరచెరువులో కొన్ని రోజులుగా అనుమతి లేకుండా శివ్వంపేట మండలం కొత్తపేట, రూప్ల తండాలకు చెందిన పలు ఇటుక బట్టీల నిర్వాహకులు నల్లమట్టిని తరలిస్తున్నారు. విషయం తెలిసి నీటిపారుదలశాఖ సిబ్బంది నలుగురు అక్కడికి వెళ్లి అడ్డుకోగా అక్రమార్కులు వారిపై దాడి చేశారు. గుర్తింపు కార్డులు గుంజుకున్నారు. చరవాణుల్లో డేటా తొలగించారు. మట్టి తరలింపునకు అడ్డొస్తే.. ట్రాక్టరుతో తొక్కేస్తామంటూ బెదిరించారు. భయపడిన సిబ్బంది అదే రోజు నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. కొత్తపేట శివ్వంపేట మండలంలోకి వస్తుందని, అక్కడి ఠాణాకు వెళ్లాలని ఎస్ఐ సూచించడం గమనార్హం. దీంతో సిబ్బంది శివ్వంపేటకు వెళ్లి ఫిర్యాదు చేయగా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.కాసులు కురిపిస్తోంది..నీటితో కళకళలాడాల్సిన చెరువులు, కుంటలు గుంతలమయంగా మారుతున్నాయి. ఇటుక బట్టీల వ్యాపారులకు నల్లమట్టి కాసులు కురిపిస్తోంది. ఎలాంటి అనుమతి లేకుండానే తుజాల్‌పూర్‌లో దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. బట్టీలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్న అధికారులు వాటి నిర్వహణలో లొసుగులను మాత్రం గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తేలికపాటి ఇటుకల తయారీకి నల్లమట్టినే వాడుతుండటంతో డిమాండ్ పెరిగింది. మరోవైపు పలు చోట్ల అనధికారికంగా ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి.

**దౌర్జన్యానికి పాల్పడుతూ..**

చేసేది అక్రమ వ్యాపారం.. పైగా ప్రభుత్వ సిబ్బందిపై దాడి చేయడం చూస్తే అక్రమార్కులు ఎంత దౌర్జన్యం చేస్తున్నారో ఇట్టే అర్థమైపోతుంది. తుజాల్‌పూర్‌లో మట్టి తవ్వకాలు సాగుతుండగా, సిబ్బందిపై దాడి చేస్తే తమ పరిధిలోనిది కాదంటూ శివ్వంపేటకు వెళ్లమని నర్సాపూర్ పోలీసులు సూచించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ స్టేషన్‌కు ఫిర్యాదుల స్వీకరణలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి దక్కడం గమనార్హం.

**నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..**

మట్టి ఉన్న చోట ఇటుక బట్టీ ఏర్పాటు చేసుకుంటే తరలించేందుకు అనుమతి అవసరం లేదు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తే మాత్రం నీటిపారుదల శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. క్యూబిక్ మీటరుకు కొంత సీనరేజ్ ఛార్జీ చెల్లించాల్సిందే. చెరువుల్లో తవ్వకాలకు యంత్రాలు ఉపయోగించొద్దు. కానీ ఇవేవీ పట్టని అక్రమార్కులు ఇష్టానుసారంగా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. నీటివనరుల్లో ప్రమాదకరంగా భారీ గుంతలు ఏర్పడ్డాయి.

రెండో చోట్ల ఫిర్యాదు:మణిభూషణ్, ఏఈ, నీటిపారుదల శాఖ

# లీకేజీలు గుర్తించి.. పైపులైన్లు మార్చేసి

హైదరాబాద్: మహానగరంలో వానాకాలంలో నీటి కాలుష్యానికి అవకాశం లేకుండా జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. పాత పైపులైన్లలో నీటి సరఫరా సమయంలో మురుగు జలాలు, ఇతర వ్యర్థాలు కలుస్తుండటంతో ఫిర్యాదులు వస్తుంటాయి. ఇటీవల జలమండలి వేర్వేరు పనుల కోసం తవ్వుతున్నపుడు పాడైన భారీ పైపులైన్లను గుర్తించారు. వీటి వల్ల భారీగా నీరు వృథా కావడంతో పాటు కలుషిత జలాల సమస్యకు దారితీస్తోంది. డ్రైనేజీ పైపులైన్లు పాడైనపుడు ఆ ప్రాంతంలోని మంచినీటి పైపులైన్లలో లీకేజీలు ఉంటే వాటిలో మురుగు చేరుతోంది.
పక్కపక్కనే పైపులైన్లు: కలుషిత జలాలకు మరో ప్రధాన కారణం..



తాగునీటి, మురుగునీటి పైపులైన్లు పక్కపక్కనే ఉండటం.. లేదంటే ఈ రెండు పైపులైన్లు ఒకదానిపై ఒకటి వెళ్తుండటం, కొన్ని మంచినీటి పైపులైన్లు మ్యాన్‌హోళ్లకు దగ్గరగా ఉండటం లేదంటే సీవరేజీ పైపులైన్ల పక్కన ఉండటంతో నీటి కలుషితానికి అవకాశం ఎక్కువగా ఉంటోంది.

**నాణ్యత పరీక్షలు..**

నీటి నాణ్యత శాంపిళ్లను భారీగా పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. రిజర్వాయర్ల వద్ద పరీక్షలు చేసి తగినంత క్లోరిన్ ఉండేలా పరిశీలన చేయనున్నారు. తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా క్వాలిటీ కంట్రోల్ దృష్టి సారిస్తోందన్నారు.

**ఏళ్ల నాటివి కావడంతో..**

శిథిలావస్థకు చేరిన పైపులైన్‌లను మార్చేందుకు సమాయత్తమైంది. తవ్వకుండానే పైపుల్లో లీకేజీలను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తోంది. పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్‌లో భాగంగా పైపుల్లోకి కెమెరా పంపి దెబ్బతిన్న ప్రాంతాన్ని గుర్తిస్తారు. ఈ విధానంతో తక్కువ సమయంలో లీకేజీని గుర్తించడమే కాకుండా లీకేజీని స్పష్టంగా గుర్తించేందుకు సహాయపడుతుంది. దీంతో పాడైపోయిన పైపుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం ద్వారా కలుషితానికి అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది.

# ‘బిల్డ్‌నౌ’కు బాలారిష్టాలు

హైదరాబాద్: భవనాలు, లేఅవుట్ల అనుమతులకు ఇటీవల ప్రవేశపెట్టిన బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్‌లో కొన్ని లోపాలు సరిదిద్దాలని ఆర్కిటెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు. హెచ్ఎండీఏలో ఇప్పటివరకు 4 వేలకుపైగా అనుమతుల కోసం బిల్డ్‌నౌలోనే దరఖాస్తు చేసుకున్నారు. వాటి సరాసరి స్ర్కూట్నీకి సమయం నిమిషంలోనే ఉంటోందని దరఖాస్తుదారులు చెబుతున్నారు. చిన్న భవనాలకు 40 సెకన్లలోనే స్ర్కూట్నీ పూర్తవుతోందని పేర్కొంటున్నారు. గతంలో డ్రాయింగ్స్‌లో తప్పులుంటే గుర్తించడం కష్టమయ్యేదని.. ప్రస్తుతం అప్‌లోడ్ చేసిన వెంటనే ఎక్కడెక్కడ తప్పులున్నాయో ఇట్టే తెలుస్తోంది.

**లోపాలు ఇవే..**టీజీబీపాస్‌లో దరఖాస్తు ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉందో దరఖాస్తుదారులకు తెలిసేది. బిల్డ్‌నౌలో ఆ పరిస్థితి లేదు. అయితే పైరవీలు అరికట్టడానికి ఈ నిబంధన అమల్లోకి తెచ్చినట్లు చెబుతున్నప్పటికీ..దరఖాస్తు పరిశీలనలో పారదర్శకత లోపిస్తోంది.
కాంబినేషన్ ఆఫ్ బిల్డింగ్‌కు సంబంధించి అనుమతుల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు ఒక దరఖాస్తుదారు ఒకే స్థలంలో కొంత వాణిజ్య, మరికొంత నివాస భవనాల సముదాయాల నిర్మాణానికి




దరఖాస్తు చేసుకున్నప్పుడు సాఫ్ట్‌వేర్ అంగీకరించడం లేదని చెబుతున్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో సెల్లార్ మొత్తం ఏరియాలో 2.5 శాతం వరకు వెంటిలేషన్ ఉండాలనేది నిబంధన. అయితే మారిన నిబంధనల ప్రకారం మెకానికల్ వెంటిలేషన్(యంత్రాలతో కృత్రిమంగా) ఉన్నా సరే...అనుమతులు జారీ చేస్తున్నారు. బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్‌లో దీన్ని మార్చాల్సి ఉంది.
నియంత్రిక లోకేషన్‌కు సంబంధించి అదనంగా స్థలం చూపితేనే అనుమతులు మంజూరవుతున్నాయి. సింగిల్ విండ్‌లో భవనం లేదా లేఅవుట్ కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత ప్రతి అధికారి ఆన్‌లైన్‌లోనే అందులో ఉన్న లోపాల గురించి నోట్‌షీట్ రాయాలి. తరచూ సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

# మత్తు వదిలేలా.. మార్పు తెచ్చేలా

గోదావరిఖని : ఇటీవల మద్యం తాగి వాహనాలు నడిపిన 28 మంది మందుబాబులకు సామాజిక బాధ్యత గుర్తు చేసేలా గోదావరిఖని కోర్టు తీర్పునిచ్చింది. జరిమానాతో పాటు పర్యావరణ పరిరక్షణకు కోర్టు ఆవరణలో మొక్కలు నాటాలని జడ్జి తీర్పు చెప్పారు.
గతేడాది డిసెంబరులో ఓ మందుబాబుకి రోజంతా ట్రాఫిక్ నిబంధనలు అవగాహన కలిగేలా ప్రచారం చేయాలని తీర్పు ఇచ్చారు. రెండోసారి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడటంతో గోదావరిఖని కోర్టు జడ్జి ఈ రకమైన శిక్ష విధించారు. ప్లకార్డులు పట్టుకొని నిబంధనలపై ప్రచారం చేయాలన్నారు.జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట మద్యం తాగి వాహనం నడపడంతో ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అలాంటివారిలో మార్పు రావాలని జడ్జిలు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. జరిమానా విధించడంతోపాటు వారిలో మార్పుకోసం సామాజిక కార్యక్రమాలు చేయాలని తీర్పు చెబుతున్నారు. దీనివల్ల వారిలో మార్పు వచ్చి మద్యం తాగిన తర్వాత వాహనాలు నడపరనే ఆలోచన చేస్తున్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండే యజమాని మద్యం తాగి వాహనం నడిపి ప్రమాదానికి గురైతే ఆ ఇంటి సభ్యులకు ఆధారం లేకుండా పోతుంది. వీటిని పరిగణనలోకి తీసుకుని వారిలో పరివర్తనకు న్యాయమూర్తులు ఇలాంటి శిక్షలు విధిస్తున్నారు.

# పైలట్ నియంత్రణలో లేనిదేదో జరిగింది



హైదరాబాద్: కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, బ్లాక్‌బాక్స్ డీకోడ్ చేస్తే తప్ప అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదానికి కచ్చితమైన కారణాలను చెప్పలేమని తెలంగాణ ఏవియేషన్ అకాడమీ సీఈవో ఎస్.ఎన్.రెడ్డి అన్నారు. 24-36 గంటల వ్యవధిలో డీకోడ్ చేయవచ్చన్నారు. ప్రమాద ఘటనపై

**ప్రమాద కారణాలు ఊహించడం కష్టమే**

ప్రమాదాలకు ప్రధానంగా సాంకేతిక లోపాలు, అనుభవం లేని పైలెట్లు, వాతావరణ బాగోలేకపోవడం వంటివి కన్పిస్తుంటాయి. బోయింగ్ 787 ఎయిర్‌లైనర్ అధునాతనమైనది. అనుభవం కల్గిన పైలెట్లు ఉన్నారు. వాతావరణం బాగానే ఉంది. కారణం ఏమై ఉంటుందో కచ్చితంగా తెలియదు.

**తనిఖీలు చేశాకే టేకాఫ్:** టేకాఫ్ అయిన వెంటనే ప్రమాదమంటే.. తనిఖీలు చేయలేదా అంటున్నారు. విమానం టేకాఫ్‌కు ముందు ఇంజినీర్లు ప్రతిదీ తనిఖీచేసి సర్టిఫై చేశాకే పైలెట్లు ముందుకొస్తారు. వారూ అన్ని చూసుకునే టేకాఫ్ చేస్తారు.

**రెండు ఇంజిన్లు ఫెయిలయ్యాయా..:** 25 వేల కంటే ఎక్కువ గంటలు గగనతలంలో శిక్షణ ఇచ్చిన అనుభవం నాది. రెండు ఇంజిన్లు విఫలమయ్యే అవకాశం చాలా అరుదు. ఒకటి, రెండు పక్షులతో ఇబ్బంది ఉండదు. ఒకేసారి వేల సంఖ్యలో పక్షులు వస్తే ఇంజిన్లలోకి వెళితే ఫెయిలవుతాయి. ఇదీ కాదంటే.. ఇంధన కల్తీతోనే ఇంజిన్లు ఫెయిలయ్యే అవకాశముంది. పైలెట్ నియంత్రణలో లేని విషయం ఏదో జరిగింది.

**బ్లాక్‌బాక్సే కీలకం:** ఆ సమయంలో వారు ఏం మాట్లాడుకున్నారనేది కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఉంటుంది. బ్లాక్ బాక్స్‌లో డీఎఫ్‌డీఆర్(డిజిటల్ ఫ్లైట్ డాటా రికార్డరు) డీకోడ్ చేస్తే తెలిసిపోతుంది. నేను ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో ఫ్లైట్ సెఫ్టీ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు డీకోడ్ వ్యవస్థను ఇండియాకు తీసుకొచ్చాం. విమానాలు సముద్రాలు, గుట్టల్లో కూలినప్పుడు బ్లాక్‌బాక్స్‌లు దొరకడం కష్టం. ఇక్కడ జనావాసాల్లో కాబట్టి వెంటనే సేకరించి డీకోడ్ చేసేందుకు పంపితే 90 శాతం కారణాలు తెలిసే అవకాశం ఉంది. కొన్ని గంటల్లో సమాచారం తెలుస్తుంది. **విచారణల అనంతరమే..:** ఇలాంటి ప్రమాదాలపై నిపుణులు, ఎయిర్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బోర్డు, డీజీసీఏ విచారణ జరిపిస్తాయి. మానవ తప్పిదమా? సాంకేతికత కారణమా? తేలుస్తారు. రెండో అతిపెద్ద ప్రమాదం: భారత్‌లో ఇంత పెద్ద ప్రమాదం జరగడం ఇది రెండోసారి. గతంలో కజికిస్తాన్, సౌదీ ఆరేబియా విమానాలు దిల్లీ గగనతనంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో 500 మంది వరకు చనిపోయారు. ఇది సమాచార లోపంతో జరిగింది. పైలెట్లు ఆంగ్లభాష లోపాలతో ఒకే ఎత్తులో రెండు విమానాలు రావడంతో ఢీకొన్నాయి.

# యూపీహెచ్‌సీల్లో ఆర్టీపీసీఆర్ పరీక్షలు




హైదరాబాద్: దేశ వ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా...నగర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆర్టీపీసీఆర్ పరీక్షలకు సిద్ధం చేసింది. లక్షణాలు ఉంటే...ఎవరైనా దగ్గరలోని యూపీహెచ్‌సీలకు వెళ్లి పరీక్ష చేయించుకోవచ్చని శాఖ అధికారులు సూచిస్తున్నారు.
91 ఆరోగ్య కేంద్రాల్లో.. గాంధీ, ఫీవర్ ఆసుపత్రిలో సైతం కరోనా పరీక్షలు చేస్తున్నారు. ఇటీవలి ఓ కార్పొరేట్ ఆసుపత్రి పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన 9 మందిలో కరోనా నిర్ధారణ అయినట్లు సమాచారం. ఇందులో 3 నెలల వయసున్న ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. గాంధీ ఆసుపత్రిలో ఒకరిద్దరూ కరోనాతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. నగరంలో అందుబాటులో ఉన్న 91 యూపీహెచ్‌సీల పరిధిలో ఎవరికైనా కరోనా లక్షణాలు బయట పడితే...వారు పరీక్షలు చేయించుకొని...ఇంటికే పరిమితం కావడం వల్ల ఇతరులకు సోకకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. వివిధ రకాల మ్యూటేషన్‌లతో కరోనా వ్యాప్తి చెందుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎల్‌ఎఫ్.7, ఎల్‌పీ 8.1.2. హెచ్445ఆర్, ఎన్487డీ తదితర రకాలు ఎక్కువ వ్యాప్తికి కారణమవుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే చాలామందిలో స్వల్ప లక్షణాలు మాత్రమే ఉంటున్నాయి. జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, రుచి, వాసన కోల్పోవడం లాంటి లక్షణాలతో బాధపడుతున్నారు. పరీక్షల కోసం శాంపిళ్లు ఇచ్చి...రిపోర్టు వచ్చే లోపే చాలామందిలో లక్షణాలు తగ్గుముఖం పడుతున్నాయని పేర్కొంటున్నారు.

**బూస్టర్ డోసు కోసం ఆరా...** కరోనా కేసులతో చాలామంది 60, 70 ఏళ్లు దాటిన వృద్ధులు బూస్టర్ డోసు కోసం ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఆరా తీస్తున్నారు. గతంలోని నగరంలోని ప్రభుత్వ ఆసుత్రుల పరిధిలో కరోనా వ్యాక్సిన్ అందుబాటులో పెట్టారు. ఇప్పటికే చాలామంది టీకాలు తీసుకున్నారు. ఇప్పటికే 4 ఏళ్లు గడిచిపోవడంతో బూస్టర్ డోసుపై మళ్లీ చర్చ నడుస్తోంది. 60 ఏళ్లు దాటడటం...ఇప్పటికే మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ లాంటి జబ్బులతో బాధపడే వారు...అవయవ మార్పిడి చేయించుకున్న వారు...దీర్ఘకాలిక వ్యాధులకు ఔషధాలు తీసుకుంటున్న వారిలో వ్యాధి నిరోధక శక్తి ఇతరుల కంటే తక్కువగా ఉంటుంది. సాధారణ వ్యక్తుల కంటే ఇలాంటి వారు కరోనా విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. నిపుణులను సంప్రదించి బూస్టర్ డోసు అవసరమా...లేదా..అని నిర్ధారించుకొని అవసరమైతే తీసుకోవాలని సూచిస్తున్నారు.

# నేరాలకు విడిదిల్లు

హైదరాబాద్: నగరానికి దూరంగా ప్రశాంత వాతావరణం.. పచ్చటి పొలాల మధ్య ఏర్పాటైన ఫాంహౌస్‌లు(విడిదిల్లు) నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. డ్రగ్స్, గంజాయి వినియోగం, రేవ్‌పార్టీలు, ముజ్రాపార్టీలు, కోడిపందేలు, జూదం, బెట్టింగ్, వ్యభిచారం, రౌడీషీటర్ల సెటిల్‌మెంట్లు ఇలా అడ్డగోలు దారుణాలు, నేరాలకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నాయి. తాజాగా ప్రముఖ గాయని మంగ్లీ పుట్టినరోజు వేడుకతో ఫాంహౌస్‌ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అనుమతుల్లేకుండా మద్యం పార్టీ నిర్వహించడం, అందులో పాల్గొన్న ఒకరికి గంజాయి పాజిటివ్‌గా తేలడంతో కేసు నమోదు చేశారు.

**వారాంతాల్లో..**వ్యవసాయ క్షేత్రాలు నిర్మానుష్య ప్రాంతాల్లో విసిరేసినట్లు ఉండడం, చుట్టూ ఎత్తైన గోడలతో లోపల ఏం జరుగుతుందో గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. ఇదే నేరగాళ్లకు అవకాశంగా మారుతోంది. వారాంతాల్లో వ్యభిచారం, బెట్టింగ్, ముజ్రా పార్టీలు నిర్వహిస్తున్నారు.

**ఇలాంటి నేరాలెన్నో..**

నార్సింగి పరిధిలో భూ వివాదంలో ఎమ్మార్పీఎస్ నేతను కిడ్నాప్ చేసిన ఓ ముఠా శంషాబాద్ సమీపంలోని ఫాంహౌస్‌లో నిర్బంధించి రెండ్రోజులు చిత్రహింసలు పెట్టింది. నిందితుల నుంచి తప్పించుకున్న నిందితుడు పోలీసులకు ఫాంహౌస్ గురించి సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఫాంహౌస్‌కు వెళ్లి తనిఖీ చేయగా నిందితులు తరచూ కొందరిని నిర్బంధించి వేధించినట్లు తేలింది. పదుల సంఖ్యలో కుక్కలు, అక్కడి వాతావరణం చూసి పోలీసులే ఆశ్చర్యపోయారు.
మొయినాబాద్ మండలం తొల్కట్టలోని ఫాంహౌస్‌లో ఎస్‌వోటీ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేయగా క్యాసినో తరహాలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తేలింది. ఫాంహౌస్ ఎవరిదని ఆరాతీయగా ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డిదని గుర్తించారు. ఏడాదిన్నర నుంచి ఫాంహౌస్‌లో



కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.
మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల గతేడాది జన్వాడలోని ఫాంహౌస్‌లో నిర్వహించిన దీపావళి పార్టీ పెద్ద దుమారం రేపింది. రాజ్‌పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరిని పోలీసులు పరీక్షించగా కొకైన్ పాజిటివ్‌గా వచ్చింది. పార్టీలో భారీగా విదేశీ, పన్ను చెల్లించని మద్యం, క్యాసినోల్లో వినియోగించే కాయిన్లు పట్టుబడ్డాయి.
మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌లో ఎస్‌వోటీ పోలీసులు తనిఖీ చేయగా ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నట్లు తేలింది. నిందితులు పశ్చిమబెంగాల్ సహా వివిధ రాష్ట్రాల నుంచి యువతుల్ని ఇక్కడికి రప్పించి ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారు. వీరి నుంచి హుక్కా, మద్యం, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిఘాలో సవాళ్లు.. యజమానుల నిర్లక్ష్యం మొయినాబాద్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, శామీర్‌పేట సమీప ప్రాంతాల్లో ఫాంహౌస్‌లు ఉన్నాయి. వేల సంఖ్యల్లో దూరంగా విసిరేసినట్లు ఉండే వీటిపై నిరంతర నిఘా సాధ్యపడని పరిస్థితి. స్థానిక నిఘా, ఇతరత్రా సమాచారంతో వెళ్లినప్పుడే చీకటి బాగోతాలు బయటపడుతున్నాయి. ఎస్‌వోటీ విభాగం స్థానిక పోలీసులతో కలిసి వారాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నా.. పరిమితమే.

# ఆక్రమణలో సాగునీటి వనరులు

ధర్మపురి: వడ్లవాని కుంట ధర్మపురి పట్టణ సమీపంలో ఉంది. సుమారు 50 ఎకరాలకు సాగు నీరందిస్తోంది. మరమ్మతులు కరవై అధ్వానంగా మారింది. 5 ఎకరాల వరకు చెరువు భూమి ఆక్రమణకు గురైనట్లు పలువురు ఆరోపిస్తున్నారు. 2016లో రూ.13 కోట్లతో కట్టకు మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టారు. అనంతరం వరదలు, అధికారులు పట్టించుకోకపోవటంతో కుంట ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కట్ట మరమ్మతు చేయడంతో పాటు పూడిక, పిచ్చిమొక్కల్ని తొలగించాలని రైతులు కోరుతున్నారు.
వానాకాలం నేపథ్యంలో వరదనీరు చెరువులు, కుంటల్లోకి చేరే తరుణం వచ్చింది. తటాకాలు నిండితే రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. కానీ ధర్మపురి ప్రాంతంలోని పలు చెరువు(కుంట)లకు దశాబ్ద కాలంగా మరమ్మతులు కరవై అధ్వానంగా మారాయి. ఎటుచూసినా పిచ్చిమొక్కలు, పగుళ్లు, గుంతలతో నిండిపోయాయి. ఒకప్పుడు ధర్మపురి పట్టణం



లో చెరువుల ద్వారా వేసవిలోనూ నీటి ఎద్దడి రాకపోయేది. అలాంటి చెరువులకు కనీస మరమ్మతులు లేక, నిర్లక్ష్యంతో ఆక్రమణల బారిన పడుతున్నాయి. మిషన్ కాకతీయ పథకం అమలులో ఉన్నప్పుడు పరిస్థితి బాగానే ఉండగా.. అనంతరం అధికారులు పట్టించుకోవటం లేదు.

**13 కుంటల పరిస్థితి అంతే..**

ధర్మపురి పట్టణ సమీపంలోని అక్కపల్లి చెరువుకు సుమారు 13 కుంటలు అనుసంధానమై ఉన్నాయి. చెరువు నిండితే కుంటలలో సమృద్ధిగా నీరు ఉండేది. దీంతో ఈ ప్రాంతంలో సాగు, తాగునీటికి ఢోకా ఉండేది కాదు. కాని ప్రస్తుతం కట్టలు పగుళ్లతో శిథిలావస్థకు చేరాయి. కుంటల్లో పూర్తిగా పిచ్చి మొక్కలు పెరిగాయి. తూములు మరమ్మతులకు నోచుకోవటం లేదు. ఏటా వర్షాకాలంలో నీరంతా వృథాగా పోతోంది. చివరి ఆయకట్టుకు సాగు నీరందే పరిస్థితి లేకుండా పోయింది. మరమ్మతులు జరిపించాలని రైతులు కోరుతున్నారు.

# కష్టాల వంతెన దాటించరూ..

వేములవాడ : మార్గంలో స్తంభంపల్లి వద్ద చిన్నపాటి వర్షానికే గంజివాగు ఉప్పొంగుతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇక్కడ 2022-23లో హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన గుత్తేదారు ఏడాదిలో పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. వర్షాకాలంలోపు వంతెనను పూర్తి చేయాలని మే నెలలో గ్రామస్థులంతా పాదయాత్రగా కలెక్టరేట్కు చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. అయినా పనులు ప్రారంభం కాలేదు. జిల్లాలో రెండేళ్లుగా వాగులు, వంకలపై చేపట్టాల్సిన వంతెన నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. గుత్తేదారులకు నిధులు మంజూరు కావడం లేదని కొన్ని చోట్ల, కూలీలు, సామగ్రి కొరత ఉందని మరికొన్ని చోట్ల ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే సమస్యలు మరింత తీవ్రతరం కానున్నాయి.సిద్దిపేట-కామారెడ్డి మార్గంలో గంభీరావుపేట మండలం లింగన్నపేట వద్ద మానేరువాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి మూడేళ్ల క్రితం రూ.10.60 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం పిల్లర్లు వేసేందుకు వాగులో రాళ్లు ఉండటంతో వాటిని తొలగించేందుకు బ్లాస్టింగ్ అనుమతులు లేక పనులు నిలిచిపోయాయి. ఈ మార్గంలో కామారెడ్డి నుంచి గంభీరావుపేట మీదుగా ముస్తాబాద్, సిద్దిపేట, దుబ్బాకకు వెళ్లేవారు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట వద్ద నక్కవాగుపై రూ.11.55 కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు చివరి దశలో ఉన్నాయి. వంతెన రక్షణ గోడలు, రెండువైపులా తారు రోడ్డును కలిపే పనులు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితేనే రాకపోకలు సులభమవుతాయి. కోనరావుపేట మండలం లింగంపల్లి, మంగళ్లపల్లి, సుద్దాల గ్రామాల వారు మారుపాక, నందికమాన్ మీదుగా వేములవాడకు వెళ్తున్నారు. ఇదే మార్గంలో మల్లారం వద్ద నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు చివరిదశలో ఉన్నాయి.
తంగళ్లపల్లి- ముస్తాబాద్ మార్గంలో నక్కవాగుపై జిల్లెల శివారు భగత్‌నగర్ వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.6.5 కోట్లు మంజూరయ్యాయి. రెండోదశ అటవీశాఖ అనుమతులు రాక పనులు నిలిచిపోయాయి.
కోనరావుపేట మండలంలో మూలవాగుపై మామిడిపల్లి-నిజామాబాద్, బావుసాయిపేట-వెంకట్రావుపేట, వట్టిమల్ల-నిమ్మపల్లి, కొండాపూర్-వెంకట్రావుపేట పెంటివాగుపై నాలుగు చోట్ల హైలెవల్ వంతెన నిర్మాణాలకు రెండేళ్ల క్రితం రూ.54 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల దశలో పనులు నిలిచిపోయాయి. వరదలకు కొట్టుకుపోయిన చోట పైపులు వేసి మట్టితో కప్పి తాత్కాలిక వంతెన నిర్మించారు. భారీ వరదలకు ఏటా మట్టి, పైపులు కొట్టుకుపోతూనే ఉన్నాయి.

**ప్రతిపాదనలు పంపించాం**

– సుదర్శన్, వెంకటరమణయ్య, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ ఈఈలు
ఆర్అండ్‌బీ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ హ్యామ్‌లో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. ప్రైవేటు సంస్థతో సర్వే చేశాక పనులు ప్రారంభమవుతాయి. పంచాయతీరాజ్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

# నిలిచిన ప్రోత్సాహకాలు.. తగ్గుతున్న ప్రసవాలు

సంగారెడ్డి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవమైన గర్భిణులకు అందించే ప్రోత్సాహకాలు నిలిచిపోయాయి. గతేడాదితో పోల్చితే సర్కారు దవాఖానాల్లో కొంతమేర ప్రసవాలు తగ్గాయి. గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే.. ఏదో ఒక కారణంతో వారిని ఆందోళనకు గురిచేసి.. శస్త్ర చికిత్సలతో కాన్పులు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొంది. వైద్యారోగ్యశాఖ సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలి.

**గతంలో ప్రత్యేక దృష్టి**

మూడేళ్ల కిందటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేసింది. ముఖ్యంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలోనూ సాధారణ ప్రసవాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టింది. దీంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటులో ప్రసవాలపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఏయే దవాఖానాల్లో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయో గుర్తించింది. నిఘాపెట్టి కోతల కాన్పులకు చెక్ పెట్టింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం సాధారణ ప్రసవాల్లో గతంలో రాష్ట్రంలో తృతీయ స్థానం సాధించింది.
ప్రధాన కారణాలివి..సర్కారు దవాఖానాల్లో ప్రసవమైన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం.ప్రజలకు అందుబాటులో ఉండే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గడం. క్షేత్రస్థాయిలో యంత్రాంగం పర్యవేక్షణ లోపం. ప్రాంతీయ, బోధనాసుపత్రులతో పాటు మాతా శిశుసంరక్షణ కేంద్రాల్లోనే ప్రసవాలు జరుగుతున్నాయి. దీంతో వీటిలో విధులు నిర్వహించే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది.వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గతంలో మాదిరిగానే ఉన్నాయని వివరిస్తున్నారు.

చురకలు



# ఇంకేది.. ఇంకెప్పుడు..

హైదరాబాద్ : నగరంలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతున్నా ఈ పరిస్థితి ఎదురవుతోంది. దీనికి కారణం నీరు భూమిలోకి ఇంకకపోవడమే. అయినా ఇంకుడు గుంతల విషయంలో అధికారుల ఉదాసీనత వీడటం లేదు. కొత్తవి పక్కనపెడితే ఉన్నవి సైతం నిర్వహణకు నోచుకోవడం లేదు. నగరంలోని పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయ ఆవరణల్లో 2016లో సుమారు 7 వేల వరకు ఇంకుడుగుంతలు నిర్మించారు. ఇందులో చాలావరకు మట్టి, రాళ్లు, ఇతర వ్యర్థాలతో నిండిపోయాయి. వీటిని కనీసం రెండు, మూడేళ్లకోసారైనా పునరుద్ధరించుకోవాలి. ఇంకుడు గుంతలను నిర్మించి వాటికి జియోట్యాగింగ్ చేసి నిర్వహణపైనా దృష్టిసారించాలని అనుకున్నారు. కానీ వాటి ఏర్పాటుపై తీసుకున్న శ్రద్ధ నిర్వహణపై పెట్టకపోవడంతో నిధులన్నీ



వృథా అయ్యాయి. కొన్నిచోట్ల వీటి ఫలితాలు కనిపించగా.. తరువాత వారు కూడా వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.

**మట్టి, చెత్తతో నిరుపయోగంగా**

సాధారణంగా ఇంకుడుగుంతలను అందుబాటులోని స్థలం ఆధారంగా ఏర్పాటు చేస్తారు. సుమారు మీటరున్నర నుంచి రెండు మీటర్లలోతు వరకు తవ్వుతారు. తరువాత వివిధ పరిమాణాల్లో రాళ్లు, కంకర, ఇసుకను పొరలుగా వేస్తారు. పైభాగంలోని ఇసుక వాననీరు లోపలికి ఇంకేలా చేస్తుంది. వర్షపునీటితో పాటు మట్టి ఇతర వ్యర్థాలు కూడా చేరుతాయి. వీటి పరిమాణం పెరిగే కొద్దీ భూమిలో నీరు ఇంకే పరిస్థితి తగ్గిపోతుంది. నిర్వహణ లేకుంటే పూర్తిగా నిరుపయోగంగా మారుతుంది. పరిమాణం మేరకు రూ.2 వేల నుంచి రూ.10 వేలు వెచ్చిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడంతో భూగర్భ జలాలు భూమిలో ఇంకడం అంతకంతకు తగ్గిపోతోందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. యంత్రాంగం స్పందించాలి.

# సేకరణ సాగక.. బైపాస్ పూర్తికాక..

తాండూరు: జిల్లాలో వ్యాపార, వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో సగంలోనే ఆగిపోయిన బైపాస్ రోడ్డు పనుల్లో పురోగతి కనిపించడం లేదు. అన్ని వాహనాలు పట్టణం నడిబొడ్డు నుంచే రాకపోకలు సాగించడంతో స్థానికులు తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ప్రాణవాయువు కూడా కాలుష్యకారకంగా మారుతోంది.

**ఇవీ వివరాలు..**

మంజూరైన నిధులు: రూ.78 కోట్లు
పనులు ప్రారంభం: 2017
రోడ్డు పొడవు: 12 కి.మీ.
మొత్తం భూ సేకరణ: 99.28 ఎకరాలు
ఇందులో రైతుల పట్టా భూములు: 87.26 ఎకరాలు
ప్రభుత్వ భూమి: 12.02 ఎకరాలు
రైతుల నుంచి స్వాధీనం చేసుకోవాల్సిన భూమి: 17.20 ఎకరాలు
భూములు కోల్పోయిన రైతులు: 189 మంది
రైతులకు చెల్లించే పరిహారం నిధి: రూ.21.87 కోట్లు

ట్రాఫిక్, కాలుష్య చిక్కులు పరిష్కరించాలని..

ట్రాఫిక్, కాలుష్య సమస్యల పరిష్కారానికి పట్టణం వెలుపలి నుంచి



బైపాస్ రోడ్డు నిర్మాణం తప్పదని రహదారులు, భవనాల శాఖ ఎనిమిదేళ్ల కిందట నిర్ణయించింది. ఆ మేరకు ప్రతిపాదనలు పంపించడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. నిర్ణీత భూసేకరణలో కొంత భూమిని రైతుల నుంచి అధికారులు ఇంకా స్వాధీనం చేసుకోలేదు. దీంతో పనులు సాగడంలేదు.

**వివాదాస్పద పొలాలు వదిలేసి...**

గౌతాపూరు శివారు నుంచి అంతారం గ్రామ శివారు పెద్దేముల్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డును అనుసంధానించే వరకు రోడ్డు పూర్తయింది. ఇక్కడి నుంచి బషీర్‌మియా తండా వైపు వెళ్లే రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పొలం చుట్టూ సంబంధిత రైతు కంచె ఏర్పాటు చేశారు. దీంతో గుత్తేదారు ఇక్కడ పనులను ఆపేశారు. వివాదాస్పద పొలాన్ని వదిలేసి అధికారులు స్వాధీనం చేసుకున్న పొలాల్లోంచి రోడ్డు వేయడానికి కంకర పరచి వదిలేశారు. ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రం నుంచి చేపట్టాల్సిన పనులు ఇంకా ప్రారంభం కాలేదు. గుత్తేదారు కోకట్ చెరువులో వంతెన పనులు చేపట్టారు. ఇవి అసంపూర్తిగా మిగిలి పోయాయి. సమస్య ఉన్నతాధికారుల పరిధిలో ఉందిబైపాస్ రోడ్డు నిర్మాణానికి భూ స్వాధీనం పూర్తయితేనే పనులు పునః ప్రారంభమవుతాయి. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. శ్రావణ్‌కుమార్, సహాయ ఇంజినీరు, రోడ్లు, భవనాల శాఖ, తాండూరు.

# అయిదు వేల మంది పింఛనకు దూరం




గోదావరిఖని : సింగరేణి వ్యాప్తంగా 5,058 మంది విశ్రాంత కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన పింఛనును అధికారులు నిలిపివేశారు. జీవన ప్రమాణ పత్రాలు అందించకపోవటం తోనే పింఛన్ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. విశ్రాంత కార్మికులు, వారి కుటుంబీకులు ప్రతి సంవత్సరం జీవన ప్రమాణ పత్రాలు అందించాల్సి ఉంటుంది. ఏటా డిసెంబరు నెలలో జీవన ప్రమాణ పత్రాలు ఆఫ్‌లైన్‌లో లేదా ఆన్‌లైన్‌లో అందించాలని సీఎంపీఎఫ్ అధికారులు ప్రకటన ఇస్తారు. అయినా కొంతమంది జీవన ప్రమాణ పత్రాలు అందించకపోవడం వల్ల వారికి రావాల్సిన పింఛను నిలిచిపోయింది.

**82 వేల మంది పింఛనుదారులు**

సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు 82,387 మంది ఉన్నారు. వీరంతా పింఛను పొందుతున్నారు. నెలకు వీరికి రూ.79.91 కోట్లు సీఎంపీఎఫ్ సంస్థ చెల్లిస్తోంది. ఇందులో అతి తక్కువగా రూ.1000 లోపు పింఛను పొందుతున్న వారు 8349 మంది ఉన్నారు.

**మూడు దశాబ్దాలుగా సవరణ లేదు**

బొగ్గుగని కార్మికుల పింఛను సవరించకపోవడంతో పాత విధానంలోనే విశ్రాంత కార్మికులు లబ్ధి పొందుతున్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సవరించాల్సిన పింఛను ఇప్పటివరకు ఒక్కసారి కూడా మార్పు చేయలేదు. మార్కెట్ సూచీ, ధరల ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి విశ్రాంత కార్మికులకు చెల్లిస్తున్న పింఛను సవరించాలి. కానీ 1995లో ప్రవేశపెట్టిన పింఛనును మూడు దశాబ్దాలుగా అదే స్థాయిలో చెల్లిస్తున్నారు. దీంతో రూ.1000 లోపు పింఛను పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు కూడా ఉన్నారు. కనీస పింఛను రూ.10 వేలకు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయినా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. పింఛను నిధిని ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు సింగరేణి చర్యలు తీసుకుంటుంది. ప్రతి టన్నుపై బొగ్గు పరిశ్రమల యాజమాన్యాలు రూ.20 చెల్లిస్తున్నాయి. దీనివల్ల వనరులు పెరిగి పింఛను చెల్లింపులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమయంలోనైనా పింఛను సవరించాలని విశ్రాంత కార్మికులు కోరుతున్నారు.

పింఛనుదారుల వివరాలు
మొత్తం పింఛనుదారులు:82,387
నెలకు పొందుతున్న పింఛను(రూ.లలో) :రూ.79,91,74,462
ప్రస్తుతం పింఛను అందని వారు :5,058

# ప్రత్యేక వైద్యం.. ఆదరణ శూన్యం!



హైదరాబాద్ : భిక్షపతి వయస్సు 70కి పైనే. ఊరు కొమురెల్లి. అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఆసుపత్రిలో చూపిస్తే...గుండెలో సమస్య ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యులు గాంధీలోని జిరియాట్రిక్(వయోవృద్ధులకు అందించే ప్రత్యేక వైద్య సేవలు) వార్డులో చేర్పించారు. అక్కడే 20 రోజులుగా అన్ని రకాల చికిత్సలు అందిస్తున్నారు. మొత్తం వార్డులో ప్రస్తుతం ఆయన ఒక్కరే చికిత్స తీసుకుంటున్నారు.

**60 ఏళ్లు దాటిన వారికి...** ఆరు పదులు దాటినవారు ఏదైనా శారీరక రుగ్మత బారినపడి ఆసుపత్రి కి వస్తే వారికి మానసికంగా, శారీరకంగా సాంత్వన కల్పిస్తూ వైద్యాన్ని అందించాలనేది ఈ సేవల ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా చెరో 20 పడకలతో వార్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో అన్ని వయసుల వారికి వైద్య సేవలందిస్తున్నారు. అందులో వృద్ధులు కూడా చికిత్స తీసుకుంటున్నారు. మిగతా రోగులతో కలిపి వీరికి చికిత్స చేయడంతో వీరిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టడం కుదరడం లేదు. ఈ నేపథ్యంలోనే జిరియాట్రిక్ వార్డులు తెరపైకి వచ్చాయి. వృద్ధులకు సౌకర్యవంతంగా వార్డులు రూపొందించారు. వారికిచ్చే ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పురుషుల వార్డులో ఒక్కరే చికిత్స తీసుకుంటుండగా మహిళల వార్డులో రోగులు అసలే లేరు.

**ప్రచారం లేక..** గాంధీలో ప్రత్యేకంగా ప్రారంభించిన జిరియాట్రిక్ వైద్య సేవలు వెలవెలబోతున్నాయి. దీని గురించి తెలియక పోవడం ఒక కారణమైతే...ప్రచారం లేకపోవడం మరో కారణం. సాధారణ వార్డుల వద్ద ఓపీ సేవల కోసం చాలామంది వృద్ధులు నిరీక్షిస్తున్నారు. గంటల తరబడి అక్కడే పడిగాపులు పడుతున్నారు.

**ప్రత్యేక వైద్య బృందం..** ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి అనుసంధానంగా ఉండే జిరియాట్రిక్ (వృద్ధుల) విభాగానికి 4 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ విభాగంలో విధులు నిర్వహించేందుకు ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతోపాటు ఇద్దరు సీనియర్ రెసిడెంట్లు, జూనియర్ వైద్యులు, 30 మంది స్టాఫ్‌నర్సులు, ఫిజియోథెరపిస్టులు అవసరమని భావించిన యంత్రాంగం వారిని కేటాయించే ప్రక్రియను చేపట్టింది.

# పీఎం కిసాన్.. కొందరికే సహాయం

బొంరాస్‌పేట: రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం వల్ల జిల్లాలో కొందరు రైతులకు మాత్రమే ప్రయోజనం కలుగుతోంది. 2019 జనవరి 31 వరకు పట్టాదారు పాసు పుస్తకాలు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులనే ఈ పథకానికి అర్హులుగా గుర్తించి సాగుకు పెట్టుబడిగా ఏటా మూడు విడతల్లో కలిపి రూ.6 వేలు రైతుల ఖాతాలలో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఆ తరువాత పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకంలో చేరదామంటే నమోదుకు అవకాశం ఇవ్వడం లేదు. దీంతో చాలా మంది సన్న, చిన్నకారు రైతులు పెట్టుబడి సహాయానికి దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకం కింద అందరు రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తుండగా ఏటా కొత్త వారు పథకంలో చేరడానికి అవకాశం కల్పిస్తున్నారు. కేంద్ర పథకంలో ఆ అవకాశం లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏటా తగ్గుతున్న లబ్ధిదారులు**

ఈ పథకంలో ఏటేటా లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. పథకంలోని లబ్ధిదారులు చనిపోతే నిబంధనల ప్రకారం ఆ భూమిని పంచుకున్న వారసులకు పథకం వర్తింప చేయాలి. అది అమలు కావడం లేదు. పథకం ప్రారంభించినప్పుడు జిల్లాలో 1.60 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా ఏడేళ్లలో సగానికిపైగా తగ్గి 73,840కు చేరుకుంది. రూపొందించిన నిబంధనల ప్రకారం 2023లో కటాఫ్ తేదీ పెంచాల్సి ఉన్నా కేంద్రం పెంచలేదు. దీంతో కొత్త వారికి అవకాశం లేకుండా పోయింది.

**విశిష్ట గుర్తింపు కార్డుపై ఆశలు:** ఆధార్ కార్డు తరహాలోనే రైతులకు



11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డును జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. వీటి ద్వారానే ప్రభుత్వ పథకాలను అమలు చేయాని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఇటీవలే రాష్ట్రంలో ప్రారంభమైంది. గుర్తింపు కార్డు కోసం వ్యవసాయశాఖ అధికారులు రైతుల పేర్లను నమోదు చేస్తున్నారు.

**ఇవీ పథకం వివరాలు**

పీఎం కిసాన్ ప్రారంభం – 2019, ఫిబ్రవరి.
ఏటా మూడు విడతల్లో అందించే పెట్టుబడి సహాయం –రూ.6 వేలు.
ఇప్పటివరకు 19 విడతల్లో జిల్లాలో రైతులకు అందించిన సహాయం– రూ.499.10 కోట్లు.
జిల్లాలో మొత్తం రైతులు –2,97,000.
2025, జనవరిలో పెట్టుబడి సహాయం అందుకున్న రైతులు– 73,840.

# మామిడితో బాట సింగారం

రంగారెడ్డి : ఫలాల్లో రాజుగా పేరుగాంచిన మామిడి క్రయవిక్రయాల్లోనూ రాజసం ప్రదర్శిస్తోంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని పండ్ల మార్కెట్లో ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచే మామిడి జోరు కొనసాగుతోంది. క్రయవిక్రయాలు ఇప్పటికే 81వేల టన్నుల మార్కును దాటేసింది. దీంతో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి కాసుల పంట పండుతోంది. బంగినపల్లిదే హవా..! : తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి బాటసింగారం మార్కెట్‌కు మామిడి పెద్ద ఎత్తున వస్తోంది. ప్రస్తుతం 11 రకాల మామిడి వస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అందులో రుచిలో రారాజు బంగినపల్లి (బెనిషాన్)దే అగ్రభాగమని చెప్పాలి. వచ్చే మామిడిలో 85 శాతం ఆ రకమే కావడం గమనార్హం. ఇక్కడికి వచ్చిన మామిడిని గ్రేడింగ్ చేసి నిబంధనల మేరకు ప్యాక్ చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే మామిడిలో సుమారు 70 శాతం ఇతర ప్రాంతాలకు ఎగుమతి



అవుతుండగా.. మిగతాది స్థానికంగా విక్రయమవుతోంది. బాటసింగారం మార్కెట్‌కు వచ్చే మామిడిలో అగ్రభాగం బంగినపల్లిది కాగా.. తరువాత స్థానాల్లో దసేరి, నాటి, తోతాపురి, రసాలు, కేసరి, హిమాయత్, మల్లిక, సుందరి తదితర రకాలున్నాయి.

ఎగుమతులు ఎక్కడికంటే..: ఇక్కడి వ్యాపారులు మామిడిని కొనుగోలు చేసి రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, యూపీ, ఎంపీ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ పండ్ల మార్కెట్లో రైతులకు, వ్యాపారులకు అవసరమైన ఏర్పాట్లు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మామిడి రికార్డు స్థాయిలో వస్తోంది. వ్యాపారం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాం. రైతులు, వ్యాపారులు ఎలాంటి ఆటంకాలు లేకుండా క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే రూ.2.37 కోట్ల ఆదాయం మార్కెట్‌కు వచ్చింది. చిలుక మధుసూదన్‌రెడ్డి, ఛైర్మన్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ

# వన్యప్రాణుల విలవిల.. సందర్శకుల్లేక వెలవెల

కరీంనగర్ : వేసవి ఎండల ప్రభావంతో జిల్లా పర్యాటక స్థలాలు, పార్కులు బోసిపోతున్నాయి. వన్యప్రాణులు కూడా విలవిలలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని జింకల పార్కు, ఎల్ఎండీ బోటింగ్ కేంద్రాలు, పరిసరాలు పొద్దంతా నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. జింకల పార్కులో ఈము పక్షి, కుందేళ్లు, నెమళ్లు, తాబేళ్లు, రామచిలుకలు, పావురాలు, టర్కీ కోడి, అమెరికా కోడి, మూడు రకాల జింకలు ఉన్నాయి. ఎండలకు అవి తట్టుకోలేకపోతున్నాయి. అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు వేడి నివారణ చర్యలు చేపడుతున్నారు. షెడ్డుపై తుంగ గడ్డితోపాటు పక్కలకు గన్నీ సంచులు వేలాడదీసి నీళ్లు పడుతున్నారు. జింకలు పొద్దంతా చిట్టడవిలోని చెట్ల కిందనే సేద తీరుతున్నాయి. వాటికి ఫీడింగ్ కూడా ఉదయం, సాయంత్రం ఇస్తున్నారు. షెడ్లలో ఉన్న వాటికి నీళ్లు, తాజా ఆహారం అందిస్తున్నారు.ఎండ వేడికి బోటింగ్



చేయడానికి ఎవరూ రావడం లేదు. సాయంత్రం 5 గంటలు అయినా ఎండ ఉండటంతో పిల్లల పార్కులో ఆడుకోవడానికి కూడా రావడంలేదు. సాయంత్రం 6 తర్వాత, ఉదయం 9 గంటలలోపు మాత్రమే కొంతమంది మాత్రమే వస్తున్నారని అధికారులు తెలిపారు.

**జాగ్రత్తలు తీసుకుంటున్నాం**

ఎండలు మండిపోతున్నాయి. వన్యప్రాణులకు తగు నీడ ఉండేలా చూస్తున్నాం. మధ్యాహ్నం వేళ షెడ్లపై నీటిని చల్లిస్తున్నాం. తాగునీటిలో ఎలక్ట్రాల్ పౌడర్‌తోపాటు దాణాలో ఖనిజ లవణ మిశ్రమాలను రోజు అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు వైద్యులతో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటున్నాం.ఆనంద్‌కుమార్, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి

# వేలల్లో ఒక్కరికే..!

నల్గొండ : కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుత బీసీ కులగణనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసి కొందరికే ఇవ్వడంతో మిగతావారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్‌కార్డుల కోసం, కుటుంబసభ్యుల పేర్లు చేర్పించడానికి, కార్డుల విభజనకు ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. సుమారు లక్ష వరకు వచ్చాయి. వీటిని పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీ కార్యదర్శులకు ఓ మొబైల్ యాప్‌ను అందజేశారు. రెండు నెలల క్రితం దరఖాస్తులను పరిశీలించిన కార్యదర్శులు వాటిని పైస్థాయి అధికారులకు పంపించారు. కానీ ఇప్పటివరకు అర్హులకు రేషన్‌కార్డులు జారీ కాలేదు. కుటుంబసభ్యుల పేర్లు నమోదు కాలేదు. దీంతో వారంతా తహసీల్దార్, పౌరసరఫరాల శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ దరఖాస్తుల స్థితి(స్టేటస్) తెలుసుకోవడానికి వీలు లేకుండాపోయింది.

**8,750 మందికే కొత్త కార్డులు** జిల్లాలో కొత్తగా 8750 మంది ఆహారభద్రతా కార్డులు మంజూరు చేశారు. ఇప్పటికే ఉన్న కార్డుల్లో పిల్లలను చేర్చేందుకు గతంలో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుని డీఎస్‌వో పెండింగ్ అని చూపించిన వాటిని సవరించారు. దీంతో కొత్తగా 61,247 (యూనిట్లు) మంది లబ్ధిదారులు పెరిగారు. కొత్తవారికి ఈనెల రేషన్ కోటా కింద 3674.82 క్వింటాళ్ల సన్న బియ్యం విడుదల చేశారు.

చురకలు



## ముక్కంటి.. చూడవేంటి?

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కైలాసగిరుల్లో ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. రాత్రిళ్లు గుట్టుగా మట్టిని తరలించి జేబులు నింపుకొంటున్న అక్రమార్కులు తాజాగా దేవుడి బాటను ఆనుకుని వీలైనంత మేరకు ఆలయ స్థలాలను కబ్జా చేసేందుకు యత్నించడంతో ఈ భూముల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ముక్కంటి ఆలయానికి ఆనుకుని ఐదు వేల ఎకరాలకు పైగా కైలాసగిరులు విస్తరించి ఉన్నాయి. పట్టణం విస్తరించే కొద్దీ ఇక్కడి భూముల పరిరక్షణకు తూట్లు పడుతున్నాయి. ఆక్రమణలకు గురికాకుండా గతంలో హరితాభివృద్ధి పథకం ద్వారా ఈ భూములను సర్వే చేయించి రికార్డులు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఇక్కడి కైలాసగిరుల్లో మట్టి తవ్వకాలతో పాటు భూముల కబ్జా సర్వసాధారణంగా మారుతోంది.



**కొరవడిన పర్యవేక్షణ**

కైలాసగిరి ప్రదక్షిణ రోడ్డు ఏర్పాటయ్యాక రోడ్డుకు ఇరువైపులా భూములకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం సాగు భూములున్న కొందరు రైతులు రాత్రికి రాత్రి ఆలయ భూములు కలుపుకొని చదును చేయడం, సాగుకు యోగ్యంగా మార్చేందుకు యత్నిస్తున్నారు. ఇక్కడి భూముల నిరంతర పరిశీలనకు ప్రత్యేకించి సిబ్బంది లేకపోవడం కబ్జాదారులకు వరంగా మారింది. ఎవరైనా ఫిర్యాదు రూపంలో ఇస్తే సిబ్బంది వెళ్లి ఆక్రమణలను నిలువరిస్తున్నారు.

ఇటీవల గుగ్గిళ్లవ్వ వద్ద భూములను ఆక్రమించిన వారిని నిలువరించి స్వాధీనం చేసుకున్నారు. తాజాగా వేడాం వద్ద ఆలయ భూముల్లో పంట సాగు చేశాక సిబ్బందికి సమాచారం అందింది. ఈ విషయమై సంబంధిత ఆక్రమణదారులు ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగడం గమనార్హం. సర్వే బృందాలను తీసుకెళ్లి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో అక్రమార్కులు రాకపోవడంతో సర్వే జరగలేదు. శుక్రవారం ఆక్రమణదారుల నేతృత్వంలో సర్వే చేసి ఆలయ భూములు స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శాశ్వత ప్రాతిపదికన ఇక్కడి భూములు సంరక్షించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంది.

## ముఖం చూపాల్సిందే..!

చిత్తూరు : స్వయం సహాయక సంఘాలు ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. ఈ సమావేశాలు నిర్వహించడంతో పాటు సభ్యులంతా హాజరయ్యారని నిర్ధారించుకునేందుకు సాంకేతికత జోడించింది.. కొన్ని సంఘాలు సమావేశాలు నిర్వహించక పోయినా రికార్డుల్లో చూపడం, సభ్యులు రాకున్నా హాజరైనట్లు నమోదు చేస్తున్నారు.. ఇకపై అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు రంగం సిద్ధమైంది.

**అన్నీ యాప్‌లో నిక్షిప్తం..:** గ్రామైక్య సంఘాల సమావేశాలు, స్వయం



సహాయక సంఘాల సమావేశాలు నిర్వహించే సమయంలో కచ్చితంగా జియో ఫేస్ రిజిస్ట్రేషన్ ఫెన్సింగ్ యాప్‌లో సమావేశాలు నిర్వహించే స్థల వివరాలు తొలుత నమోదు చేయాలి. వంద మీటర్ల లోపే సమావేశం నిర్వహించాలి. లేకుంటే యాప్ లొకేషన్‌ను తీసుకోదు. ఒక్కో సభ్యురాలి ఫొటో మూడు కోణాల్లో ముఖం, పూర్తి ఫొటో తీసి యాప్‌లో పొందు పరచాలి. సభ్యులు సమావేశానికి వస్తేనే హాజరు నమోదవుతుంది. ఆయా సమావేశాలకు సీసీ లేదా ఏపీఎంలు హాజరు కావాలి. ఈ ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే ప్రారంభించారు. ఈ యాప్ ఎప్పట్నుంచో ఉన్నా సభ్యుల వివరాల నమోదు జరుగుతుండటంతో పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. త్వరలోనే పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## చి'వరి'కి నీరందేలా!

నర్సీపట్నం : అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని ఆరు మండలాలకు చెందిన 77 గ్రామాల్లో 51,465 ఎకరాల ఆయకట్టు ఉన్న తాండవ జలాశయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వైకాపా సర్కారు ఐదేళ్ల పాలనలో మరమ్మతు పనులకు నిధులు విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే సభాపతి అయ్యన్నపాత్రుడు చొరవతో తొలుత 18 అత్యవసర పనులకు రూ. 2.10 కోట్లు విడుదలయ్యాయి. కుడి, ఎడమ కాలువలపై మూడు ఆక్విడక్టులను పునరుద్ధరించారు. నిమ్మకట్టులో పూడిక తొలగించి 50 మీటర్ల పొడవునా గట్టును బలోపేతం చేశారు. ఇప్పటికే 8 పనులు పూర్తికాగా మరో 10 పనులు వారం రోజుల్లో పూర్తికానున్నాయి.గత నెలలో 57 పనులకు రూ. 4.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆక్విడక్టులు, అండర్ టన్నెళ్ల మరమ్మతు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 20 నాటికి పనులన్నీ మొదలుకానున్నాయి. తాజాగా మరో 25 పనులకు రూ. 2.65 కోట్లు అవసరమని ప్రతిపాదనలు చేశారు. ఈ నిధులొస్తే స్పిల్‌వే గేట్ల నిర్వహణ, ప్రధాన గేట్ల మరమ్మతులు తదితర పనులకు ఖర్చు చేయనున్నారు. జలాశయం నుంచి ఖరీఫ్ వరికి ఆగస్టులో నీరిస్తుంటారు. ఆ లోగా పనులన్నీ పూర్తి చేయాలన్నదే లక్ష్యం. అనకాపల్లి జిల్లాలో నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, ప్రత్తిపాడు మండలాల్లో ఈ జలాశయం కింద ఆయకట్టు ఉంది. కాలువ చివరి భూముల వరకు ఈ ఏడాది నీరు ప్రవహించేలా చూడాలన్నది ప్రాజెక్టు కమిటీ లక్ష్యం.

**కమిటీ నిర్ణయం మేరకు నీళ్లు:** జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు. గత ఏడాది ఇదే సమయానికి 355.3 అడుగుల నీటిమట్టంతో వెయ్యి ఎంసీఎఫ్‌టీల నీరుంది. ప్రస్తుతం 366.3 అడుగుల నీటిమట్టంతో 2251.6 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉంది. ఈ నీరు రోజుకు 600 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తే 44 రోజుల వరకు సరిపోతుంది. వరినాట్లు వేసుకునే సమయంలో రైతులు నీళ్లు అడుగుతుంటారు. ప్రాజెక్టు కమిటీ నిర్ణయం మేరకు నీరు విడుదల జరుగుతుంది. – అనూరాధ, ప్రాజెక్టు డీఈఈ, నర్సీపట్నం

# వారంతే.. ప్రజాధనం కుమ్మరింతే!!



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజాధనం లెక్కలేకుండా ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు.. తీర్మానాల్లేకుండా, టెండర్లు లేకుండా కొన్ని పనులకు నిధులు కుమ్మరించారనే విమర్శలొస్తున్నాయి. వాటిలో ఈస్టరన్ ఘాట్స్ బయోడైవర్సిటీ సెంటర్ (తూర్పు కనుమల జీవ వైవిధ్యకేంద్రం) కూడా ఉంది. **అటవీశాఖకు జీవీఎంసీ నిధులా?:** జీవీఎంసీ ఎక్కడైనా నిధులు ఖర్చుచేయాలంటే ప్రతిపాదనలు, కౌన్సిల్ ఆమోదం, టెండర్లు వంటివి ఉంటాయి. అయితే...అటవీ శాఖ పర్యవేక్షణలో ఉండే తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రానికి ఏ అనుమతి లేకుండా ప్రజాధనం ఖర్చు చేయడం గమనార్హం. జీవీఎంసీ కమిషనర్‌గా సాయికాంత్‌వర్మ, డీఎఫ్‌వోగా అనంత్‌శంకర్ హయాంలో ఇవి జరిగాయి. ఈ కేంద్రంలో ఔషధ మొక్కల వనం, ప్రత్యేక వాతావరణంలో పెరిగే ఎడారి, కాక్టస్, ఆర్కిడ్స్ వంటి మొక్కలు, వన్యప్రాణులకు సంబంధించిన అవగాహన కేంద్రం ఉంటాయి. ప్రైవేటు కంపెనీల సీఎస్ఆర్ నిధుల సాయంతో ఈ కేంద్రం అభివృద్ధి చేశారు. ఈ కేంద్రానికి వెళ్లడానికి ప్రధాన గేటు గతంలో ఉంది. దీనికి వంద మీటర్ల దూరంలోనే కొత్తగా రెండో గేటు ఏర్పాటు చేసి, గతంలో ఉన్న గేటును పర్యాటకులు బయటకు వెళ్లేందుకు వీలుగా మార్చాలని ప్రణాళిక చేశారు. దీనికి జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు.

పనులు తుదిదశలో: ఆర్చి ప్రధాన ద్వారానికి రూ. 20లక్షలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి టైల్స్‌కు రూ. 13లక్షలు జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు. పనులు 90శాతం పూర్తయి తుది దశకు చేరుకున్న సమయంలో అటు డీఎఫ్‌వో, ఇటు జీవీఎంసీ కమిషనర్ ఇద్దరూ బదిలీపై వెళ్లిపోయారు. కొత్త డీఎఫ్‌వో వచ్చాక ఈ పనులపై ఆరా తీయగా, అనుమతులకు సంబంధించి ఎలాంటి పత్రాల్లేనట్లు తెలుస్తోంది.

**ఇలాగే...ఇంకా కొన్ని:** సాయికాంత్‌వర్మ జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న సమయంలో ముడసర్లోవలో రూ. 9కోట్లతో హార్స్ రైడింగ్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విషయమేమంటే కౌన్సిల్‌లో సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా దీనిని చేపట్టారు. దీంతో కూటమి నేతలు నిలదీశారు. అప్పటికే ఈ ప్రాజెక్టు విషయంలో రూ. 3–4 కోట్లు ఖర్చు చేశారు. అదేవిధంగా ఆర్కేబీచ్ సమీపంలో ఈత కొలను పనులు కౌన్సిల్ ఆమోదం, టెండర్లు లేకుండానే రూ. 3 కోట్లతో చేపట్టారు. వైకాపా హయాంలో విశాఖ రాజధాని పేరుతో నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు ప్రజాధనం వృథా చేశారనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై జీవీఎంసీ జోన్–2 ఈఈ శాంతిరాజ్‌ను వివరణ కోరగా, అక్కడ పనులు జీవీఎంసీ నిధులతోనే చేసినట్లు తెలిపారు. అనుమతుల గురించి అడగ్గా ఎలాంటి పత్రాల్లేవని సమాధానమిచ్చారు. ఈ అంశంపై డీఎఫ్‌వో మంగమ్మను వివరణ కోరగా... తమ శాఖ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని పేర్కొన్నారు.

# బిల్లులు రాక.. పనులు కదలక!



అనకాపల్లి : అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన పల్లెలను గుర్తించి వాటికి రవాణా సదుపాయం మెరుగుపరిచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పల్లెపండగ పేరుతో రహదారులు నిర్మిస్తోంది. అభివృద్ధి పనులపై ప్రజలు సంతృప్తిగా ఉన్నా బకాయిల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పనులు పూర్తి చేసిన గుత్తేదారులు సొమ్ముకోసం నిరీక్షిస్తున్నారు. ఈ ప్రభావం మిగిలిన పనులతోపాటు భవిష్యత్తులో చేపట్టే కొత్త పనులపైనా ప్రభావం పడనుంది.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో చిందరవందరగా తయారైన రోడ్లను సక్రమంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం పల్లెపండగకు శ్రీకారం చుట్టింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1831 పనులు మంజూరు చేసింది. ఇందుకోసం రూ. 183.16 కోట్లు నిధులు కేటాయించారు. దీంట్లో ఇప్పటివరకు 1288 పనులు పూర్తి చేశారు. వీటికి కేవలం రూ. 10.68 కోట్ల బిల్లును మాత్రమే గుత్తేదారులకు చెల్లించారు. ఇంకా రూ. 70.44 కోట్ల బకాయిలున్నాయి. ప్రతి వారం బిల్లులు చెల్లిస్తామని అధికారులు మొదట్లో చెప్పడంతో.. గుత్తేదారులు చకచకా పనులు చేపట్టారు. పనుల ప్రారంభంలో బిల్లులు బాగానే జరిగినా.. జనవరి మొదట నుంచి నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

జిల్లాకు మంజూరైన 1831 పనుల్లో ఇంకా.. 543 పనులు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. పాత బకాయిలు పేరుకుపోవడంతో.. గుత్తేదారుకు మిగిలిన పనులు పూర్తిచేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ పనులకు కేంద్రం 75 శాతం నిధులు మంజూరు చేస్తే.. రాష్ట్రం మిగిలిన 25 శాతం కలిపి బిల్లులు చెల్లిస్తారు. వైకాపా హయాంలో చేపట్టిన సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలు, ఇతర నిర్మాణాలకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ప్రస్తుతం పల్లెపండగ నిధులు నుంచే వాటికి సైతం బిల్లులు చెల్లించాల్సిఉంది. ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులే ఇంకా పెండింగ్‌లో ఉండగా.. పాత బిల్లులు చెల్లించడం మరింత భారంగా మారనుంది.

గుత్తేదారులకు త్వరలో చెల్లిస్తాం: మెటీరియల్ నిధుల విడుదలలో జాప్యంతో చెల్లింపులు నిలిచాయి. పనులు పూర్తయిన వివరాలు పైస్థాయికి పంపించాం. త్వరలో నిధులు విడుదలయ్యే వీలుంది. నిధులు రాగానే.. బకాయిలు చెల్లిస్తాం. గుత్తేదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– పూర్ణిమాదేవి, డ్వామా పీడీ, అనకాపల్లి

# ఊపిరి తీసిన విషవాయువులు

విశాఖపట్నం : అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో జరిగిన ఓ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించి కర్మాగారాల శాఖ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎస్ఎస్(సాయి శ్రేయాస్) ఫార్మా కంపెనీ రెండో అంతస్థు టెర్రస్‌పై ఈటీపీ (ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)కు చెందిన నాలుగు ట్యాంకులు ఉన్నాయి. ఔషధ ఉత్పత్తుల తయారీలో భాగంగా ఏర్పడిన రసాయన వ్యర్థ జలాలు పైపులైన్ ద్వారా ఆ ట్యాంకులకు చేరుతాయి. కంపెనీ సేఫ్టీ అసిస్టెంట్ మేనేజర్ పరిమి చంద్రశేఖర్(32), షిఫ్టు సేఫ్టీ ఆఫీసర్ శరగడం కుమార్ (25), కాంట్రాక్టు కార్మికుడు బైడా బన్సాలీ (37) 10 గంటలకు సి షిఫ్టు విధులకు హాజరయ్యారు. అర్ధరాత్రి దాటాక 1.20 గంటల సమయంలో వీరు వ్యర్థ జలం ఏమేరకు ఉందో పరిశీలించేందుకు ఆ ట్యాంకుల వద్దకు వెళ్లారు. వాటి మూతలు తెరిచినపుడు వెలువడిన ప్రమాదకర హైడ్రోజన్ సల్ఫైడ్ విష వాయువు పీల్చి అపస్మారక స్థితికి చేరుకున్నారు. అప్పుడు టీ విరామ సమయం కావడం, వెళ్లిన ముగ్గురూ ఇంకా తిరిగి రాకపోవడంతో తోటి సిబ్బంది అక్కడకు వెళ్లి చూడగా కింద పడి ఉన్నారు. వారిని హుటాహుటిన షీలానగర్ కిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చంద్రశేఖర్, కుమార్ మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. దాంతో వారి మృతదేహాలను కేజీహెచ్ మార్చురీకి తరలించారు. హెల్పర్ పరిస్థితి విషమంగా ఉంది. ఆర్డీవో అయిషా, డీఎస్పీ విష్ణుస్వరూప్, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.పరమేశ్వరరావు, కాలుష్య నియంత్రణ విభాగం (పీసీబీ) ఈఈ ముకుందరావు, కార్మికశాఖ అధికారులు నరేంద్ర, వసంతరావు, పరిశ్రమలశాఖ జీఎం నాగరాజారావు, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ వీరభద్రరావు, రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలించి కారణాలు తెలుసుకున్నారు. సంబంధిత ట్యాంకుల్లో వ్యర్థజలాలు ఏమేరకు ఉందో తెలియజేసే ఇండికేటర్లు లేకపోవడం వల్లే వీరు వాటి మూతలు తెరిచి ప్రమాదానికి గురైనట్లు



ఓ అధికారి పేర్కొన్నారు. హైదరాబాద్ సురారం ప్రాంతానికి చెందిన మృతుడు చంద్రశేఖర్ గతేడాది మార్చిలో పరవాడ ఎస్ఎస్ ఫార్మా సంస్థలో చేరారు. స్వగ్రామం తాడేపల్లిగూడెం. బీఎస్సీ, డిప్లమో సేఫ్టీ కోర్సు చేసిన ఈయన గతంలో హైదరాబాద్‌లోని ఓ ఫార్మా సంస్థలో పని చేశారు. ఈయనకు 2021లో శ్రీకాకుళం జిల్లా పలాస సమీప చౌడుపల్లికి చెందిన అనూషతో వివాహం జరిగింది. ప్రస్తుతం భార్య, రెండేళ్ల కుమార్తెతో కలిసి అగనంపూడిలో నివాసం ఉంటున్నారు. ఇంటి నుంచి కంపెనీ విధులకు వెళ్లిన భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఇక తమకు దిక్కెవరంటూ భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు.అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన మృతుడు కుమార్ డిగ్రీ చదివి, సేఫ్టీ కోర్సు పూర్తి చేశారు. 8నెలల క్రితమే ఈ కంపెనీలో చేరారు. గతంలో అచ్యుతాపురంలోని ఓ కంపెనీలో పని చేశారు. ఈయనకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్య మాధురి, తమ్ముడు వంశీ ఉన్నారు. ఈయన తండ్రి మూడేళ్ల క్రితం, తల్లి 5నెలల క్రితం మృతి చెందారు. సొంత పని మీద బుధవారం కంపెనీ విధులకు సెలవు పెట్టగా, సంబంధిత అధికారులు కుదరదని చెప్పడంతో విధులకు వెళ్లి ఇలా మృత్యువు బారిన పడ్డారని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

## కలల గోకులం.. నెలలుగా వ్యాకులం

మద్దిపాడు : గోకులం పథకంలో షెడ్లు నిర్మించుకున్న పశు పోషకులు త్రిశంకు స్వర్గంలో విలవిల్లాడుతున్నారు. నిర్మాణాలు పూర్తిచేసి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు మంజూరు కాలేదు. పథకం ప్రారంభ సమయంలో రైతుల వెంటపడిన అధికారులు ఇప్పుడేమో ముఖం చాటేస్తున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా గోకులం షెడ్ల నిర్మాణానికి సుమారు నాలుగు వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. ప్రతి మండలం నుంచి దాదాపు 40 మంది రైతులకుషెడ్ల నిర్మాణ అనుమతులిచ్చారు. ఇలా జిల్లాలో 1075 వరకూ నిర్మించాలన్నది అధికారుల లక్ష్యం కాగా, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో 1242 షెడ్లకు అనుమతులు మంజూరు చేశారు. వాటిలో 1,116 నిర్మాణాలు ప్రారంభించి 821 పూర్తి చేశారు. పైకప్పు, పునాది దశల్లో 295 వరకూ ఉన్నాయి. వీటికి సంబంధించి సుమారు రూ. 13 కోట్ల నుంచి రూ. 15 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. కేంద్రం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఒక్క పశు పోషకుడికి కూడా నగదు చెల్లించలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో తాము కాళ్లరిగేలా ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా



ప్రయోజనం ఉండటంలేదని వారు వాపోతున్నారు.

**పశువుల సంఖ్యకు అనుగుణంగా..**

గోకులం పథకంలో భాగంగా రైతులు షెడ్లు నిర్మించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. పశువుల సంఖ్యకు అనుగుణంగా లబ్ధిదారులకు నిధులు మంజూరు చేస్తారు. అందులో 10 శాతం రైతు వాటాగా చెల్లించాలి. పశు సంవర్ధక శాఖ, ఉపాధి హామీ అధికారులు సంయుక్తంగా ఎంపిక చేశారు. భారీగా రాయితీ వస్తుందని చెప్పడంతో చాలామంది అప్పులు చేసి మరీ నిర్మించుకున్నారు. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి బిల్లుల కోసం వారు ఎదురుచూస్తున్నారు.

**అన్నిచోట్లా అదే దుస్థితి**జిల్లావ్యాప్తంగా గోకులం నిర్మాణాలు చేసిన వారందరి పరిస్థితి దయనీ యంగా మారింది. ఒంగోలు పరిధిలో 55 షెడ్లను పూర్తి చేయగా, లబ్ధిదారులకు రూ. 98.75 లక్షల మేర చెల్లించాల్సి ఉంది. సంతనూ తలపాడు నియోజకవర్గ పరిధిలో 140 వరకూ నిర్మించగా, రూ. 2.53 కోట్ల మేర బిల్లులు ఇవ్వాల్సి ఉంది. దీనిపై డ్వామా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ గోకులాలకు సంబంధించిన బిల్లులు త్వరలో విడుదల చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పది నుంచి పదిహేను రోజుల్లో అవి విడుదలయ్యే అవకాశముందన్నారు.

## రాచ'బాట'లు పడుతున్నాయ్..

పామూరు : ఉమ్మడి జిల్లాలోని సి.ఎస్.పురం, కనిగిరి, మర్రిపూడి, చీమకుర్తి, తాళ్లూరు, అద్దంకి, పొదిలి, జె.పంగులూరు ప్రాంతాలు కొత్తకళను సంతరించుకోనున్నాయి. బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే 544జీ ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. అనంతపురం జిల్లా కొడికొండ నుంచి ప్రకాశం జిల్లా మీదుగా బాపట్ల జిల్లాలోని ముప్పవరం జాతీయ రహదారి 16లో కలుస్తుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే మార్గం జిల్లాలో 129 కిలోమీటర్ల పరిధిలో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే జాతీయ రహదారి గట్టు (ఎంబ్యాంక్‌మెంట్) పనులు చాలాచోట్ల పూర్తికాగా, పలుచోట్ల వేగంగా సాగుతున్నాయి. అండర్‌పాస్‌లు, వంతెనల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయవాడ నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం తగ్గించడంతో పాటు, పారిశ్రామికవాడలు, మెట్రో సిటీలను కలపడమే లక్ష్యంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. మొత్తంగా 13 చోట్ల మాత్రమే రోడ్డులోకి ప్రవేశించేలా ప్రణాళిక రూపొందించి ఆయాచోట్ల పనులు చేస్తున్నారు. 2026 జూన్ నెల చివరి నాటికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ పూర్తిచేయాలన్నది లక్ష్యం.

జిల్లా రహదారుల చిత్రం మారుతోంది. జగన్ ప్రభుత్వ హయాంలో కొత్తవి నిర్మించక.. ఉన్న వాటికి మరమ్మతులు చేయక..వదిలేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారులను మెరుగుపర్చింది. అదే సమయంలో బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, మైదుకూరు – సింగరాయకొండ జాతీయ రహదారుల నిర్మాణం చురుగ్గా సాగుతోంది.

**పూర్తికావొస్తున్న 167బీ రహదారి**

కడప జిల్లా మైదుకూరు నుంచి జిల్లాలోని సింగరాయకొండ వరకు రెండు వరుసల జాతీయ రహదారి 167బి నిర్మాణ పనులు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చాలా వరకు పూర్తయ్యింది. మైదుకూరు రహదారి పూర్తికావడంతో పశ్చిమ ప్రాంతవాసులకు ఎంతో మేలు చేకూరుతోంది. అదేవిధంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కూడా పూర్తయితే జిల్లాలో రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది.

## అన్నదాత సుఖీభవ!

తాళ్లూరు: నిత్యం సమస్యలతో పోరాడే రైతులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. సాధారణ ఎన్నికలకు ముందు తెదేపా రథసారథి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతులకు తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. గతేడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తదుపరి వీరికి సాయం అందించేందుకు ప్రయత్నాలు ఆరంభించారు.

**కేంద్ర, రాష్ట్రాల సమన్వయ సాయం**

కేంద్రం ద్వారా మూడు విడతల్లో రూ. 6 వేలు ఆర్థిక సాయం అందించనుండగా, రాష్ట్రం తరపున మరో రూ. 14 వేలు కలిపి మొత్తం రూ. 20 వేలు పెట్టుబడి నిధిగా 'అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్' పేరిట అందించనున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవ్వడం, ఇదే సమయంలో ఖరీఫ్ ఆరంభమవుతుండడంతో ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది.అన్నదాత.. సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు ఏటా రూ. 20 వేలు మూడు విడతల్లో అందిస్తారు. తొలి విడతగా ఈ నెల 20న రూ. 7 వేలు వంతున సాయం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం తెలిపారు. అర్హులైనవారి వివరాలను ప్రభుత్వానికి పంపించినట్లు డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాకు తొలి విడత కింద రూ. 176.099 కోట్ల మేర సాయం అందనుంది. ఆయా రైతుల నుంచి త్వరితగతిన బయోమెట్రిక్ తీసుకోవాలని మండల అధికారులు, వీఏఏలను డీఏవో ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే సాయం అందిస్తామని తెలిపారు.

# నిధుల కొరత.. సాగు నీరు వృథా



అనంతపురం: ఉమ్మడి జిల్లా సాగు నీటి ప్రాజెక్టుల నిర్వహణ కరవైంది. ఫలితంగా కీలకమైన మిడ్‌పెన్నార్, పేరూరు, యోగివేమన రిజర్వాయర్లలో నీటి వృథా అధికంగా ఉంటోంది. గత వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లపాటు నిర్వహణకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. కనీసం గేట్లకు గ్రీజు పెట్టలేని దుస్థితి. దీంతో ప్రధాన ప్రాజెక్టుల్లో గేట్లు దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పలు డ్యాంల్లో తాత్కాలిక పనులు చేశారు. పేరూరు డ్యాంలో మాత్రం గేట్ల పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో యుద్ధప్రతిపాదికన మరమ్మతు చేపడితే తప్ప సాగు నీరు వృథా అరికట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.

**ఎట్టకేలకు పేరూరులో మరమ్మతులు**

పేరూరు ప్రాజెక్టును 2022లో వరదలు ముంచెత్తాయి గేట్లు ఎత్తి నీటిని వదిలారు. వరద తగ్గాక గేట్లు కిందకు దింపే క్రమంలో మూడో గేటు మొరాయించింది. ఈ క్రమంలోనే గేటు క్రస్టు విరిగిపోవడంతో దింపలేకపోయారు. ఫలితంగా ఆ ఏడాది నీరు వృథాగా నదిలోకి వెళ్లిపోయింది. మరమ్మతులకు రూ.1.20 కోట్లకు ప్రతిపాదనలు పంపగా అప్పటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి సర్కారు రాగానే నిధులు విడుదల చేయడంతో ఆరు గేట్ల మరమ్మతులు పూర్తి చేశారు. 6, 8 గేట్లు మరమ్మతులు మిగిలి ఉన్నాయి. జులై 15 నాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి లీకేజీ అరికడతామని అధికారులు చెబుతున్నారు.

**మొరాయిస్తున్న గేట్లు**

తుపాను కారణంగా 2021, నవంబరులో యోగివేమన ప్రాజెక్టులో భారీగా వరద చేరింది. నీరు విడుదల చేసేందుకు ప్రయత్నించగా 5, 6, 7, 8 గేట్లు మొరాయించాయి. మిగిలినవి ఎత్తి నీటిని వదిలేశారు. గేట్ల పైనుంచి నీరు ప్రవహించింది. తర్వాత అధికారులు ఎంతో కష్టపడి అన్ని గేట్లు ఎత్తారు. అప్పటి నుంచి గేట్లు మరమ్మతుకు నోచుకోలేదు. గత వైకాపా ప్రభుత్వం నిర్వహణకు రూపాయి ఇవ్వలేదు. రూ.4 కోట్లకు ప్రతిపాదనలు పంపగా ఆమోదం పొందలేదు. ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

**దక్షిణ కాలువ దుస్థితి పట్టదా?**

మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ దక్షిణ కాలువకు సంబంధించి మూడు షట్టర్లు ఉండగా.. రెండింటిలో రబ్బర్లు నాలుగేళ్ల కిందటే దెబ్బతిన్నాయి. మరమ్మతుల కోసం 2022లోనే అధికారులు అప్పటి ప్రభుత్వానికి రూ.3.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక మరమ్మతుకు రూ.20 లక్షలు అవసరమని తెలిపినా ఇవ్వలేదు. దీంతో డ్యాంలో డెడ్ స్టోరేజీ కంటే దిగువకు నీరు చేరింది. గతేడాది అధికారులే చిన్నపాటి మరమ్మతులు చేయించి లీకేజీలు అరికట్టారు. మూడో షట్టర్ రబ్బరు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. గేట్లు తరచూ మొరాయిస్తున్నాయి. ప్రాజెక్టు నిండితే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని.. మరమ్మతుల కోసం రూ.5 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ సురేంద్రరెడ్డి తెలిపారు. ఈ డ్యాం కింద ఆయకట్టు లక్ష ఎకరాలు ఉంది.

# క్రీడాకారుల ఆశలపై నీళ్లు

గుంతకల్లు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకులు క్రీడాకారుల భవిష్యత్తుపై నీళ్లు చల్లారు. అప్పటికి ముందున్న తెదేపా ప్రభుత్వ హయాంలో సజావుగా సాగిన ఇండోర్ స్టేడియం పనులు వైకాపా ప్రభుత్వం రాగానే ఆగిపోయాయి. ప్రైవేట్ క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులు అధిక ఫీజులు చెల్లించలేని పరిస్థితి కొనసాగుతోంది. నాటి పాలకులు క్రీడాకారుల ఉన్నతికి ఏమాత్రం కృషి చేయలేదు.

**రూ.2 కోట్లు కేటాయించినా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. భాగ్యనగర్‌లోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పనులు చేపట్టారు. ఆయా పనులను గుత్తేదారుకు 2018 సంవత్సరం జనవరి 29న అప్పగించారు. త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు నిబంధన పెట్టారు. గుత్తేదారు గోడలు నిర్మించి పైకప్పు ఏర్పాటు చేసే సమయంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి పాలకులు పనులు ఆపేయాలని ఆదేశించారు. దీనికి తోడు అప్పటి వరకు చేసిన పనులకూ బిల్లులు చెల్లించలేదు. ఆరేళ్లుగా పనులు ఆగిపోయాయి.

ఇండోర్ స్టేడియం కట్టాలనుకున్న ప్రాంతంలో ముళ్లకంపలు, చెట్లు



ఏపుగా పెరిగిపోయాయి. స్టేడియం గోడలన్నీ దెబ్బతిని, ఇతరత్రా సామగ్రి తుప్పు పట్టి అధ్వానంగా మారాయి.

ఎస్‌ఎస్‌ట్యాంకు వద్ద మున్సిపాలిటీకి సంబంధించిన స్థలం ఉంది. దాన్ని ఓపెన్ స్టేడియం ఏర్పాటుకు కేటాయించాలని క్రీడాకారులు కోరుతున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ తదితర ఆటలు ఆడేందుకు స్టేడియం నిర్మించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని గుత్తేదారుడు పనులు ఆపేశాడు. కూటమి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం పనులకు సంబంధించిన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యే విధంగా చూస్తాం. నవీన్, సహాయ కార్యనిర్వాహక ఇంజినీరు, గృహనిర్మాణ సంస్థ

# గుహలకు గుర్తింపు

నంద్యాల : ప్రపంచంలో రెండోది.. దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలూం గుహలకు గుర్తింపు వచ్చింది. కొలిమిగుండ్ల మండలంలో కొలువుదీరిన వీటిని భౌగోళిక వారసత్వ ప్రదేశంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. సుమారు 23 ఎకరాల భూమి లోపల ఏర్పడిన వీటిని క్రీ.పూ.450 ఏళ్ల కిందట నివాస స్థలాలుగా వినియోగించినట్లు చరిత్ర చెబుతోంది. హెచ్‌బీ ఫూట్ అనే ఆంగ్లేయుడు 1884లో వీటిని కనుగొన్నారు.. తర్వాత 1982-84లో హెచ్‌డీ గేబర్ అనే జర్మనీ దేశస్థుడు తన సహచరులతో కలిసి 3,225 మీటర్ల వరకు శోధించి పటాన్ని తయారు చేశారు. 1988లో ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ రక్షిత స్థలంగా ప్రకటించింది. 1999లో పర్యాటక శాఖ తమ ఆధీనంలోకి తీసుకొని అభివృద్ధి చేస్తోంది.

**ఎన్నెన్నో వింతలు**

బెలూం గుహలో 40 మెట్లు దిగిన తర్వాత 10 మీటర్ల లోతులో మొదలై 30 మీటర్ల లోతు వరకు సొరంగాలు ఉన్నాయి. ఇక్కడ కొన్నిచోట్ల ఇరుకుగా, మరికొన్ని చోట్ల విశాలంగా గదుల మాదిరిగా ఉంటుంది. కొన్నిచోట్ల స్టాలక్‌టైట్లు, స్టాలగ్మైట్లు అని పిలిచే స్ఫటికాకృతులు ఏర్పడి ఉన్నాయి. కృత్రిమ శిలల ఆకృతులను బట్టి కొన్ని ప్రదేశాలకు 1,000 పడగలు, కోటి లింగాలు, ఐరావతం, ఊడలమర్రి, మాయామందిరం వంటి పేర్లు పెట్టారు. గాన ధ్యాన మందిరం, మండపం ఉన్నాయి.

గుహల చివరి వరకు వెళ్తే పాతాళగంగ అనే నీటి మడుగుతోపాటు అక్కడే రాతిలో ఉన్న శివలింగం కన్పిస్తాయి.

**చల్లని ప్రాంతం** గుహల లోపల ఏడాది పొడవునా 33 డిగ్రీల స్థిరమైన ఉష్ణోగ్రత ఉండటమే కాకుండా గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉ



ంటుంది. ఈ గుహలోని నీటికి సమీప గ్రామంలోని శివాలయం పక్కనున్న రాతి బావిలోని నీటి మట్టానికి సంబంధం ఉంది. 30 కి.మీ. దూరంలో తాడిపత్రి వద్దనున్న పెన్నా నది నీటిమట్టం కూడా దీనిపై ప్రభావం చూపుతోంది.

1999లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ తమ ఆధీనంలోకి తీసుకుని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది.

గుహలోని సొరంగ మార్గంలో ఒకటిన్నర కి.మీ. పొడవునా మట్టిదిబ్బలను తొలగించి నాపరాళ్లను పరిచి నడక దారిని ఏర్పాటు చేశారు. 150 విద్యుద్దీపాలతో కాంతులీనేలా మార్చారు. గుహ లోపలకు గాలిని పంపే బ్లోయర్లు ఏర్పాటు చేశారు.

ఏడాది పొడవునా వందలాది మంది విదేశీయులతోపాటు రెండు లక్షల మంది వరకు పర్యాటకులు వస్తున్నారు. పర్యాటక శాఖకు ఏటా రూ.1.50 కోట్ల వరకు ఆదాయం వస్తోంది.

**అభివృద్ధికి దోహదం**

భౌగోళిక వారసత్వ ప్రదేశంగా బెలూం గుహల్ని గుర్తించిన క్రమంలో వెయ్యి మందితో గుహల ప్రాంగణంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. తద్వారా గుహలకు మరింత ప్రచారం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు.

# సర్కారు బడులకు సన్నబియ్యం



అనంతపురం : కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలవుతున్న ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరాకు చర్యలు తీసుకుంది. ఈ ఏడాది నుంచే ప్రభుత్వ బడులకు నేరుగా సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే పౌరసరఫరాల గోదాములకు బియ్యం ప్యాకెట్లు (25 కిలోలు) తరలించి సిద్ధం చేశారు. తక్షణమే అన్ని విద్యాలయాలకు బియ్యం చేరేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**పాత నిల్వలే..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు గోదాముల్లో నిల్వ చేసిన బియ్యం కార్డుదారులతోపాటు విద్యాలయాలకు సరఫరా చేసేవారు. వాటితో వండిన అన్నం విద్యార్థులు తినలేక పారేసేవారు. విద్యార్థులు చాలామంది ఇళ్లకు వెళ్లి తినేవారు. మధ్యాహ్న భోజనం పథకం పెద్ద ప్రయోజనం లేకపోయింది. గోదాముల నుంచి డీలర్లకు ఇచ్చేవారు. డీలర్ల నుంచి ఉపాధ్యాయులు పాఠశాలలకు తీసుకొచ్చేవారు. మధ్యలో డీలర్లు, గోదాము నిర్వాహకులే తూకాలు తక్కువ ఇచ్చేవారు. రవాణా ఖర్చులు కూడా భరించలేకపోయేవారు. ఈ లోపాలన్నీ గుర్తించిన ప్రభుత్వం బడులకు సన్నబియాన్ని నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈమేరకు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. క్యూఆర్ కోడ్, ట్యాగు వేసి 25 కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం సంచులు సరఫరా చేయనున్నారు. తద్వారా ప్రధానోపాధ్యాయులకు కష్టాలు తీరనున్నాయి.

**నెలకు 1,010 టన్నుల బియ్యం సరఫరా**

పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి నాణ్యమైన సన్నబియాన్ని 25 కిలోలు సంచి ప్యాకింగ్ చేసి సరఫరా చేయనున్నారు. జిల్లాలో 1,715 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలున్నాయి. 183 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఈ నెలకు సరిపడా మొత్తం 25,259 ప్యాకెట్లు (1,010.36 టన్నులు అవసరమని లెక్కగట్టారు. అందులో ప్రభుత్వ పాఠశాలలకు 15,226 ప్యాకెట్లు (25 కిలోలు), వసతి గృహాలకు 10,033 ప్యాకెట్లు చొప్పున కేటాయించారు. వచ్చే నెల నుంచి కాస్తా మరింత బియ్యం కోటా పెరిగే అవకాశం ఉందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డి, సహాయ మేనేజర్ జెన్నేప్రసాద్ తెలిపారు.

**సమగ్ర వివరాలు తెలుసుకునేలా..**

ప్రభుత్వ బడులకు సరఫరా చేసే సన్నబియ్యం ప్యాకెట్లు సంచులపై ఎక్కడా నాయకుల ఫొటోలు ముద్రించలేదు. సంచికి ఒకవైపున ప్రభుత్వ లోగో ముద్రించారు. విద్యార్థులు చిత్రాలు, జాతీయ పతాకం ఉన్న బడిని ముద్రించారు. మరోవైపు రైతు ఫొటోతోపాటు బియ్యంలో పోషక విలువలు, 1967 టోల్‌ఫ్రీ నంబరు, ఫోర్టిఫైడ్ బియ్యం బయట అమ్మితే శిక్షించడం జరుగుతుందని ముద్రించారు. 25 కిలో బస్తాను క్యూఆర్ కోడ్ జతచేశారు. ఈ కోడ్ స్కాన్ చేస్తే ధాన్యం పండించిన రైతుల వివరాలు, నాణ్యత పరిశీలించిన సిబ్బంది వివరాలు తెలిసేలా బియ్యం సంచులు ముద్రించారు.

# అనువుగాని స్థలాలు.. అటకెక్కిన పట్టాలు



పుట్టపర్తి: పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ ఎన్నికల ముందు హడావుడి చేసిన వైకాపా నాయకులు... జగన్ పుట్టినరోజు సందర్భంగా ఇచ్చిన సుమారు 2 వేల ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందకుండా అటకెక్కాయి. అందరికీ ఇల్లు అంటూ అప్పటి యంత్రాంగం అనువుగానిచోట స్థలాలు చూపి చేతులు దులుపుకొంది. 2023, డిసెంబరు 21న పట్టాలు పంపిణీ చేపట్టారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలో ఐదు ప్రాంతాలను ఎంపిక చేసి.. అప్పటి వాలంటీర్లతో కొలతలు వేయించి.. హద్దురాళ్లు నాటించారు. అధికారులు, వైకాపా నాయకులు లబ్ధిదారుల ఎంపిక, భూసేకరణలో పారదర్శకతకు పాతరేశారన్న విమర్శలున్నాయి. ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూశాఖ సమాచారం ఇవ్వడం పరిపాటి. వచ్చిన దరఖాస్తులను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేస్తారు. తరువాత అవసరమైన భూమి సేకరించి.. పట్టాలు పంపిణీ చేస్తారు. ఈ విధానంగా పాటించకుండా అప్పటి అధికార పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వ్యక్తులనే లబ్ధిదారులుగా ఎంపిక చేసి స్థలాలు కట్టబెట్టారు.

**వివాదాల్లో..:** కుటాగుళ్ల రెవెన్యూ గ్రామంలోని సర్వేనంబరు 41 గుట్టలో దాదాపు 300 మందికి, మూర్తిపల్లిలో సర్వే నంబరు 21లోని యూఏడబ్ల్యూ భూమిలో 400 మందికి పట్టాలు సిద్ధం చేశారు. మరో మూడుచోట్ల వివాదాల్లో ఉన్న స్థలాలు ఇచ్చారు. ఇలాంటిచోట నివేశ స్థలాలు ఇవ్వకూడదన్న రెవెన్యూ నిబంధనను పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులు నాటి ముఖ్యమంత్రి మెప్పు కోసం అలా చేశారు. **ఎన్నికల నియమావళి సాకుగా..**

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందంటూ 2024లో లబ్ధిదారుల నుంచి పట్టాలు వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతం పట్టాలన్నీ రెవెన్యూ కార్యాలయాల్లోనే మగ్గుతున్నాయి. సొంత ఇంటి కలనెరవేరుతుందన్న ఆశలు అడియాసలయ్యాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం.. స్థలాలు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

మురళీకృష్ణ, తహసీల్దారు, కదిరి పట్టాలను లబ్ధిదారుల నుంచి ఎందుకు వెనక్కి తీసుకున్నారో పూర్తి సమాచారం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

# పేదల భూముల్లో 'భూ'తాలు

కర్నూలు : పేదల భూములు కొట్టేసిన వైకాపా 'భూ'తాలపై చర్యలు కానరావడం లేదు. 'కూటమి' ప్రభుత్వం వచ్చి ఏడాదైనా రెవెన్యూ శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై నిజమైన యాజమాన్య హక్కులు కలిగిన రైతులు నష్టపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2023లో ఎసైన్డ్ భూముల చట్టానికి సవరణలు జరిగాయి. పేదలకు ఎసైన్డు చేసిన భూముల కాలపరిమితి 20 ఏళు దాటి ఉంటే వాటిని నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించి శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించేలా చట్ట సవరణ చేశారు. ఈ జీవోను ప్రామాణికంగా తీసుకొని ఎసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేయాలి. ఆ తర్వాత ఆ భూములను రైతుల పేరున మార్చాలి. ఈ చట్ట సవరణను అడ్డుపెట్టుకొని జగన్ సర్కారులోని పెద్దలు భూదందాకు పాల్పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా ఫ్రీహోల్డ్ చేశారు. కూటమి ప్రభుత్వం పది నెలల కిందట ఆ భూములపై పరిశీలన చేపట్టింది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పేదల భూములను కొట్టేసిందెవరు.. సహకరించిన అధికారులెవరో తేలిపోయింది.

**రెవెన్యూ శాఖ అలసత్వం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం ఫ్రీహోల్డ్ భూముల్లో సుమారు 40 వేల ఎకరాలకు నిబంధనలను విరుద్ధంగా యాజమాన్య హక్కులు కల్పించారు. ఫ్రీ హోల్డ్ తర్వాత బినామీ, అక్రమ లావాదేవీలతో ముడిపడిన భూముల రిజిస్ట్రేషన్లు ఆపేయాలి. ఈ విషయంలో రెవెన్యూ శాఖ తీవ్ర తాత్సారం చేస్తోంది. మరోవైపు అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలకు ఉపక్రమించిన దాఖలాలు లేవు. ఇంతవరకు రెవెన్యూ శాఖ నుంచి ఏ ఒక్క చిన్న ప్రయత్నం చేయకపోగా.. మొత్తం ఎసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించారు. ఫలితంగా చట్టబద్ధంగా నిజమైన హక్కుదారుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎవరు తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకోకుండా అందరికీ నిషేధం వర్తింపజేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఆధారాల్లేకుండానే ఆన్‌లైన్**

ఎసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా కర్నూలు జిల్లాలో 2,033 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 14,212 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసి యాజమాన్య హక్కులు కల్పించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా 21,853.22 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు.

ఉమ్మడి జిల్లాలో సుమారు 63 వేల ఎకరాలను నిబంధనలకు లోబడి ఫ్రీహోల్డ్ చేశారని రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ భూముల్లో అత్యధిక శాతం ఎకరా, రెండు ఎకరాలున్న రైతులే ఉన్నారు. వారందరికీ చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసే హక్కులున్నాయి. అక్రమార్కులున్నారనే పేరిట అందరికీ నిషేధం వర్తింపజేసి పది నెలలైంది. నిషేధం కారణంగా అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.

**తాఖీదులతో సరిపెట్టారు**


ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4 వేల ఎకరాలకుపైగా రిజిస్ట్రేషన్లు జరగ్గా.. అందులో 3 వేల ఎకరాలు నిబంధనల మేరకు.. సుమారు వెయ్యి ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయి. ఫ్రీహోల్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు జారీ చేసిన జీవోను తుంగలో తొక్కి వైకాపా పెద్దలు సమారు 40 వేల ఎకరాలకు నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్య హక్కులు కల్పించుకున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 29 మండలాల తహసీల్దార్లు వైకాపా పెద్దలకు సహకరించినట్లు కూటమి ప్రభుత్వ పరిశీలనలో వెల్లడైంది. ఆ 29 మంది తహసీల్దార్లకు మూడు నెలల కిందట తాఖీదులతో సరిపెట్టారు.

# కే'ఛీ' దారి విస్తరణ

నందికొట్కూరు : కర్నూలు–గుంటూరు(కేజీ) రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. చేసిన పనుల్లో నాణ్యత తేలిపోయింది. కర్నూలు నుంచి గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు మీదుగా ఆత్మకూరు.. దోర్నాల సెక్షన్ వరకు 66.115 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల 340సి జాతీయ రహదారి పనులు చేపట్టారు. 2023 నుంచి 2025 అక్టోబరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఫేస్–1 కింద రూ.587 కోట్లు, ఫేస్–2 కింద రూ.591 కోట్లు కలిపి రెండు ప్యాకేజీల్లో మొత్తం రూ.1,179 కోట్ల విలువైన పనులను గుత్తేదారులకు అప్పగించారు. రెండో ప్యాకేజీలో భాగంగా తర్తూరు అంచె నుంచి ఆత్మకూరు వరకు చేస్తున్న సుమారు 36 కి.మీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

**కొన్నాళ్లకే కుంగింది**

మొదటి ప్యాకేజీ కింద ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా సమీపం నుంచి జూపాడుబంగ్లా మండలం తర్తూరు అంచె వరకు చేపట్టిన పూర్తయ్యాయి. కొన్నాళ్లకే పలుచోట్ల రోడ్డు కుంగింది. కోతకు గురైంది. ఇరువైపులా వర్షంనీళ్లు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలు



చెదిరిపోయి ఛిద్రమయ్యాయి. ఇటీవల ఈ పనులను పరిశీలించిన ర.భ.శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహ వ్యక్తం చేశారు.

**గడువు గడబిడ**

పనులన్నీ 2025 డిసెంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. మిగిలిన పనులన్నీ ఆరు నెలల్లోగా పూర్తి చేయాల్సింది. ఇప్పటికే వర్షాలు మొదలయ్యాయి. నిర్మాణాలు పూర్తి చేసేందుకు తక్కువ సమయం ఉండటంతో హడావుడిగా చేస్తున్నారు. పనుల్లో ఏమాత్రం నాణ్యత ఉండటం లేదు. జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ఎస్సార్బీసీ ఎర్రబిలుకు వాడుతున్నారు. ఆయా పనుల్లో నాణ్యతపై స్థానికులు, నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు

**వంతెనలు అంతేనా**

ప్రస్తుతం జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లో రెండో ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయి. ఆయా మండలాల్లో సుమారు 26 కి.మీ మేర రోడ్డు వేస్తున్నారు. జూపాడుబంగ్లా మండలంలో నాలుగు వరుసల రహదారి పనులు గ్రామాల వెలుపల చేపట్టారు. పాములపాడు మండలంలో మాత్రం రుద్రవరం, కృష్ణారావుపేట, ఎర్రగూడూరు గ్రామాల మీదుగా రహదారి వెళ్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో స్థానికులకు ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ వంతెనలు నిర్మిస్తున్నారు. జూపాడుబంగ్లా మండలం పరిధిలో చేపట్టిన పనులు సుమారు 60 శాతం పూర్తయ్యాయి. తాటిపాడు గ్రామం సమీపాన కేసీ కాల్వపై వంతెన, 80–బన్నూరు గ్రామం సమీపంలో ఆరు వంతెనలు నిర్మించాల్సి ఉంది. పాములపాడు శివారులోని పోలీస్ క్వార్టర్స్ సమీపాన పనులు నిలిచిపోయాయి. రుద్రవరం, కృష్ణారావుపేట, ఎర్రగూడూరు గ్రామాల్లో ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాల్సి ఉంది. పాములపాడు సమీపాన టోల్‌గేట్ ఏర్పాటు పనులు సాగుతున్నాయి.

# మునక పొలం.. వెనుక బేరం

నందికొట్కూరు : శ్రీశైల జలాశయం వెనుక జలాల్లో 'భూపంచాయితీలు తారస్థాయికి చేరాయి. నదిలో నీటి నిల్వ తగ్గడంతో మైదాన ప్రాంతంగా మారింది.. ఒండ్రు మట్టితో కూడుకుని ఉన్న ఆయా భూముల్లో పంటలు సాగు చేసుకొంటున్నారు. పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువగా ఉండటంతో సొంతం చేసుకోవడానికి రైతుల మధ్య పోటీ పెరిగింది. ఈ కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తి ఘర్షణలు జరుగుతున్నాయి. డిమాండ్ పెరగడంతో మరికొందరు అనధికారికంగా పొలాలను విక్రయిస్తున్నారు.

**ఏటా తేల్చని అధికారులు**

శ్రీశైలం జలాశయం నిర్మాణానికి పూర్వం కొత్తపల్లి మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం గ్రామాల్లో సుమారు 250 కుటుంబాల వారు నివసించే వారు. వీరు 1,300 ఎకరాల భూమిని సాగు చేసుకునే వారు. ముంపు తర్వాత పునరావాస ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నీరు తగ్గి తర్వాత పంటలు సాగు చేసుకొంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన మరికొందరు ఆయా గ్రామాలకు చేరుకొని అవన్నీ మా భూములే అంటూ పంచాయితీలు చేస్తున్నారు. గతేడాది ఈ అంశం అధికారుల దృష్టికి వెళ్లడంతో 145 సెక్షన్ విధించి సాగు ఆపేశారు. వాటిని నమ్ముకొన్న కుటుంబాలకు జీవనాధారం కరవైంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవిస్తున్నారు.

**అక్రమంగా విక్రయాలు**



నీటి ముంపు నుంచి తేలిన పొలాల్లో భూసారం ఎక్కువగా ఉండటంతో విత్తనం వేస్తే చాలు మంచి పంట దిగుబడి వస్తోంది. ఆయా భూముల్లో మొక్కజొన్న, మినుము, శనగ, కంది, పొగాకు పంటలు సాగు చేస్తున్నారు.

**రెండు పంటలు పండించుకుంటారు.**

ముంపు నుంచి బయటపడే సమయాన్ని బట్టి పొలాలకి ధర నిర్దేశిస్తున్నారు. ఎకరం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలుకు ఇస్తున్నారు. నది గర్భంలో ఉన్న పొలాలకు కౌలు ఎకరం రూ.5 వేలు పలుకుతోంది. నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల పరిధిలో సమస్యలు లేని భూములను స్థానికులు ఎకరం రూ.లక్ష నుంచి రూ.3 లక్షలకు విక్రయించారు. రూ.10 వేల వరకు కౌలు వసూలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లో సుమారు 200 ఎకరాల వరకు విక్రయించినట్లు సమాచారం. వీటికి రిజిస్ట్రేషన్లు లేకున్నా కాగితంపై రాసుకుని విక్రయాలు సాగిస్తున్నారు.

**63 గ్రామాలు.. 35 వేల ఎకరాలు**

నందికొట్కూరు నియోజకవర్గంలో 63 గ్రామాలు శ్రీశైలం జలాశయం నిర్మాణ సమయంలో ముంపునకు గురయ్యాయి. వాటి పరిధిలో సుమారు 35 వేల ఎకరాల వరకు పొలం ఉంటుంది. ఆయా భూములు జులై నుంచి నవంబరు వరకు నీటిలో మునిగి ఉంటాయి.

డిసెంబరు మొదటి వారం నుంచి కృష్ణానదిలో క్రమంగా నీరు తగ్గిపోయి భూములు తేలుతాయి. నిర్వాసితుల్లో చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇక్కడే ఉన్న కొందరు ఆయా భూముల్లో ఏటా పంటలు సాగు చేసుకొంటారు.

మునక భూములు సారవంతంగా ఉండటంతో పంటల దిగుబడి అధికంగా వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులు వాటిని సొంతం చేసుకొనే పనిలో పడ్డారు. గ్రామాలు వదిలివెళ్లిన వారు తిరిగొచ్చి తమ భూములు తామే సాగు చేసుకుంటామనడంతో ముంపు గ్రామాల్లో గొడవలకు దారి తీస్తోంది.

# ఏమీ లేదు గర్వకారణం

గిద్దలూరు : వైద్య విధాన పరిషత్ వైద్యశాల పరిధిలోని ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రం, మాతా శిశు వైద్యశాలల్లో అందిస్తున్న సేవలు, రోగుల సంఖ్య, వసతుల ఆధారంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ప్రతి నెలా ఆసుపత్రులకు గ్రేడ్‌లను కేటాయిస్తారు. జిల్లాలో వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 2 ప్రాంతీయ వైద్యశాలలు, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, మరో ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించి వీటిలో ఏ ఒక్కటీ ఎ గ్రేడ్ సాధించలేదు. యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలకు, కొండపిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మాత్రమే బి గ్రేడ్ దక్కింది. మిగిలిన గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, కనిగిరి, కంభం, చీమకుర్తి, దోర్నాల, దర్శి, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాలు సి గ్రేడ్‌తో సరిపుచ్చుకున్నాయి.

**ఇవీ వేధిస్తున్న వెతలు:**

కూటమి ప్రభుత్వం స్పెషలిస్టు వైద్యులను నియమించింది. అదే సమయంలో పూర్తిస్థాయిలో అధునాతన పరికరాలు అందుబాటులో లేకపోయాయి. దీంతో రోగులకు శస్త్రచికిత్సలు చేయలేని పరిస్థితి.

గత ప్రభుత్వం ప్రైవేట్ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాన్పులు, సిజేరియన్లకు అవకాశం కల్పించింది. దీంతో ప్రసవాల కోసం గర్భిణులను వారి కుటుంబ సభ్యులు ప్రైవేట్ వైద్యశాలలకు తీసుకెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య తగ్గిపోయింది. జిల్లాలోని పలు వైద్యశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మూలకు చేరింది. దోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం అందుబాటులో లేదు. పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మంజూరైనప్పటికీ వినియోగంలోకి తేలేదు.

గత వైకాపా పాలనలో గిద్దలూరు వైద్యవిధాన పరిషత్ వైద్యశాల భవనాన్ని గుత్తేదారుడు అసంపూర్తిగా నిర్మించి అప్పగించారు. కంటి శస్త్రచికిత్స, ఎముకల చికిత్స విభాగం, చెవి, ముక్కు, గొంతు విభాగాలకు చెందిన శస్త్ర చికిత్స పరికరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

నిధులకు చొరవ చూపితే మేలు: వైద్యశాలల్లో మౌలిక వసతులతో పాటు, అధునాతన పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

కంభం, దర్శి, దోర్నాల, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జనరేటర్ల ఏర్పాటుకు రూ.60 లక్షలు అవసరం. దర్శి, దోర్నాల, కొండపి, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డిజిటల్ ఎక్స్‌రే క్యాస్ట్ రీడర్ ఏర్పాటుకు రూ.32 లక్షలు కావాలి. గిద్దలూరు, యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలల్లో చెవి, ముక్కు, గొంతు సేవల విభాగానికి శస్త్ర చికిత్సల పరికరాల కోసం రూ.88.72 లక్షలు ఇవ్వాలి. కంటి చికిత్సల పరికరాల కోసం రూ.36.20 లక్షలు, ఎముకల విభాగం పరికరాల కోసం రూ.47 లక్షల నిధుల అవసరం. ఈ మేరకు జిల్లా అధికారులు రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ఖాళీగానే పోస్టులు: జిల్లా వ్యాప్తంగా వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 21 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, పదోన్నతి ద్వారా వచ్చే డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు 19, జనరల్ మెడిసిన్ పోస్టులు 2, సీఎస్ఆర్ఎంవో 2 ఖాళీగా ఉన్నాయి.

# ఆక్సిజన్ పార్కు సంరక్షణ 'గాలి'కొదిలేశారు



హిందూపురం : హిందూపురం సమీపంలోని తూమకుంట పారిశ్రామికవాడలో పలు పరిశ్రమలు ఉన్నాయి. వాటి నుంచి వెలువడే కాలుష్యం పట్టణ వాసులకు కష్టాలు తెస్తోంది. పరిశ్రమల నిర్వాహకులు పచ్చదనం పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కాలుష్య కట్టడికి వారిపై పర్యావరణ వాదుల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. ఆయా పరిశ్రమల నిర్వహణతో వారికి వచ్చిన లాభాల్లో నుంచి సమాజం కోసం ఖర్చు పెట్టాల్సిన కార్పొరేటు సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో పట్టణంలో మొక్కలు పెంచాలని యజమానులు నిర్ణయించారు. ఇందులో భాగంగా పారిశ్రామిక వాడలోని పరిశ్రమల నిర్వాహకులు ఓ సంఘంగా ఏర్పడి స్థలాన్ని చూపితే పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా ఆక్సిజన్ పార్కును ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావును సంప్రదించారు. మొక్కలు నాటడానికి సహకరించాలని కోరారు. దీంతో ఆయన చొరవ చూపి స్థలం విషయమై వివిధ శాఖల అధికారులతో చర్చలు జరిపారు.

**30 ఎకరాల్లో నాటితే..**

హిందూపురం పట్టణ సమీపంలో ఖాళీగా ఉన్న సడ్లపల్లి చెరువు స్థలంలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. అందరూ కలిసి మూడేళ్ల క్రితం రూ.27 లక్షల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి 30 ఎకరాల స్థలంలో దాదాపు 7 వేల మొక్కలు నాటారు. చుట్టూ ఇనుప తంతితో కంచె వేశారు. మొదట్లో అందరూ హడావుడి చేసినా తరువాత సంరక్షణను గాలికి వదిలేశారు. మొక్కలు నాటడానికి అయ్యే ఖర్చును భరించడం వరకే తమ బాధ్యత అన్నట్లు పరిశ్రమల నిర్వాహకులు భావించారు. తమకు ఎలాంటి సంబంధం లేదని ఏ ప్రభుత్వ శాఖా పట్టించుకోలేదు. మొక్కలకు నీటిని పోయడం, చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించడం తదితర పనులు జరగలేదు. దీంతో భారీగా మొక్కలు చనిపోయాయి. ఎండా కాలంలో అగ్ని ప్రమాదాలతో మరి కొన్ని మొక్కలు అగ్నికి ఆహూతయ్యాయి. చుట్టూ వేసిన ఇనుప కంచె చోరీకి గురైంది. ఇక్కడ 7 వేల మొక్కలు నాటితే ప్రస్తుతం 700 మాత్రమే మిగిలాయి. ప్రజలకు ప్రాణ వాయువు అందించాల్సిన ఆక్సిజన్ పార్కు అర్ధాంతరంగా తనువు చాలిస్తోంది.

**పరిశ్రమల నిర్వాహకులతో చర్చిస్తున్నాం**

-శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్

ఆక్సిజన్ పార్కులో మొక్కలు నాటడానికి మా అధికారులు, సిబ్బంది సహకరించారు. అయితే నిర్వహణను మున్సిపాలిటీకి అప్పగించలేదు. నిర్వహణ విషయమై నీటి పారుదల శాఖ, అటవీ శాఖతో పాటు పరిశ్రమల నిర్వాహకులతోనూ చర్చలు జరుపుతాం. మొక్కలు బతికించేందుకు చర్యలు తీసుకొంటాం.

# వసతులు కల్పిస్తేనే గృహయోగం



సూళ్లూరుపేట : మన్నారుపోలూరులో టిడ్కో ఇళ్ల సముదాయాలు ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణం 90 శాతం, రహదారులు, తాగునీటి పథకాలు, డ్రెయిన్లు తదితర 89 శాతం పనులు జరిగాయి. ఎలక్ట్రికల్ పనులు 95 శాతం మేర చేసేశారు. ఇక్కడ మొత్తం 1,632 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దొరవారిసత్రం మండలంలోని వేటగిరిపాళెం సమీపాన కాళంగి నదిలో బోర్లు ఏర్పాటు చేసి, ఇలుపూరు మీదుగా గొట్టాలను పూడ్చారు. నీటి పథకానికి విద్యుత్తు సరఫరా కావాల్సి ఉంది. ఇందుకు రూ.40 లక్షలు అవసరం. గాంధీనగర్ వద్ద 5120 టిడ్కో గృహాలను నిర్మించారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొన్ని ఇళ్లు దుస్థితికి చేరాయి. కొన్ని వసతులు లేకపోవడంతో అక్కడ నివసించే వారు ఇబ్బంది పడుతున్నారు. వీధి దీపాలు సరిగా లేవు. తాగునీరు అరకొరగా వస్తుండటంతో తంటాలు పడుతున్నారు. లబ్ధిదారులంతా ఇళ్లలో చేరకపోవడంతో గృహాల లోపల దుమ్మూధూళి పేరుకుని, దుర్గంధం వెదజల్లుతోంది.

రదవాడ వద్ద 2064 ఇళ్లు నిర్మిస్తున్నారు. 90 శాతం మేర పనులు పూర్తికావచ్చాయి. రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి పథకాల పనులు 78 శాతం జరిగాయి. మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు పూర్తయ్యాయి. నీటి పథకానికి విద్యుత్తు అవసరం, రూ.19 లక్షల నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. టిడ్కో డీఈ పార్థసారథిని వివరణ కోరగా.. మరో నెల రోజుల్లో పనులు పూర్తి అవుతాయని, తొందర్లోనే ప్రవేశాలు జరుగుతాయన్నారు.

**అసంపూర్తి పనులు పూర్తి చేయాలంటున్న టిడ్కో లబ్ధిదారులు**

ఏపీ టిడ్కో ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు ఇచ్చేందుకు చురుగ్గా పనులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. మృతి చెందిన వారి ఇళ్లను వైకాపా హయాంలో మార్పులు చేపట్టడంపై విచారణ కొనసాగుతోంది. జిల్లాలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, గూడూరు, శ్రీకాళహస్తి పురపాలక సంఘాల్లోని సముదాయాల్లో వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. చిన్న చిన్న పనులు పూర్తి చేసి ప్రవేశాలు కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు.

రాజీవ్‌నగర్ వద్ద టిడ్కో సముదాయ ఆవరణలో నిర్మాణం పూర్తయిన గృహాల సముదాయాల్లో అంతర్గత రోడ్లు దాదాపు పూర్తి చేశారు. తాగునీటి వసతి కల్పించాల్సి ఉంది. విద్యుత్తు అవసరాల పనులు పూర్తయ్యాయి. కొన్ని గృహాలకు తలుపులు, ద్వారబంధాలు ఏర్పాటు చేయాలి. మొత్తం 4064 ఇళ్లు కేటాయించగా.. 468 నిర్మాణం పూర్తయ్యాయి.

పురపాలిక పరిధిలో మొత్తం 1824 గృహాలకు గాను 1008 పూర్తి చేసి పంపిణీ చేపట్టారు. మిగతా గృహాలకు సంబంధించి పునాది దశలోనే కొన్ని, మధ్యలోనే మరికొన్ని ఆగాయి. వీటిలో కొన్ని బ్లాక్‌లకు కేటాయించిన స్థలాలను గత వైకాపా ప్రభుత్వం వ్యక్తిగత గృహాలకు స్థలాలు కేటాయించడంతో ఇక్కడ గృహ నిర్మాణాలు చేపట్టారు. దాంతో గృహ సముదాయాలకు కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారాయి. గృహాల మధ్య పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరిగాయి.

# అంగన్‌వాడీల్లో.. అసంపూర్తి పనులతో సరి!



చిత్తూరు : ఇది బైరెడ్డిపల్లె మండలం శెట్టిపల్లెలోని అంగన్‌వాడీ అసంపూర్తి భవనం. తెదేపా హయాంలో రూ.5 లక్షలతో భవనం మంజూరు చేశారు. వైకాపా ప్రభుత్వంలో గుత్తేదారుకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం అద్దె భవనంలోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీలను భవనాల కొరత వెంటాడుతోంది. గతంలో నిధులు మంజూరై సగం వరకు పనులు జరిగిన వాటికీ బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా నిర్మాణాలు ఆపేశారు. దీంతో అద్దె భవనాల్లో, అరకొర వసతుల మధ్యే పిల్లలను ఉంచాల్సి వస్తోంది. వర్షం వస్తే ఆరోజు చిన్నారులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిందే. ఇప్పటికైనా వీటిని పూర్తి చేసే దిశగా అడుగులు వేయాలి.

జిల్లాలో 2,420 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో మెయిన్ 1,795, మినీ 625. వీటిలో 0- 6 ఏళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఒత్తిడి లేని విద్య బోధించాలి. గర్భిణుల్లో రక్తహీనత, ఇతర సమస్యల నివారణకు ప్రతినెలా సరకులు ఇవ్వాలి. బాలింతలకు కూడా ఇదే తరహాలో కిట్ అందించాలి. చిన్నారులకు మధ్యాహ్నం బలవర్ధక ఆహారం సైతం అంగన్‌వాడీలో ఇస్తారు. భోజనం చేసేందుకు, బాలలు ఉండేందుకు వేర్వేరు గదులు ఉండాలి. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్ల సదుపాయం ఉండాలి.

**పలు పథకాల కింద మంజూరు చేసినా**

జిల్లావ్యాప్తంగా 1,080 అంగన్‌వాడీలకు సొంత భవనాలున్నాయి. అద్దె భవనాల్లో 577 ఉన్నాయి. మరో 763 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నా.. అవి ప్రభుత్వానికి చెందినవి కావడంతో నెలనెలా బాడుగ చెల్లించే దుస్థితి తప్పింది. ప్రైవేటు భవనాలు ఉన్నచోట అద్దెల భారం తగ్గించాలనే ఉద్దేశంతో కొన్నేళ్ల క్రితమే నూతన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. నాబార్డు, గృహ నిర్మాణ శాఖ, ఉపాధిహామీ తదితర పథకాల కింద నిధులు మంజూరు చేశారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడం, కొంతకాలానికి పథకం వ్యవధి పూర్తి అవ్వడంతో భవనాలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. జిల్లాలో ఇలా 134 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం మొదలైనా అసంపూర్తిగా ఉన్నాయి. వైకాపా హయాంలో ఇలాంటివాటిలో కొన్నింటిని 'నాడు- నేడు' కింద చేర్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా నిధులు మాత్రం విడుదల చేయలేదు.

**ఎప్పుడు కూలుతాయోనని భయం:** కుప్పం, పలమనేరు, పుంగనూరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లోని కొన్ని అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇవి ఎప్పుడు కూలుతాయోనని చిన్నారుల తల్లిదండ్రులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలంలో కేంద్రాలకు పంపించా లంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. వీటిని వేసవిలోనైనా పూర్తి చేస్తే ఇబ్బందులు తప్పుతాయి.

**నిధులు రాగానే ప్రారంభిస్తాం- వెంకటేశ్వరి, పీడీ, ఐసీడీఎస్**

జిల్లాలోని అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిధులు మంజూరు కాగానే పనులు పునః ప్రారంభిస్తాం. చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

# వసతులు మెరుగు.. పర్యాటకం పరుగు

నంద్యాల : జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, సుందరమైన నల్లమల అటవీ ప్రాంతం, కృష్ణానది అందాలు భక్తులు, పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో సరైన వసతుల్లేకపోవడం శాపంగా మారింది. గత వైకాపా ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పర్యాటక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి నడుం బిగించింది. ఇప్పటికే సీప్లేన్ నడిపేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని భక్తులు, పర్యాటకులు అధికంగా సందర్శించే ప్రాంతాల వద్ద వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

**అద్దాల మేడను వదిలేశారు**

కృష్ణానది ఒడ్డున సంగమేశ్వరం చెంత గతంలో తెదేపా హయాంలో రూ.1.30 కోట్లు వెచ్చించి రెస్టారెంట్ భవనాన్ని నిర్మించారు. వైకాపా హయాంలో నిర్వహణ చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది.

**ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో..**

మూడు నక్షత్రాల హోటళ్లతో పాటు సున్నిపెంట, పాణ్యం, పరమటూరు తదితర ప్రాంతాల్లో తలపెట్టిన పర్యాటకాభివృద్ధి పనులను పబ్లిక్- ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో చేపట్టనున్నారు. జిల్లాలో ఇంత వరకు మూడు నక్షత్రాల హోటళ్లు లేవు. తొలుత జిల్లా కేంద్రంలో ఈ హోటల్‌ను నిర్మించాలని నిర్ణయించారు. ఈ హోటల్ నిర్మాణంతో మహానంది, యాగంటి, భోగేశ్వరం, ఓంకారం వంటి పుణ్యక్షేత్రాలతో పాటు బెలుం, వాల్మీకి గుహలకు వచ్చే పర్యాటకులను ఆకర్షించనున్నారు. యువతకు ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు.



**నక్షత్ర హోటళ్లు.. రిసార్టులు**

జిల్లా కేంద్రం నంద్యాలలో త్రీస్టార్ హోటల్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2.5 ఎకరాల భూమి సేకరించాలని ప్రయత్నిస్తున్నారు. అహోబిలంలో నిర్మించనున్న త్రీస్టార్ హోటల్ కోసం జల వనరుల శాఖకు చెందిన 2.50 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించారు. సున్నిపెంటలో ఖాళీగా ఉన్న 178 ఎకరాల రెవెన్యూ భూమిలో 50 ఎకరాలను పర్యాటక శాఖకు బదలాయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ పెద్ద రెస్టారెంట్‌తో పాటు చిన్న పిల్లల పార్కులు, వసతి గదులు, వెల్త్ రిసార్టు ఏర్పాటు చేయనున్నారు. త్వరలో ఇక్కడ పనులు ప్రారంభం కానున్నాయి.

పాణ్యం సమీపంలో నాలుగు వరుసల రహదారికి పక్కనే ఐదెకరాల భూమిని సేకరించనున్నారు. ఇక్కడ లారీ డ్రైవర్లతో పాటు యాత్రికులు సేద తీరేందుకు రిసార్టులు ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఇక్కడ పర్యాటకశాఖకు బదలాయించిన భూమిని తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వీటితో పాటు సంజామల, బోయవాండ్లపల్లె, సంగమేశ్వరం గ్రామాల్లో పర్యాటకాభివృద్ధికి కేటాయించిన భూములను మ్యుటేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామ సమీపంలో బోటింగ్ ఏర్పాటుకు, చిన్న పిల్లల పార్కు అభివృద్ధికి కేసీ కాల్వకు చెందిన 2.5 ఎకరాల భూమిని తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# పాతాళంలో ధర.. పట్టని మొర

టంగుటూరు: జిల్లాలో సాధారణంగా శనగ పంటను నవంబర్, డిసెంబర్ మధ్యకాలంలో రైతులు సాగు చేస్తుంటారు. పశ్చిమ ప్రకాశంలోని వారు అక్టోబర్‌లోనే మొదలు పెడతారు. జిల్లా రైతులు కాక్-2, జేజే-11, బోల్ట్ రకాలను అధికంగా సాగు చేస్తున్నారు. కాక్-2 (తెల్ల శనగలు), జేజే-11 (ఎర్ర శనగలు) రకాల విత్తనాలు స్థానికంగా తీసుకుని సాగు చేయగా, బోల్ట్ రకం మాత్రం ఇండోర్ నుంచి రప్పించి పంట వేశారు. జిల్లాలో శనగ సాగు విస్తీర్ణం 49,177 హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది 25 వేల హెక్టార్లలో మాత్రమే పంట వేశారు. ఎకరాకు కాక్-2 రకం 7 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఈ ఏడాది 3 నుంచి 6 క్వింటాళ్లే వచ్చింది. దీంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందని రైతులు లబోదిబోమంటున్నారు.

**రైతుల ఎదురుచూపులు.. :** ప్రస్తుతం శనగ పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.5,650 (అన్ని రకాలకు కలిపి) ప్రకటించింది. అయితే ఈ ధర ఏ శనగ రకానికీ గిట్టుబాటు కావడం లేదు. ప్రస్తుత మార్కెట్‌లో కాక్-2 రకం రూ.6,800, బోల్ట్ రూ.9 వేలు, జేజే-11 రూ.6 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. గతేడాది బోల్ట్ రకం విత్తనాలను



ఏకంగా క్వింటా రూ.17 వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. గతేడాది ఈ రకానికి క్వింటా రూ.14, 15 వేల మధ్య ధర వచ్చింది. ఈ ఏడాది మాత్రం రూ.10 వేలు రావడం కూడా గగనమైంది. దీంతో గత్యంతరం లేక కోల్డ్ స్టోరేజీల్లోనే ఉంచేశారు. వారు మద్దతు ధరను పెంచాలని వారు కోరుతున్నారు.

**42 కేంద్రాలు ఏర్పాటుచేశాం**

భవిష్యత్తులో ధరలు పెరుగుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శనగ కొనుగోలు చేసేందుకు 42 కేంద్రాలను ఏర్పాటు చేశాం. 12,595 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతులు వచ్చాయి. కాకర్ల హరికృష్ణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

# రండి.. కొనేద్దాం

చిత్తూరు : వేసవిలో చక్కటి సువాసనతో అందరి నోరూరించే మామిడి పంట.. ఈ ఏడాది ప్రియం కానుంది.. వాతావరణ మార్పుల కారణంగా ఆలస్యంగా సీజన్.. ఆపై దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి.. టేబుల్ రకాల ధరలు ఈ ఏడాది ఆకాశాన్ని తాకనున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.. గురువారం చిత్తూరు కట్టమంచిలోని మార్కెట్ యార్డులో మామిడి సీజన్ మొదలైంది.. ఈ నెల 20 నుంచి పూర్తిస్థాయిలో వ్యాపారం మొదలు కానున్నదని మండీల యజమానులు చెబుతున్నారు.

**ధరపైనే ఆశ..**

చేతికొచ్చిన పంటకు మంచి ధర పలుకుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. గత నాలుగేళ్లుగా గిట్టుబాటు ధర లభించక మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ ఏడాది మామిడి పంట లభించిన రైతుల ఇంట సిరుల పంటే. సీజన్ ప్రారంభం నుంచే మామిడి ధరలు



ఆశాజనకంగా ఉంటాయని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

**టన్ను బేనీషా రూ.30 వేలు**

చిత్తూరు మార్కెట్ యార్డుకు తొలుత బేనీషా, పులేరా, కాదర్ కాయలు చేరాయి. యార్డులో కాదర్ టన్ను రూ.35–40 వేలు, బేనీషా రూ.30–35 వేలు, పుల్లేరా రూ.15–20 వేలు పలుకుతోంది. తోతాపురి టన్ను ధర ప్రారంభంలోనే రూ.15–20 వేలు పలకనుందని వ్యాపారులు పేర్కొంటున్నారు జూన్ ప్రారంభం నుంచి వ్యాపారం జోరందుకుంటుందని మండీ యజమానులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

**త్వరలో చిత్తూరుకు ఎగుమతిదారులు..**

కట్టమంచిలోని మార్కెట్ యార్డులో 25 మండీలు ఉండగా.. 15–17 మండీల్లోనే వ్యాపారం సాగుతోంది. ఏటా చిత్తూరు నుంచి బేనీషా, తోతాపురి వంటి టేబుల్ రకాల మామిడి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఇప్పటికే మహారాష్ట్ర, న్యూఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడి మండీల యజమానులతో సంప్రదింపులు జరిపారు. వీరందరూ సోమవారం చిత్తూరుకు చేరుకోనున్నారు.

# మార్కులిచ్చారు.. మార్పులు చూపాలి!

అనకాపల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో అందించే సేవలు, పనితీరు ఆధారంగా జిల్లాలకు మార్కులు కేటాయించారు. సీజనల్ వ్యాధుల కట్టడి నుంచి మాతా, శిశు ఆరోగ్యం వరకు 11 అంశాల్లో సంతృప్తి స్థాయిలు, లోటుపాట్లను లెక్కించి జిల్లాల వారీగా ప్రకటించిన ర్యాంకింగ్‌ల్లో 79.41 మార్కులతో అనకాపల్లి 15వ స్థానంలో నిలిచింది. కొన్ని రకాల సేవల్లో మిగతా జిల్లాల కంటే మెరుగ్గా ఉంటే, మరికొన్ని అంశాల్లో పనితీరు మార్పులను సూచించారు. ఇటీవల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించిన సమీక్షా సమావేశంలో వీటిని వెల్లడించారు.

**'ప్రాథమిక'ంగానే లోపాలు..**

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే (పీహెచ్‌సీ) కీలకంగా పనిచేస్తాయి. అనకాపల్లి జిల్లాలో 54 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పనితీరు ఆధారంగా పది మార్కులకుగాను జిల్లాకు 7.26 మార్కులే వచ్చాయి. వైద్యులు తనిఖీల కోసం వచ్చేవారితో స్నేహపూర్వకంగా మెలుగుతున్నారా? ఉచితంగా మందులు ఇస్తున్నారా? తనిఖీలు చేసి వైద్యం అందిస్తున్నారా అనే అంశాలు ఆధారంగా ఈ మార్కులు కేటాయించారు. జిల్లాల్లో కొన్నిచోట్ల వైద్యులు, సిబ్బంది సకాలంలో ఆరోగ్య కేంద్రాలకు వెళ్లడం లేదు.

**వీటిలో మెరుగవ్వాలి**

అసంక్రమిత వ్యాధుల వ్యాప్తి తీవ్రత గుర్తించేందుకు చేస్తున్న ఎన్‌సీడీ సర్వే అనకాపల్లి జిల్లాలో నత్తనడకన సాగుతోంది. 18 ఏళ్లు దాటినవారు 13,75,607 మంది ఉంటే వారిలో ఇప్పటివరకు 7,87,649 మందిని (57.26 శాతం) మాత్రమే సర్వే చేశారు. ఈ అంశంలో పది



మార్కులకు 6.17 మాత్రమే వచ్చాయి.

గర్భిణిల తనిఖీలు నాలుగు దశల్లో జరగాలి. జిల్లాలో మొదటి రెండు తనిఖీలు బాగా జరుగుతున్నాయి. తర్వాత దశ తనిఖీలు సక్రమంగా జరగడం లేదు. ఈ విభాగంలో దృష్టిసారించాల్సిన జిల్లాలు విభాగంలో అనకాపల్లిని చేర్చారు. ఈ జిల్లాలో 72 శాతం మందికి మాత్రమే పూర్తిస్థాయి తనిఖీలు జరుగుతున్నాయి.

మాతృమరణాల రేటు (ఎంఎంఆర్) ఎక్కువగా ఉన్న జిల్లాల్లో అనకాపల్లి రెండో స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. గిరిజన ప్రాంతమైన అల్లూరి జిల్లా (124) తర్వాత అనకాపల్లిలో ఎంఎంఆర్ రేటు 76గా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి జిల్లాలో 41 మలేరియా కేసులు నమోదైతే ఈ ఏడాది ఏకంగా 124 కేసులు నమోదయ్యాయి.

**ఈ అంశాల్లో కాస్త బాగు..**

ఆసుపత్రి ప్రసవాల విషయంలో మిగతా జిల్లాలతో పోల్చితే అనకాపల్లి పనితీరు మెరుగ్గా ఉంది. శస్త్రచికిత్సలు కంటే సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగే జిల్లాల్లో నాలుగోస్థానంలో నిలవడం ఊరటనిచ్చే అంశం. ఆసుపత్రుల్లో అందించే సేవల నాణ్యత విషయంలో వివిధ సంస్థలు ఇచ్చే రేటింగ్‌లో అనకాపల్లి జిల్లా రెండో స్థానంలో నిలిచింది.

# రాప్తాడులో కుండపోత



అనంతపురం : జిల్లాలో తెల్లవారుజామున మేఘాలు గర్జించాయి. ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ముఖ్యంగా రాప్తాడు మండలంలో ఎడతెరిపి లేకుండా రెండు గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. వరద ఉద్ధృతికి కాలనీలు వణికిపోయాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరకులు, దుస్తులు తడిసిపోయాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి.

**వణికిన శివారు కాలనీలు**

కుండపోత వర్షం శివారు ప్రాంతాలను వణికించింది. అనంతపురం నగరం, రాప్తాడు శివారు గ్రామాలు అకాల వర్షానికి అతలాకుతలమయ్యాయి. చేనేత మగ్గాల గుంతల్లోకి నీరుచేరింది. పిడుగుపాటుకు రాప్తాడులోని ఓ నివాసం నెర్రెలు చీలింది. కందుకూరు వద్ద సీపీఐ కాలనీలోకి ఉన్నఫళంగా వరదనీరు చేరింది. భారీగా నీరు రావడంతో ధాన్యం కొట్టుకొనిపోగా పేదలు కట్టుబట్టలతో మిగలడంతో కన్నీటి పర్యంతమయ్యారు. నీటిలో చిక్కుకున్న వృద్ధులు, చిన్నారులు, మహిళలను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకొచ్చి రక్షించారు. సీపీఐకాలనీ వద్ద కాలువకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టడంతో నీరు వెళ్లే దారి లేక ఇళ్లలోకి చేరింది. శిల్ప లేపాక్షినగర్ పూర్తిగా జలమయమైంది. కార్లు, ద్విచక్ర వాహనాలు నీటిలో సగం వరకు మునిగాయి. ఇక్కడ ఎర్రవంకకు అడ్డంగా గోడను నిర్మించడంతో నీరు బయటకు వెళ్లేందుకు వీలులేక ఇళ్ల ముందే నిలబడింది. అధికారులు వెళ్లి గోడను తొలగించిన అనంతరం నీరు సాఫీగా వెళ్లింది. ఆకుతోటపల్లి ఇందిరమ్మ కాలనీ, రాప్తాడు మైనార్టీ కాలనీ, రాప్తాడు వద్ద ఉన్న జగనన్న కాలనీలోకి భారీగా వరద నీరు చేరి ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించారు.

**వంకకు అడ్డంగా మట్టి**

నగరం శివారులోని రజకనగర్‌లో ఓ వ్యక్తి నడిమి వంకకు అడ్డంగా మట్టి వేసి రోడ్డు ఏర్పాటు చేసుకోవడంతో రజకనగర్, బాలాజీనగర్, గౌరవ్ గార్డెన్‌లోకి వరద నీరు చేరాయి. గురువారం అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, నగరపాలక ఇంజినీరింగ్ సిబ్బంది వెళ్లి మట్టిని తొలగించారు. వంక తనదేనని, తనవద్ద పట్టా ఉందంటూ సదరు వ్యక్తి వాదనకు దిగాడు.

**సహాయక చర్యలు వేగిరం..**

వరదలు ముంచెత్తడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సహాయక చర్యలు చేపట్టారు. శిల్పా లేపాక్షినగర్‌లో వరద నీరు ఎక్కువగా ఉండటంతో అనంతపురం ఆర్డీవో కేశవనాయుడు, అనంతపురం గ్రామీణ తహసీల్దారు మోహన్ పొక్లెయిన్‌లో వెళ్లి ప్రహరీని తొలగించి వరద నీరు వెళ్లే ఏర్పాట్లు చేశారు. కందుకూరు సీపీఐకాలనీలోకి వరద రాకుండా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మి కాలువకు అడ్డుగా మట్టితో కట్టను ఏర్పాటు చేయించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కాలనీవాసులకు ఉదయం, మధ్యాహ్నం భోజనాలు సమకూర్చారు.

**సగటున 16.9 మి.మీ.వర్షపాతం**

అనంత జిల్లాలో 16.9 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. రాప్తాడు మండలంలో 141.2 మి.మీ. భారీ వర్షం కురిసింది. కళ్యాణదుర్గం 53.2, ఆత్మకూరు 38.0, బ్రహ్మసముద్రం 35.0, బుక్కరాయసముద్రం 34.2, శెట్టూరులో 27.6, పామిడి 26.4, నార్పల 25.6, అనంతపురం 24.6, రాయదుర్గం 12.4, కంబదూరు 12.2, గుమ్మఘట్ట 10.2, యాడికి 10 మి.మీ. చొప్పున వర్షం కురిసిందని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. **రహదారి కోత.. నిలిచిన రాకపోకలు** శెట్టూరు: మండలంలోని ఐదుకల్లు నుంచి బ్రహ్మసముద్రం మండలం సూగేపల్లికి వెళ్లే రోడ్డు కోతకు గురై కొట్టుకుపోయింది. దీంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు ఈ రోడ్డులోనే వెళ్లాల్సి ఉంది.

# పారదర్శకతకు ప్రాధాన్యం

శ్రీకాళహస్తి : దేవాలయాల సందర్శనకొచ్చే భక్తులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు దేవాదాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆరు ప్రధాన ఆలయాల్లో భక్తుల వసతులకు సంబంధించి ప్రశ్నావళితో క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల్లోనూ ఈ తరహా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది.

**ప్రక్షాళన లక్ష్యంగా**

వైకాపా హయాంలో దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో అవినీతి, అక్రమాలు యథేచ్ఛగా జరగడం, భక్తుల బాగోగులు పట్టించుకోకపోవడం తదితర అంశాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు తలెత్తిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం భక్తుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకోవడం, వాటిని ఆయా ఆలయాల ఉన్నతాధికారులకు పంపి పరిష్కరించడం




లక్ష్యంగా చేసుకుంది. ఈ మేరకు ఆలయాల్లో భక్తులు ఎక్కువ మంది గుమికూడే ప్రదేశాల్లో సమస్యలు విన్నవించుకునేందుకు వీలుగా 'క్యూఆర్' కల్గిన సూచికలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

**ప్రశ్నావళితో.. ఆరా**

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే ఆలయ దర్శనంపై సర్వే పేరుతో ప్రశ్నావళి వస్తుంది. ప్రధానంగా దర్శనం సంతృప్తిగా జరిగిందా..?, మౌలిక వసతులు, టాయ్‌లెట్స్, తాగునీరు, రవాణా సౌకర్యాలు, వెయిటింగ్ ఏరియా?, ప్రసాదం తాజాగా రుచిగా ఉందా..?, పారిశుద్ధ్యం సంతృప్తికరంగా ఉందా అన్న ప్రశ్నలకు అవును, కాదు అన్న రీతిలో సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. అనంతరం సీఎంవో, దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాలకు సమాచారం వెళ్తుంది. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం వాళు ఫిర్యాదుదారుడితో మాట్లాడటమే కాకుండా సమస్యలను ఆయా ఆలయాల ఈవోల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా పారదర్శకతకు ప్రాధాన్యమిచ్చేలా ప్రభుత్వం ఈ వెసులుబాటును తీసుకొచ్చింది.

**గ్రేడ్లతో మార్కులు**

ఫిర్యాదుదారులతో నేరుగా సీఎంవో కార్యాలయ సిబ్బంది మాట్లాడి సమాచారం సేకరించి వాటి పరిష్కారం విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చూపుతున్న చొరవకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రేడ్లు ఇవ్వడం విశేషం. ఉమ్మడి జిల్లాలో శ్రీకాళహస్తీశ్వరాలయం గత మూడు నెలల్లో పారిశుద్ధ్యం, ప్రసాదాల రుచి తదితర వాటిల్లో ప్రథమ స్థానంలో, మిగిలిన రెండు అంశాలకు సంబంధించి నాలగైదు స్థానాల్లో నిలుస్తోంది. ఇక కాణిపాకం ఆలయానికి వస్తే మొదటి నాలుగు స్థానాల్లో ముందు, వెనుకగా నిలుస్తుండటం విశేషం.

# పెన్నాలో.. ఇసుక వేట



తాడిపత్రి : తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో పెన్నానదిలోని ఇసుకను అక్రమార్కులు దోచేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. ప్రధానంగా పెద్దపప్పూరు, తాడిపత్రి మండలం, పట్టణం, పెద్దవడుగూరు మండలాల పరిధిలో పలు గ్రామాల్లో ఇసుకను అక్రమంగా తరలించి పెన్నానదిని కొల్లగొడుతున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పెద్దపప్పూరు పరిధిలోని అశ్వర్థ ఆలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని పెన్నానదిలో పట్టపగలే ఇసుకను తరలిస్తున్నారు. నదిలో పెద్ద ఎత్తున గుంతలు బయటపడుతున్నాయి. అశ్వర్థ ఆలయానికి వచ్చే భక్తులతో పాటు, ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సైతం నీరు ప్రవహించే సమయాల్లో ఆ గుంతల్లో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

**గత పాలకుల పాపం**

గత వైకాపా ప్రభుత్వంలో ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ఇప్పటికే పలువురు నీటి గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోయారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించే అధికారులు సైతం కాసులకు కక్కుర్తిపడటంతో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నదిలో సరిహద్దులేసుకొని మరీ దోపిడీ**

నియోజకవర్గంలో ప్రభుత్వ ఇసుక రేవులు లేకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. నదిలో హద్దులు వేసుకొని మరీ ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. సామాన్యులు నదిలోకి వెళ్లే పరిస్థితి లేదు. చిన్నపాటి అవసరాలకు ఇసుక తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తే అక్రమార్కులు భయపెట్టి వారికి అనుకూలంగా ఉన్న అధికారులతో వాహనాలను జప్తు చేయిస్తున్నారు.

**అనుమతి లేకుండా తీసుకెళ్తే చర్యలు – బాలాజీరాజు, తహసీల్దారు, పెద్దపప్పూరు**

ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించం. రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు అమలు చేస్తాం. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ఇసుక రేవు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడతాం.

**కేరాఫ్ అడ్రస్ గార్లదిన్నె**

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పెద్దపప్పూరు మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన వారు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని పొలాల్లో ఇసుకను డంప్ చేసి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు.

ట్రాక్టర్ ఇసుక రూ.8 వేలు నుంచి రూ.10 వేలు, టిప్పర్‌కైతే రూ.20 వేల నుంచి రూ. 25 వేల వరకు విక్రయిస్తున్నారు. జూటూరు, చింతలపల్లి గ్రామాల్లో సైతం ఇసుక అక్రమంగా తరలిపోతోంది.

పెద్దపప్పూరులో తహసీల్దారు, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఓ శాఖ అధికారులు ముడుపులు తీసుకొని అటువైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

# కుట్టకముందే కట్టడి చేద్దాం..

అనకాపల్లి : కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో కొన్నిచోట్ల నీరు నిల్వ ఉండిపోతోంది. దోమలు పెరగడానికి, వ్యాధులు ప్రబలడానికి ఇది అత్యంత అనువైన పరిస్థితి. దీనికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోకుంటే దోమలు పెరిగి డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదముంది. అనకాపల్లి జిల్లాలో గతంతో పోలిస్తే ప్రస్తుతం డెంగీ కేసులు తగ్గాయి. దీనిని పూర్తిగా అరికట్టేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం మూడు పద్ధతులను పాటించాలంటూ పిలుపునిస్తోంది. 'పరిశీలించండి.. శుభ్రం చేయండి.. మూతలు పెట్టండి..' అంటూ జిల్లాలో వైద్య సిబ్బంది ప్రచారం చేస్తున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్‌తోపాటు పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రత పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

డెంగీ వైరల్ జ్వరం. ఈడిస్ ఈజిప్టై అనే దోమ పగటి సమయంలో కుడుతుంది. దీని ద్వారా డెంగీ జ్వరం సోకుతుంది. ఒక్కసారిగా అధిక జ్వరం, తలనొప్పి, కంటి వెనుక కండరాల భాగంలో నొప్పి, చర్మంపై ఎర్రటి మచ్చలు వంటివి డెంగీ లక్షణాలు. ప్రస్తుతం దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంది. మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఫాగింగ్ కార్యక్రమాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఈ ఏడాది నర్సీపట్నంలోని థెరెసా కాలనీ, కోటవురట్ల మండలం అల్లుమియాపాలెం, మాకవరపాలెం మండలం వెంకన్నపాలెం, నాతవరం మండలం చమ్మచింత, మల్లుభూపాలపట్నం, పిచ్చిగంటికొత్త



గూడెం, గొలుగొండ మండలం ఎ.ఎల్.పురం ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయి. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం పురపాలికలోని ఎనిమిది వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమం చేపడుతున్నారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేసి దోమల లార్వా నియంత్రించేందుకు రసాయన మందు పిచికారీ చేయించనున్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన పెంచేందుకు ర్యాలీలు నిర్వహించనున్నారు. డెంగీ కారక దోమల నియంత్రణకు మూడు అంశాలకు ఈ ఏడాది ప్రాధాన్యం ఇస్తున్నారు. దోమలు పుట్టి పెరిగేందుకు వీలున్న ఆవాసాలను గుర్తించేలా, వాటిని శుభ్రం చేయించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నారు.

**పరిసరాల పరిశుభ్రత పాటించాలి– వరహాల దొర, జిల్లా మలేరియా అధికారి**

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీని నివారించవచ్చు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మూడు పద్ధతులను పాటించి డెంగీ నివారణపై ప్రభుత్వం ఈ ఏడాది పొడవునా ప్రచారం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం పట్టణాలు. గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు చేపడతాం. డెంగీ నివారణ అందరి బాధ్యత.

# రూపాయికే క్యూబిక్ మీటరు మట్టి

అనంతపురం : అన్నదాతల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రసాయన ఎరువుల వాడుకంతో చప్పగా ఉన్న నేలలను సారవంతంగా మార్చుకోడానికి బహుళ ప్రయోజనాన్ని సర్కారు కల్పిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సొంత గ్రామాల పరిసరాల్లో ఉన్న చెరువు, జలాశయాల్లో ఒండ్రు మట్టిని పొలాల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మట్టిని పొలాల్లో కలపడం వల్ల పంట దిగుబడి రెట్టింపు స్థాయిలో వస్తుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. మోతాదుకు మించి వాడుతున్న రసాయన మందులు, ఎరువులకు చెక్ పెట్టడానికి ఇదొక మార్గంగా భావిస్తోంది. **మీటరు లోతు దాకా.!**

చెరువు, జలాశయాల్లోని ఒండ్రు మట్టిని రైతులు తమ పొలాల్లో తీసుకెళ్లడానికి రాష్ట్ర సర్కారు అనుమతి ఇచ్చింది. ఎక్కడికక్కడ జలవనరుల శాఖ(ఎంఐ) డివిజన్ల ఈఈలకు దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశిత ప్రాంతాల్లోని చెరువు, జలాశయాల పరిస్థితిని బట్టి అనుమతి ఇస్తారు. క్యూబిక్ మీటరు ఒండ్రు మట్టిని తవ్వుకుని తీసుకెళ్లడానికి రూపాయి చెల్లించాలి. ఎప్పటికపుడు మట్టిని తీసుకెళ్లాలి. గుట్టగా ఉంచకూడదు. ఒక మీటరు లోతు దాకా మాత్రమే తవ్వుకోవాలి. జలాశయం/



చెరువు కట్ట పక్కనే తవ్వకూడదని ఎంఐ ఎస్ఈ గారపాటి విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మండలాల ఏఈల ద్వారా ఈఈలకు దరఖాస్తు చేసుకుంటే సత్వరమే అనుమతి ఇస్తామన్నారు.

వాణిజ్య పరమైన అవసరాలకు ఎటువంటి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వరు.

# బ్లాక్ ఔట్ ఫిట్‌లో వామిక అరాచకం


తెలుగు ప్రేక్షకులకు భలే మంచి రోజు సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ వామికా గబ్బి. ఈ అమ్మడు తెలుగులో ఆ తర్వాత పెద్దగా నటించలేదు. కానీ మలయాళం, పంజాబీ సినిమాలతో బిజీ బిజీగా ఉంది. సుదీర్ఘ కాలం తర్వాత తెలుగులో గూఢచారి సినిమా సీక్వెల్ జీ2 లో నటిస్తుంది. తెలుగులో మొదటి సినిమా తో నిరాశ పరిచిన ముద్దుగుమ్మ వామికా గబ్బి ప్రస్తుతం చేస్తున్న సినిమాతో హిట్ కొడుతాను అనే నమ్మకంతో ఉంది. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ప్రస్తుతం వామిక జీ2 మాత్రమే కాకుండా తమిళ్‌లో రెండు, పంజాబీలో ఒకటి, హిందీలో రెండు, మలయాళంలో ఒక సినిమాను చేస్తుంది. ఒకేసారి అర డజను సినిమాలు చేస్తున్న హీరోయిన్స్ చాలా అరుదుగా ఉంటారు. వామిక చేతిలో ప్రస్తుతం అర డజను సినిమాలు ఉన్నాయి. వామిక గబ్బి గత ఏడాది కేవలం ఒకే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వరుణ్ దావన్ హీరోగా రూపొందిన బేబీ జాన్ సినిమాలో కీర్తి సురేష్‌తో పాటు వామికా గబ్బి కూడా హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమా నిరాశ పరచినా కూడా వామిక కి మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది అనడంలో సందేహం లేదు. గత ఏడాదిలో ఈమె చేసిన సినిమాలు పెద్దగా విడుదల కాకపోవడంతో ఈసారి ఆ లోటును భర్తీ చేసే విధంగా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో రాబోతుంది. ఈ ఏడాది ఆరంభంలోనే వామిక గబ్బి నుంచి భూల్ చుక్ మాఫ్ అనే హిందీ సినిమా వచ్చింది. త్వరలో మరో సినిమాతో ఈమె ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సినిమాలతో చాలా బిజీగా ఉన్న వామికా సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో వామికా గబ్బి బ్లాక్ ఔట్ ఫిట్ ఫోటో షూట్ పిక్స్‌ను షేర్ చేసింది. సాధారణంగానే వామికా గబ్బి




ప్రతి ఫోటో షూట్‌లో అందంగా కనిపిస్తూ ఉంటుంది. కానీ ఈ సినిమాలో అంతకు మించి అన్నట్లుగా ఉందని కామెంట్స్ వస్తున్నాయి. బ్లాక్ డ్రెస్‌లో ముద్దుగుమ్మలు చాలా అందంగా ఉంటారని వామికా మరోసారి నిరూపించింది. ఆమె స్కిన్ టోన్‌కి బ్లాక్ డ్రెస్ అద్భుతంగా సెట్ అయిందని, ఈ డిజైనర్ బ్లాక్ డ్రెస్‌లో వామికా మెరిసి పోతుందని నెటిజన్స్ సైతం తెగ కామెంట్ చేస్తూ ఫోటోలను షేర్ చేస్తున్నారు. నెట్టింట ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. వామికా ఫోటోలు అరాచకం అంటూ పలువురు కామెంట్ చేస్తున్నారు. 1993లో చండీగఢ్‌లోని పంజాబీ ఫ్యామిలీలో జన్మించిన ఈ అమ్మడు అక్కడే సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించింది. అక్కడే డీఏవీ కాలేజ్‌లో ఆర్ట్స్ లో డిగ్రీ పూర్తి చేసింది. మోడలింగ్ పై ఆసక్తితో మొదటి నుంచి ఈమె ఆ దిశగా అడుగులు వేసింది. చదువు పూర్తి అయిన తర్వాత ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. తమిళ చిత్రం మాలై నెరత్తు మయక్కం సినిమాతో నటించడం ద్వారా పరిచయం అయింది. తక్కువ సమయంలోనే ఈ అమ్మడికి అన్ని భాషల్లోనూ నటించే అవకాశాలు దక్కాయి. ఈ అమ్మడి లక్ తో పెద్దగా హిట్స్ లేకున్నా కూడ ఆ వరుస సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. ముందు ముందు టాలీవుడ్‌లో ఈ అమ్మడు మరిన్ని సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి.

# లిప్ కిస్ తో మధుబాల అసౌకర్యంగా!

పెదవి ముద్దులంటే ఇప్పుడు సర్వసాధారణం. దాదాపు హీరోయిన్లు అంతా ఎలాంటి అడ్డుచెప్పకుండా నటిస్తున్నారు. ఇంటిమేట్ సన్నివేశాల్లోనూ అంతో ఓపెన్ గా నటిస్తున్నారు. ఇండస్ట్రీకి వచ్చే ఏ నటి అయినా ఇలాంటి సన్నివేశాల్లో నటించడం సహజంగా మారింది. సన్నివేశం రక్తికట్టాలంటే ఆ మాత్రం సాహసించనిదే పనవ్వదు దర్శకులు రాజీకి రావడం లేదు. ఈ విషయంలో పాత తరం దర్శకులు కూడా తక్కువేం కాదు. సీన్ విషయంలో అప్పటి డైరెక్టర్లు కూడా ఎక్కడా రాజీ పడేవారు కాదు. అలా ఓ ముద్దు సీన్ విషయంలో అలనాటి అందాల హీరోయిన్ మధుబాల లాక్ అయినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించింది.



ఇండస్ట్రీకి వచ్చే ముదే షరత్తులు పెట్టుకునే వచ్చానని..కానీ వచ్చిన తర్వాత ఓ సందర్భంలో ఆ రూల్ ని బ్రేక్ చేయాల్సి వచ్చిందన్నారు. స్కిన్ షోలు..ముద్దు సన్నివేశాల్లో నటించడం తనకు ఎంత మాత్రం ఇష్టముండదన్నారు. ఇలా నటించని కారణంగా చాలా సినిమాలు వదులుకున్నట్లు తెలిపారు. అయితే ఓ సినిమా షూటింగ్ సమయంలో సెట్ లోకి అడుగు పెట్టిన తర్వాత ముద్దు సన్నివేశంలో నటించాలని చెప్పారు. 'అందుకు నేను అంగీకరించలేదు. కానీ అక్కడ ఆ సీన్ చాలా ముఖ్యమైని టీమ్ పట్టుబట్టింది. దీంతో నేను కూడా కాదనలేకపోయాను. తెగించి ముద్దు సీన్ లో నటించాను.

అలా నటించడం నన్ను ఎంతో ఇబ్బంది పెట్టింది. చాలా అసౌకర్యంగా ఫీలయ్యాను. తీరా సినిమా రిలీజ్ తర్వాత ఆ సీన్ లేదు. ఎడింటింగ్ లో తీసేసారు. అలాగని నేనెళ్లి దర్శకుడితో గొడవ పెట్టుకోలేదు. సినిమా కోసం ఎలాంటి సన్నివేశంలోనైనా నటించాలని సీనియర్లను చూసాక అర్ధమైంది. బాలీవుడ్ లో చాలా అవకాశాలు వచ్చినా కండీషన్లు బ్రేక్ చేయాల్సి ఉంటుందని చెప్పడంతో అవకాశం వదులుకున్నట్లు' తెలిపారు.





# వీరమల్లు.. ఇలాగైతే ఎప్పటికి?



టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో హరి హర వీరమల్లు సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. యాక్షన్, అడ్వెంచర్ జోనర్ లో క్రిష్, జ్యోతికృష్ణ వహించిన ఆ మూవీని మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఏఎం రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ హీరోయిన్ గా, అనుపమ్ ఖేర్, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే ఎప్పుడో ప్రారంభమైన వీరమల్లు షూటింగ్.. కొన్ని రీజన్స్ వల్ల లేట్ అవుతూ వచ్చింది. క్రిష్ కొంత భాగం తెరకెక్కించగా, ఆ తర్వాత దర్శకత్వం బాధ్యతలను జ్యోతికృష్ణ తీసుకున్నారు. ఇన్నేళ్లు సెట్స్ పై ఉన్న మూవీకి రీసెంట్ గా పవన్ డేట్స్ కేటాయించడంతో షూటింగ్ పూర్తయింది. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే.. రెండు రోజుల క్రితం సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. కానీ వీఎఫ్ ఎఫ్ వర్క్స్ పెండింగ్ ఉండడంతో మరోసారి రిలీజ్ ను వాయిదా వేశారు మేకర్స్. త్వరలో కొత్త రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేస్తామని చెప్పారు. కానీ సోషల్ మీడియాలో హరి హర వీరమల్లు కొత్త విడుదల తేదీపై రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. జులై 4 అని, జులై 25 అని జోరుగా కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై మేకర్స్ రెస్పాండ్ అయ్యి.. తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా మరికొన్ని రోజుల్లోనే విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. అప్పటి వరకు మీ సపోర్ట్, లవ్ ఉండాలని కోరుకుంటున్నట్లు నాలుగు రోజుల క్రితం చెప్పారు. దీంతో అనౌన్స్మెంట్ వచ్చేస్తుందని ఆశపడ్డారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఏం జరుగుతుందో తెలియదు కానీ మేకర్స్ ఇంకా విడుదల ఎప్పుడు అనేది ప్రకటించలేదు. దీంతో ఇప్పుడు సినీ ప్రియులు, పవన్ ఫ్యాన్స్.. రిలీజ్ డేట్ కోసం పోస్టులు పెడుతున్నారు. రత్నం గారు.. కొత్త విడుదల తేదీని అనౌన్స్ చేయండని కోరుతున్నారు. ఏం జరుగుతుందని క్వశ్చన్ చేస్తున్నారు. అయితే వీరమల్లు డిజిటల్ హక్కులు కొనుగోలు చేసిన అమెజాన్ ప్రైమ్ వీడియో.. ఆగస్టులో సినిమాను స్ట్రీమింగ్ చేద్దామని నిర్ణయించుకుందట. కానీ మేకర్స్ సినిమాను వాయిదా వేశారు. దీంతో కొత్త రిలీజ్ డేట్ కోసం రీసెంట్ గా అమెజాన్ ప్రైమ్ నిర్వాహకులతో నిర్మాత డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. మరి ఎప్పుడు వీరమల్లు రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేస్తారో వేచి చూడాలి.

# ఫస్ట్ హాఫ్ తో సూపర్ స్టార్ ఫుల్ ఖుషీ!




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. అన్ని పనులు పూర్తి చేసుకుని ఆగస్ట్ 14న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. గోల్డ్ స్మగ్మింగ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో రజనీ కాంత్ స్మగ్లర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ సహా ప్రచార చిత్రాలన్నీ మంచి బజ్ ని తీసుకొచ్చాయి.

ఈ నేపథ్యంలో ట్రైలర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందా? అని అంతా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. అయితే అంతకన్నా గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ఈ సినిమా ప్రథ మార్ధం రజనీకాంత్ చూసి సర్ ప్రైజ్ అయ్యారుట. ఔట్ పుట్ చూసి రజనీ చాలా సంతోషంగా ఉందని ఫీడ్ బ్యాక్ ఇచ్చారుట. ద్వితియార్ధం ఇంకా రెడీ కాకపోవడంతో పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. సెకెండాఫ్ కూడా చూసి రజనీకాంత్ రివ్యూ ఇస్తే సంగతేంటి? అన్నది తేలిపోతుంది. ఈ చిత్రాన్ని లోకేష్ కనగరాజ్ భారీ కాన్వాస్ పై రూపొందించారు. అమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వాళ్ల మధ్యలో రజనీకాంత్ వస్తే ఇంకెలా ఉంటుందో ఊహకే అందదు. మూడు దశాబ్దాల తర్వాత రజనీకాంత్-సత్య రాజ్ ఒకే ఫ్రేమ్ లో కనడటం అన్నది మరో హైలైట్. తొలిసారి ఇద్దరు 1986లో విడుదలైన 'మిస్టర్ భరత్'లో కలిసి కనిపించారు. ఆ తర్వాత మళ్లీ రజనీకాంత్ సినిమాల్లో నటించే అవకాశం వచ్చినా సత్య రాజ్ ఎందుకనో ఛాన్స్ తీసుకోలేదు. 'ఎందిరన్' ,' శివాజీ' లాంటి చిత్రాల్లో సత్యారాజ్ కి కీలక పాత్ర ఆఫర్ చేసారు. అయినా నటించలేదు. మళ్లీ ఇంత కాలానికి లోకేష్ కనగరాజ్ వాళ్లను కలిపాడు.

# మాజీ లేడీ ఎంపీ కిల్లర్ ఫోజులు!

సినీగ్లామర్ రాజకీయాల్లోకి రావడం సహజం. చాలామంది అగ్రతారలు రాజకీయ రంగంలో ఎదిగారు. అదే కోవకు చెందుతుంది నటి నుస్రత్ జహాన్. బెంగాలీ మాజీ ఎంపీ నుస్రత్ జహాన్ రాజకీయాలు- సినిమాలు రెండు రంగాల్లోను ముందుకు సాగుతోంది. నూస్రత్ సోషల్ మీడియాల్లో నిరంతరం అభిమానులకు టచ్ లో ఉంది. ఈ భామ హీటెక్కించే ఫోటోషూట్లు ఎప్పుడూ చర్చనీయాంశం. నూస్రత్ కి ఇన్ స్టాగ్రామ్ లో 28లక్షలు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఈ భామ ఫోటోషూట్లకు భారీ ఫాలోయింగ్ పెరుగుతోంది. రోజు రోజుకి అనుచరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇటీవల బాగా బరువు తగ్గి స్లిమ్ లుక్ లో కనిపిస్తున్న నూస్రత్ టోన్డ్ ఫిజిక్ కుర్రకారు గుండెల్ని కొల్లగొడుతోందని చెప్పాలి. తాజాగా మరోసారి నలుపు రంగు డిజైనర్ దుస్తుల్లో కనిపించింది. అయితే టోన్డ్ లెగ్స్ సొగసును కూడా నూస్రత్



తెరపరిచింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. నిజానికి నుస్రత్ జహాన్ పేరు కొన్నేళ్ల క్రితం వివాదాలలోకొచ్చింది. ఒక బిడ్డకు తల్లి అయినా కానీ, ఈ భామ ఎందులోను తగ్గేదేలే! అని నిరూపిస్తోంది. చూస్తుంటే నూస్రత్ తిరిగి కథానాయికగా పెద్ద అడుగు వేసేందుకు ప్రయత్నిస్తోందని అర్థమవుతోంది. ఆరంభం బుల్లితెర సూపర్ స్టార్ గా వెలిగిన నుస్రత్ గ్లామర్ కోణం అందరినీ ఆకర్షిస్తుంది. నూస్రత్ గ్లామరస్ ఫోటోషూట్లతో నిరంతరం యువతరంలో ఫాలోయింగ్ పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారు. గ్రేస్ అండ్ బోల్డ్ గ్లామర్ ప్రదర్శనతో నూస్రత్ మరోసారి చర్చల్లోకొచ్చింది. ఈ భామ మోనోక్రోమ్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, భారీ పరిమాణంలో ఉన్న నల్ల జాకెట్ ఆఫ్-షోల్డర్ లుక్ ఆశ్చర్యపరిచింది.

# ఖాళీగా ఉన్నా సమంత కాన్ఫిడెన్స్ కోల్పోలేదు!

స్టార్ హీరోయిన్ గా వెలిగిన భామ ఒక్కసారిగా అవకాశాలు రాకపోయినా? వచ్చిన అవకాశాలు నచ్చక వదులు కున్నా? కొంత గందరగోళానికి గురవుతుంటారు. గ్యాప్ అన్నది అతి పెద్ద సమస్యగా మారుతుంది. ఈ క్రమంలో ఎంతో ఒత్తిడికి గురవుతుంటారు. స్టార్ ఇమేజ్ ను కోల్పోతున్నామనే బెంగ ఏర్పడుతుంది. కానీ సమంత మాత్రం ఎక్కడా కుంగలేదు. అంతే సంకల్ప బలంతో ముందుకెళుతుంది. ఖుషీ వరకూ సమంత ఎంత బిజీగా ఉందో తెలిసిందే. ఆ తర్వాత అమెరికా వెళ్లి ఏడాది పాటు రెస్ట్ తీసుకుని తిరిగొచ్చిన తర్వాత ఇంతవరకూ హీరోయిన్ గా ఒక్క సినిమా రిలీజ్ చేయలేదు. సీరియస్ గా బాలీవుడ్ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నా రావడం లేదు. కొన్ని వెబ్ సిరీస్ లకు అయిన కమిట్ మెంట్లు తప్ప? సమంతకు మాత్రం



అక్కడ అవకాశం రావడంలేదు. సమం త కన్నా వెనకెళ్లిన వాళ్లు కూడా బిజీ అవుతున్నారు గానీ సామ్ మాత్రం ఇంతవరకూ ఒక్క సినిమాకు సంతకం చేయలేదు.అలాగని టాలీవుడ్ లో చేస్తుందా? అంటే ఇక్కడా అదే పరిస్థితి. ఇక్కడ అవకాశాలు వస్తున్నా? నటించడం లేదు. ఇంకా ఇతర పరిశ్రమల్లోనూ ఇదే పరిస్థితి. ఇలాంటి సమయంలో ఏనటిపైనా నెగివిటీ స్ప్రెడ్ అవు తుంది. సమంతపైనా ఇలాంటి కథనాలెన్నో. ఈ నేపథ్యంలో సామ్ సక్సెస్ గురించి కొన్ని విలువైన సంగ తులు చెప్పింది. 'అసలైన విజయం అంటే స్వేచ్ఛ. అభివృద్ధి , పరిణితి సాధించడం. దేనికి బంధీగా మారకూడదు. అదే నిజమైన స్వేచ్ఛ. రెండేళ్లగా సినిమాలు చేయకపోయినా నేను ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. విరా మాన్ని ఆస్వాదించా. ఎంతో స్వేచ్ఛగా విహరించాను. నా చుట్టూ ఉన్నా వారు ఇదేంటి ఖాళీగా ఉండి ఇలా మాట్లాడుతుందనునకుంటారు? కానీ నా వ్యక్తిగత దృష్టిలో నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. నా పనులే నాలో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536